

గురువారం 3 సెప్టెంబరు 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగానికి కౌంట్‌డౌన్

రేపు షార్ రెండో వేదికపై రాకెట్ ప్రయోగం

శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్

- వివరాలు 15 లో..











## గోదావరి సుజలాం... ఉత్తరాంధ్ర సుఫలాం...

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రలోకి అడుగుపెట్టాయి. పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ప్రవహించిన గోదారమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక పూజలు జరిపారు. పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని అనంతరం అక్కడే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనకాపల్లికి గోదారమ్మ తరలివచ్చిన భావోద్వేగ వాతావరణం మధ్య పోలవరం ఎడమ కాలువలో నిలుచుని గోదావరి జలాలకు పుష్పాలు, పసుపు, కుంకుమ సమర్పించిన సీఎం జలహారతి ఇచ్చారు. అరుణవర్ణంలో పరవళ్లు తొక్కుతూ వస్తున్న గోదావరి జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం చేశారు. అనంతరం స్థానిక రైతులతో కలిసి రెగ్యులేటర్ గేట్లను ఎత్తారు. కాలువకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో చేరిన స్థానికులు, రైతులు, మహిళలు పుష్పాలతో జలాలకు స్వాగతం పలికారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

4






# ఉత్తరాంధ్రకు గోదావరి జలహారం

- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి చేరిన గోదావరి జలాలు
- పాయకరావుపేట క్రాస్ రెగ్యులేటర్ వద్ద నీటిని విడుదల చేసిన ముఖ్యమంత్రి
- నాలుగు జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- తన హయాంలో ప్రాజెక్టులు, జలసంరక్షణకే ప్రాధాన్యమిస్తున్నానన్న చంద్రబాబు
- గోదావరి నీళ్లు తీసుకొచ్చిన సీఎంకి కృతజ్ఞతలు తెలిసిన ఉత్తరాంధ్ర రైతులు

2

“ ‘తూర్పు కనుమలు, అడవులు, నదులు, వాగులు, వంకలు, హైవేలను దాటుకుని అన్నవరం సత్యదేవుడి ఆశీస్సుల కోసం గోదారమ్మ ఇక్కడకు వచ్చింది. వచ్చే ఏడాది సింహాచలం అప్పన్న చెంతకు తీసుకెళ్తాం. ఆపై అరసవల్లి సూర్యనారాయణస్వామి వద్దకు తరలించి వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం’ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఉత్తరాంధ్రకు గోదావరి నీటిని విడుదల చేశారు. అనంతరం సీతారాంపురంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ ఇకపై ఈ ప్రాంతంలోనూ పంటలు పండుతాయన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకా పల్లి జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తొలి దశలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ”



### గొడ్డలి పార్టీ సొంతవాళ్లని చంపి మనపై నెడుతుంది

# టీడీపీ కేడర్ అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్సీపై ఆరోపణలు చేసి పారిపోవడం కాదు... వాస్తవాలు ఉంటే ధైర్యంగా చర్చకు రండి
- స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో గెలుపొందాలి
- చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- నర్సరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్

6

‘బాబాయిని, సొంత కార్యకర్తలను చంపి, ఆ నెపాన్ని మనపై నెట్టేసే ప్రబుద్ధుడు జగన్. గొడ్డలి పార్టీ అరాచకాలను ప్రజలకు తెలియజెప్పాలి. వైసీపీ దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలి’ అని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన నర్సరావుపేట నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే వారిని పదవులు వెదుక్కుంటూ వస్తాయన్నారు. డీఎస్సీపై ఆరోపణలు చేసి పారిపోవడం కాదు వాస్తవాలు ఉంటే ధైర్యంగా నిలబడి నిరూపించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో గెలుపొందాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

చైతన్యరథం



# ఉత్తరాంధ్రకు గోదావరి జలహారం

- అనకాపల్లి చేరిన గోదారమ్మకు సీఎం జలహారతి
- జలం, జీవం, జీవితం... నీరుంటేనే సాగు బాగు
- సీఎంగా ఉన్న ప్రతిసారీ ప్రాజెక్టులకు, జలసంరక్షణకే ప్రాధాన్యం
- పాయకరావుపేట క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఉత్తరాంధ్రకు నీటి విడుదల
- నాలుగు జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- పోలవరం ఎడమ కాలువలో జలాలకు సీఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు, సాష్టాంగ ప్రణామం
- గోదావరి నీళ్లు తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ఉత్తరాంధ్ర రైతుల ధన్యవాదాలు



అనకాపల్లి (చైతన్యరథం): పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రలోకి అడుగుపెట్టాయి. పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ప్రవహించిన గోదారమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక పూజలు జరిపారు. పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని అనంతరం అక్కడే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనకాపల్లికి గోదారమ్మ తరలివచ్చిన భావోద్వేగ వాతావరణం మధ్య పోలవరం ఎడమ కాలువలో నిలుచుని గోదావరి జలాలకు పుష్పాలు, పసుపు, కుంకుమ సమర్పించిన సీఎం జలహారతి ఇచ్చారు. కాలువకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో చేరిన స్థానికులు, రైతులు, మహిళలు పుష్పాలతో జలాలకు స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. అరుణవర్ణంలో పరవళ్ల తొక్కుతూ వస్తున్న గోదావరి జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం చేశారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గోదావరి జలాలకు జలహారతి అనంతరం క్రాస్ రెగ్యులేటర్ వద్దకు చేరుకుని స్థానిక రైతులతో కలిసి రెగ్యులేటర్ గేట్లను ఎత్తారు. ప్రస్తుతం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన నీటితో తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9.23 లక్షల మందికి తాగునీరు ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళిక చేసింది. తాండవ, వరాహ, శారద నదులతో పాటు ఏలేరు కాలువలపై సైఫన్లు, అక్విడెక్టులను నిర్మించింది. ఎడమ కాలువ కోసం ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.4,192 కోట్లు వ్యయం చేసింది. ఎడమ కాలువ ద్వారా వచ్చిన నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జలవనరుల శాఖ ప్రణాళిక రూపొందించిం ది. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరాహ, మామిడిగెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న 46,620 ఎకరాల స్థిరీకరణ జరగనుంది. దీంతో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక అవసరాలకు, తాగు, సాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీల నీటిని తరలించేలా ప్రణాళిక చేసినట్టు సీఎంకు జలవనరుల శాఖ అధికారులు వివరించారు.

## ఉత్తరాంధ్రలో బీళ్లన్నీ ఇక పంటలే

అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలు పండుతాయన్నారు. అనకాపల్లి జిల్లాలో అడుగుపెట్టి ఉత్తరాంధ్రకు తరలివచ్చిన గోదారమ్మకు ప్రణమిల్లుతున్నానని తెలిపారు. గోదావరి మూడు పాయలైన గౌతమి, వశిష్ఠ, వైనతేయ సముద్రంలో కలుస్తుందగా... ఇప్పుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి తరలి వచ్చిందన్నారు. తూర్పు కనుమలు, అడవులు, నదులు, వాగులు, వంకలు, హైవేలను దాటుకుని అన్నవరం సత్యదేవుడి ఆశీస్సుల కోసం గోదారమ్మ ఇక్కడకు వచ్చిందన్నారు. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లామని, ఆపై అరసవల్లి సూర్యనారాయణస్వామి వద్దకు తరలించి వంశధార వరకు గోదావరిని జలాలను తరలిస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేలా ప్రణాళిక రూపొందించామని సీఎం తెలిపారు. తొలి దశలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని చంద్రబాబు తెలిపారు. మరో రూ.800 కోట్లు ఖర్చు చేసి మొత్తం పనులు పూర్తి చేస్తామన్నారు. ఏలేరు కాలువపై సైఫన్, పంపా, తాండవ, వరాహ నదులపై అక్విడెక్టులు నిర్మించి కాలువ పనులు పూర్తి చేశామని చెప్పారు. తాళ్లపాలెంలో భూ వివాదాన్ని పరిష్కరించి నిర్వాసితులకు పునరావాసం కల్పించామన్నారు. లెఫ్ట్ కెనాల్‌లో ప్రవహిస్తున్న ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం, ప్రభుత్వ సమర్థత ఉన్నాయని సీఎం పేర్కొన్నారు.

## కూటమి వచ్చాక పోలవరానికి శాప విముక్తి

2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టు సాకారం కావడానికి ఏడు ముంపు మండలాలను రాష్ట్రంలో విలీనం చేసేలా కృషి చేశానని చంద్రబాబు తెలిపారు. ప్రతి సోమవారాన్ని పోలవారంగా మార్చుకుని 2019 వరకు 72 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. డయాఫ్రంవాల్ కొట్టుకుపోయిందని అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించడం ద్వారా ప్రజలే పోలవరానికి శాప విముక్తి కల్పించారన్నారు. రాష్ట్రంలో ఏ మంచి జరిగినా తామే చేశామంటూ గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారానికి పాల్పడుతోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, వెలిగొండ ప్రాజెక్టు... తామే కట్టామని చెప్పుకుంటోందన్నారు. ప్రజలు ఛీ కొట్టినా ఆ పార్టీకి సిగ్గు రావట్లేదన్నారు. అనకాపల్లికి నీరు కూడా తామే పారించామని చెప్పుకుంటారని, పోలవరం పూర్తయితే మా గొప్పే అంటారన్నారు. నేర చరిత్ర ఉన్న గొడ్డలి పార్టీది విధ్వంసమే అసలు నైజమని ముఖ్యమంత్రి అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకురావడం అంత సులభంగా జరగలేదన్నారు. గంటలు, రోజులవారీగా లక్ష్యాలు పెట్టుకుని పనులను పరుగులు పెట్టించామని తెలిపారు. ఎడమ ప్రధాన కాలువను మరింత విస్తరించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు చెప్పారు. రూ.3,200 కోట్లతో ఉత్తరాంధ్రలోని 12 ప్రధాన ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ.35వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. గత రెండేళ్లలో సాగునీటి రంగంలో రూ.25 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. గోదావరి-కృష్ణా సహా రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. చంద్రబాబు అనే నేను 2015 సెప్టెంబరు 16న పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తీసుకెళ్లానని.... 2017 ఆగస్టు 15న పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ప్రారంభించామని గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు అనే నేను 2026 సెప్టెంబరు 2న గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకువచ్చానని ముఖ్య మంత్రి అన్నారు. తాను సీఎంగా ఉన్న ప్రతిసారీ సాగునీటి ప్రాజెక్టులు, నీటి సంరక్షణ కోసమే పనిచేశానని వివరించారు.

## ఇక ఉత్తరాంధ్రకే వలసలు

నీరు పుష్కలంగా ఉంటే పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధికి భద్రత ఉంటుందని సీఎం చెప్పారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు భారీ పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. ఆరు నెలల క్రితం అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. పెద్ద డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు వస్తున్నాయని, ఆసియా మొత్తాన్ని అనుసంధానించే సబ్‌సీ కేబుల్ కనెక్టివిటీ కూడా రానుందని తెలిపారు. హార్బర్లు, మూలపేట పోర్టు ద్వారా తూర్పు తీరాన్ని మధ్య భారత్‌తో అనుసంధానిస్తామన్నారు. హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి తరహాలో అనకాపల్లి అభివృద్ధికి చిరునామాగా మారుతుందని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లడం కాదు... ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి వస్తుందని. ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుందని ముఖ్యమంత్రి వివరించారు. విశాఖ ఇక ఏఐ పట్నంగా మారుతుందని సీఎం తెలిపారు. గూగుల్ హబ్‌గా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుందని చెప్పారు. డేటా సెంటర్లకు నీరు, విద్యుత్ కొరత వస్తుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటితో పోలిస్తే పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే నీటి సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అన్ని డేటా సెంటర్లకూ కేవలం 5 టీఎంసీల నీరు సరిపోతుందని.. ఎడమ కాలువ ద్వారా రోజుకు 2 టీఎంసీల నీరు తీసుకెళ్లే సామర్థ్యం ఉందన్నారు. అనంతరం సభా వేదిక నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి ఎడమ కాలువను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన జలవనరుల శాఖ ఇంజినీర్లను సత్కరించారు.

కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, పి.నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కె.పార్థసారథి, ఎంపీలు చింతకాయల విజయ్, సీఎం రమేష్, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





# గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర సస్యశ్యామలం

### పాయకరావుపేటలో పోలవరం ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసిన సీఎం చంద్రబాబు

పాయకరావుపేట (చైతన్యరథం): రాష్ట్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించారు. హెలిపాడ్ వద్దకు చేరుకున్న సీఎంకు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. అక్కడి నుంచి పోలవరం ఎడమ కాల్వ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు జరిపి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేశారు. గోదావరి జలాల రాకతో మా ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందంటూ రైతులు, ప్రజలు హర్షధ్వానాలు చేశారు. శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం, అక్కడ ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రూప్ ఫొటోలు దిగారు.













# గోదావరి సుజలాం..
# ఉత్తరాంధ్ర సుఫలాం...



పాయకరావుపేట (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా పవిత్ర గోదావరి జలాలు ఉత్తరాంధ్ర భూభాగాన్ని తాకాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం (సీతారాంపురం) వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించారు. తొలుత పీఎల్ పురంలో సీఎంకు జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలవరం ఎడమ ప్రధాన కాలువ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ కాలువ ప్రాంతానికి చేరుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గోదారమ్మకు జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. రెగ్యులేటర్ ఆన్ చేసి అధికారికంగా నీటిని విడుదల చేశారు. అనంతరం పాయకరావుపేటలో సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం రైతులు, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సభా వేదిక మధ్యలో ర్యాంప్ వాక్ చేస్తూ వచ్చిన వారిని ఉత్సాహపరిచారు.

















ECT LEFT MAIN CANAL











చైతన్యరథం

# హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.. పవర్ స్టార్



అమరావతి (చైతన్యరథం): 'మిత్రులు, జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. పవర్ స్టార్‌గా అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా ఉండే మీరు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. పంచాయతీరాజ్ శాఖలో అనేక సంస్కరణలతో, అభివృద్ధి కార్యక్రమాలతో పెనుమార్పులు తెస్తున్నారు. గిరిజన ప్రజల కష్టాలు తీర్చేలా రోడ్ల నిర్మాణం నుంచి పచ్చదనం పెంపు వరకు మీరు తీసుకుంటున్న చర్యలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయి. మార్పును ఆవిష్కరిస్తున్నాయి. రాష్ట్ర పునర్నిర్మాణం విషయంలో ప్రజలకు కూటమి ఇచ్చిన మాటను నిజం చేసేలా అనునిత్యం పనిచేస్తున్న మీరు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకునేలా ఆశీర్వదించాలని ఆ దేవదేవుడిని ప్రార్థిస్తున్నాను' అంటూ పవన్‌కల్యాణ్‌కి సీఎం చంద్రబాబు సామాజిక మాధ్యమం వేదికగా బర్త్‌డే విషెస్ చెప్పారు.

# పవనన్న వందేళ్లు వర్ధిల్లాలి



అమరావతి (చైతన్యరథం): 'డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు. సినీ అభిమానులకు పవర్ స్టార్, జనసైనికులకు సేనాని, నాకు దేవుడిచ్చిన అన్నయ్య పవనన్న. ఆయన ఆయురారోగ్య ఆనందాలతో వందేళ్లు వర్ధిల్లాలి. తెలుగు రాష్ట్రాల్లో పండగను తలపించేలా పవనన్న జన్మదిన వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అభిమానులకు అభినందనలు.' అంటూ పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## గొల్లగుప్ప విద్యార్థిని మృతికి

# మంత్రి లోకేష్ ప్రగాఢ సంతాపం



అమరావతి (చైతన్యరథం): 'పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్పకు చెందిన బాలిక మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విద్యార్థిని మృతికి నా ప్రగాఢ సంతాపం. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. మలేరియా నివారణ మాత్రలు తీసుకుని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. మెరుగైన వైద్యం అందించి, అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యేంత వరకు పర్యవేక్షించాలని పోలవరం జిల్లా యంత్రాంగాన్ని కోరాను. బాలిక మృతిపై నివేదిక ఇవ్వాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించాను.' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

# హరికృష్ణ మావయ్యకి ఘన నివాళి



అమరావతి (చైతన్యరథం): 'టీడీపీ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యుడు... మా నందమూరి హరికృష్ణ మావయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. చెదరని చిరునవ్వు, ఆత్మీయత ఆయన సొంతం. హరి మావయ్య నటుడిగా, ప్రజా నేతగా అందరి ప్రేమాభిమానాలు పొందారు. ఆయన భౌతికంగా దూరమైనా తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచే ఉంటారు.' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా నివాళులర్పించారు.

# కోటప్పకొండ దేవాలయాన్ని సందర్శించిన మంత్రి లోకేష్

# త్రికోటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు





నర్సరావుపేట (చైతన్యరథం): పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా నర్సరావుపేట సమీపంలోని కోటప్పకొండ దేవాలయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం సాయంత్రం సందర్శించారు. తొలుత ఆలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేష్‌కు వేద పండితులు, ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి త్రికోటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ అధికారులు మంత్రి లోకేష్‌ను ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.చంద్రశేఖర్‌రావు, సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.









## గొడ్డలి పార్టీ సొంతవాళ్లని చంపి మనపై నెడుతుంది

# టీడీపీ కేడర్ అప్రమత్తంగా ఉండాలి



- **డీఎస్సీపై ఆరోపణలు చేసి పారిపోవడం కాదు... వాస్తవాలు ఉంటే ధైర్యంగా చర్చకు రండి**
- **స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో గెలుపొందాలి**
- **చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు**
- **నర్సరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్**

నర్సరావుపేట (చైతన్యరథం): 2019లో బాబాయిని కిరాతకంగా చంపేసి చంద్రబాబు చేతిలో కత్తిపెట్టి నారాసుర రక్తచరిత్ర అని అవినీతి విష పుత్రిక సాక్షి పేపర్‌లో రాశారు. అదేమని అడిగితే చిన్నపిల్లాడు, తెలియక చంపేశాడని తన తమ్ముడిని సమర్థించడం జగన్ రెడ్డికే చెల్లుతుందని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఎద్దేవా చేశారు. బుధవారం జరిగిన నర్సరావుపేట నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం రెంటచింతలలో ఒక చెన్నారెడ్డి అనే వ్యక్తి చనిపోతే ఏపీలో జంగిల్ రాజ్ అని జగన్ ట్వీట్ చేశారు. జగన్ చెన్నారెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డికి ఫోన్ చేసి బ్రహ్మారెడ్డి చంపాడు కదా అంటే గొడ్డలి పార్టీ కార్యకర్తలే తన బిడ్డను చంపారని చెప్పాడు. బాబాయిని, సొంత కార్యకర్తలను చంపి, ఆ నెపాన్ని మనపై వేసే ప్రబుద్ధుడు జగన్. తెలుగుదేశం పార్టీకి తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయి. గొడ్డలి పార్టీకి గంజాయి, బూతులు, మహిళలను అవమానించే అనుబంధ విభాగాలు వున్నాయి. తెలుగుదేశం పార్టీలో రెండో తరం, మూడో తరం వచ్చింది. వైసీపీలో భూ కబ్జాలు, హిట్ అండ్ రన్, భార్యను వేధించే నాయకులు వచ్చారు. గొడ్డలి పార్టీ అరాచకాలన్నింటినీ ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది. వైసీపీ దుష్ప్రచారాలను టీడీపీ కేడర్ సమర్థవంతంగా తిప్పికొట్టాలి అని లోకేష్ పిలుపునిచ్చారు.

### పార్టీ కోసం పనిచేస్తే పదవులు వెదుక్కుంటూ వస్తాయి

పల్నాడుకు ముఖద్వారం, పౌరుషాల పురిటిగడ్డ నర్సరావుపేట. ఎంతో మంది గొప్ప నాయకులను తయారుచేసిన నేల నర్సరావుపేట. ఏపీ తొలి స్పీకర్ వెంకట్రామయ్య చౌదరి. ఉమ్మడి రాష్ట్ర 3వ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాష్ట్ర విభజన తర్వాత తొలి స్పీకర్‌గా పనిచేసిన 'పల్నాడు పులి' కోడెల శివప్రసాద్ వంటి నేతలను అందించిన ఈ నేల అభివృద్ధికి కారణం తెలుగుదేశం పార్టీయే. టీడీపీ ఆవిర్భావానికి ముందు పల్నాడు అంటే ఫ్యాక్షనిజం అనే పేరుండేది. కోడెల ఎమ్మెల్యే అయ్యాక ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారు. అభివృద్ధి చేసి చూపించారు. 2019లో ఓడిపోయినా అరవిందబాబు కార్యకర్తలకు అండగా నిలబడి తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంపీ, ఎమ్మెల్యే అద్భుతంగా కలసికట్టుగా ముందుకు సాగుతున్నారు. టీడీపీలో వర్గాలు ఉండవు. తెలుగుదేశం అనే ఒకే ఒక వర్గం మాత్రమే ఉంటుంది. వర్గాలపేరుతో కావాలని కొందరు చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తారు. అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండండి. నేను ఈరోజు రాష్ట్ర మంత్రిగా మీ ముందు నిలబడటానికి కారణం తెలుగుదేశం. కార్యకర్తలు నాతో లేకపోతే నేను ఎవరు? పనిచేసే కార్యకర్తలను గుర్తించే బాధ్యత నాది. 2025 మహానాడులో నా మనసుకు దగ్గరైన శాసనం కార్యకర్తే అధినేత. పార్టీ ఆవిర్భావం రోజున కార్యకర్తలను అధినేత పక్కన కూర్చోబెట్టాం. మంత్రులంతా కింద కూర్చున్నారు. పార్టీ కోసం మీరు పనిచేస్తే ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేదు, పదవులు వెదుక్కుంటూ మీ వద్దకే వస్తాయి.

### డీఎస్సీ ఆరోపణల్లో నిజం ఉంటే నిలబడి నిరూపించాలి

డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి ప్రతిపక్ష నేతగా ఉండటం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం. 150 కేసులు వేసినా 150 రోజుల్లో విజయవంతంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. రాబోయే రోజుల్లో మరో మూడు డీఎస్సీలు ఇచ్చి టీచర్ పోస్టులు భర్తీచేసే బాధ్యత నాది. డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్‌తో చర్చకు నేను రెడీ. ఆరోపణలు చేసి పారిపోవడం కాదు, వారి ఆరోపణల్లో వాస్తవాలు ఉంటే ధైర్యంగా నిలబడి నిరూపించాలి. రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులు భర్తీ చేసే బాధ్యతను కూడా నేను తీసుకుంటా. లక్షలాది యువత కలలను నెరవేరుస్తా. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల గురించి నేను చెప్పాల్సిన పనిలేదు.

### కార్యకర్తలకు ఉచితంగా మందులు అందిస్తాం

కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160కోట్లు ఖర్చు పెట్టిన ఏకైక పార్టీ టీడీపీ. తెలుగుదేశం పార్టీ కోటి మంది సభ్యులు గల అతి పెద్ద కుటుంబం. సమస్యలు ఉంటే నాలుగు గోడల మధ్య పరిష్కరించుకుందాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి బూత్ కీలకమైనదే. మై టీడీపీ యాప్ ద్వారా పనిచేసే కార్యకర్తలను గుర్తించి, నామినేటెడ్ పదవులు ఇస్తాం. పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేయండి. చేసిన పనిని మై టీడీపీ యాప్ ద్వారా తెలియజేయండి. క్లస్టర్, యూనిట్ నాయకులకు కేంద్ర కార్యాలయంలో ట్రైనింగ్ ఇచ్చాం. శిక్షణకు వచ్చిన వారికి రక్తపరీక్షలు చేయిస్తే, 75శాతం మందికి వివిధ వ్యాధులు ఉన్నాయి. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తాం. జీవితాంతం వారికి మందులు అందించే బాధ్యత నాది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలు అందరిపైనా ఉంది.

### బీసీలకు తీరని ద్రోహం చేసిన జగన్

జగన్ సీఎం అయ్యాక స్థానిక సంస్థల్లో బీసీలకు 10శాతం రిజర్వేషన్ తగ్గించి 17వేల పదవులకు దూరం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేబినెట్‌లో తీర్మానం చేశాం. వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి వాటిని కూడా అడ్డుకోవాలని చూస్తున్నారు. 2019-24 నడుమ బీసీ బిడ్డలను వైసీపీ నేతలు అతి కిరాతకంగా చంపేశారు. తన అక్క ను ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను కిరోసిన్ పోసి తగులబెట్టారు. తోట చంద్రయ్య, నందం సుబ్బయ్యలను దారుణంగా హతమార్చారు. మాజీ మంత్రి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి పారిపోయాడు. అప్పలరాజు మరో వ్యక్తిని ప్రవేశపెట్టాడు. చనిపోయింది యాదవ సామాజికవర్గ వ్యక్తి. కనీసం ఆ కుటుంబాన్ని ఆదుకోలేదు. జగన్ బడా చోర్ అయితే... కారుమూరు నాగేశ్వరరావు చోటా చోర్. మద్యం రవాణాలో అక్రమ సొమ్ము కోడలు ఖాతాలో

(తరువాయి 8లో..)



## గొడ్డలి పార్టీ సొంతవాళ్లని చంపి మనపై నెడుతుంది

# టీడీపీ కేడర్ అప్రమత్తంగా ఉండాలి



(7వ పేజీ తరువాయి.. )

జమ చేశాడు. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయన్ను జైలుకు పంపితే మనపై నెపం వేస్తున్నారు. వైసీపీ దుష్ప్రచారాలపై కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలి.

**స్థానిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవాలి**

మరో నెలరోజుల్లో రానున్న మున్సిపల్, పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా భారీ మెజారిటీతో గెలుపొందాలి. ప్రస్తుతం మనం జనసేన, బీజేపీలతో కలిసి ముందుకు వెళ్తున్నాం. 2029లోనే కాదు మరో మూడు సార్లు కూడా కూటమిగానే కలసికట్టుగా ఎన్నికలకు వెళ్లి గెలుస్తాం. చిన్నచిన్న సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుందాం. నో మిస్ ఫైర్, నో క్లాస్ ఫైర్. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో నేతృత్వాన డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేస్తున్న సంక్షేమం, జీతాలు, పెన్షన్లకు కేంద్రం సహకారం ఉంది. కార్యకర్తలు ఇగో, అహంకారాలకు దూరంగా ఉండాలి. ప్రజలతో కనెక్ట్ కావాల్సిన బాధ్యత కేడర్‌పై ఉంది. ఎన్నికల్లో విజయం కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలి. ప్రతి గడపా తొక్కాలి. డోర్ టు డోర్ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి.

**చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలే ప్రసక్తే లేదు**

కొందరు రెడ్‌బుక్ అంటే భయపడుతున్నారు. ఇది కార్యకర్తలకు ఇచ్చిన హామీ కాదు. యువగళంలో సుమారు వంద మీటింగ్‌ల్లో ఈ విషయాన్ని చెప్పా. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేష్ మరోసారి స్పష్టం చేశారు. నర్సరావుపేట ఐటీఐకి స్టాఫ్ కావాలని ఎంపీ కృష్ణదేవరాయలు కోరాగా నూటికి నూరు శాతం ఇస్తామన్నారు. నర్సరావుపేటకు యూనివర్సిటీ అడిగారని, ఈ విషయమై సీఎంతో మాట్లాడాల న్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ... లోకేష్ చొరవ వల్లే రాష్ట్రానికి గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వచ్చాయి. జేఎన్‌టీయూ కళాశాలలో రూ.70కోట్లతో హాస్టల్ భవనాలను ప్రారంభించారు. నర్సరావుపేట జేఎన్‌టీయూని యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

సమావేశంలో పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్లమెంటరీ అధ్యక్షుడు జానీ సైదా, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్, జోనల్ కో-ఆర్డినేటర్ బీటీ నాయుడు, నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ కోవెలమూడి నాని తదితరులు పాల్గొన్నారు.












# పల్నాడు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటన

## నర్సరావుపేట జేఎన్‌టీయూకే ఇంజనీరింగ్ కాలేజీలో రూ.70కోట్ల వ్యయంతో నిర్మించిన హాస్టల్ భవనాలు ప్రారంభం



నర్సరావుపేట (చైతన్యరథం): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం పల్నాడు జిల్లాలో పర్యటించారు. నర్సరావుపేట మండలం కాకాని గ్రామంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (కాకినాడ) ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నూతనంగా నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.70 కోట్ల వ్యయంతో 1,600మంది విద్యార్థినీ, విద్యార్థులకు అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన వసతిగృహాలను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం హాస్టల్ మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, మంత్రి గొట్టిపాటి రవికుమార్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.









# విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడమే లక్ష్యం

- ఉన్నత విద్య బలోపేతంపై ప్రభుత్వం దృష్టిసారించింది
- యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- విలువలు లేని వికసిత్ భారత్.. వికసిత్ భారత్ కాదు
- యువత విలువలు, కష్టపడేతత్వం అలవర్చుకోవాలి
- నర్సరావుపేట జేఎన్‌టీయూ విద్యార్థులతో ముఖాముఖిలో మంత్రి లోకేష్





నర్సరావుపేట (చైతన్యరథం): విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు విలువలు, కష్టపడేతత్వం అలవర్చుకోవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం కాకానిలోని జేఎన్‌టీయూకే ఇంజనీరింగ్ కళాశాల నూతన వసతి గృహాలను ప్రారంభించిన అనంతరం ఆయన విద్యార్థినీ, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 'ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలు, కళాశాలల్లో అద్భుతమైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. అనేక కారణాలతో వ్యవస్థలు దెబ్బతిన్నాయి. విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి నేను ప్రయత్నిస్తున్నాను. అకడమిక్ కేలండర్ ప్రకారం అన్నీ జరగాల్సిన అవసరం ఉంది. గత రెండేళ్లలో పాఠశాల విద్య బలోపేతానికి చర్యలు తీసుకున్నాం. అనేక సత్ఫలితాలు వచ్చాయి. నేను మంత్రి అయినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఉన్నత విద్యపైనా దృష్టి పెట్టాం. ల్యాబ్స్, స్కిల్ సెంటర్స్, పరిశ్రమలతో అనుసంధానంపై దృష్టి పెట్టాం. ఇంజనీరింగ్ నాలుగేళ్లు చదివిన తర్వాత ఉద్యోగాలు రావాలి. అందుకే కాలేజీలను పరిశ్రమలతో అనుసంధానం చేస్తున్నాం. ఇవన్నీ ఒక్క రోజులో జరగవు.' అని చెప్పారు.

**విద్యా వ్యవస్థలో ఎకో సిస్టమ్ నిర్మించాలి**

విద్యా వ్యవస్థలో మార్పు రావాలంటే కనీసం పదేళ్లు పడుతుంది. నేను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చూసినప్పుడు చాలా సులభంగా ఉండేది. విద్యా శాఖలో ఆ విధంగా చేయలేం. విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది భాగస్వామ్యం కావాలి. ఒక ఎకో సిస్టమ్‌ను నిర్మించాలి. విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావాలనేది నా డ్రీమ్. ప్రజా ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకువస్తున్నాం. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సిమెంట్, స్టీల్, గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. జీవితంలో ఏదైనా సాధించాలంటే యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

**కరిక్యులమ్‌ను ప్రక్షాళన చేస్తున్నాం**

రాష్ట్రంలో కియా, హీరో మోటార్స్ వంటి కంపెనీలు వచ్చాయి. త్వరలో మరిన్ని కంపెనీలు రాబోతున్నాయి. ఆటోమోటివ్ రంగంలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చాం. ఫిజిక్స్, మెటీరియల్ సైన్సెస్, స్పేస్, థర్మోడైనమిక్స్ వంటి సబ్జెక్టులపైనా దృష్టిసారించాలి. దేశంలో ఐఐటీ, ఎన్ఐటీలు చాలా బలంగా ఉన్నాయి. ఎందుకంటే ఆయా కాలేజీల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. రాష్ట్రంలో కూడా ఉన్నత విద్య బలోపేతానికి కృషి చేస్తున్నాం. టీచర్లు, విద్యార్థులు ఎంత మంది ఉన్నారో తెలియని పరిస్థితి. వీటన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నాం. హాజరును సమీక్షిస్తున్నాం. రీసెర్చ్‌పైనా దృష్టిసారిస్తున్నాం. దీర్ఘకాలిక ప్రణాళికలతో పాటు సత్వర ఫలితాల సాధనకు కసరత్తు చేస్తున్నాం. మరోవైపు పరిశ్రమల నిపుణులతో సంప్రదించి కరిక్యులమ్‌ను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. మనం నేర్చుకున్నది పరిశ్రమకు దగ్గరగా ఉండాలి. ప్లేస్‌మెంట్స్ విషయంలో కూడా ప్రతి యూనివర్సిటీకి కీ-ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు (కేపీఐ) తీసుకువస్తున్నాం.

**పల్నాటి ప్రజల అభిమానం మర్చిపోలేనిది**

పల్నాడుకు, అనకాపల్లికి తేడా ఏమిటని ఓ విద్యార్థినిని మంత్రి ప్రశ్నించారు. అనకాపల్లిలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడ వరి పండిస్తే... అక్కడ చెరకు పండిస్తారని సదరు విద్యార్థిని బదులిచ్చింది. దీనికి మంత్రి లోకేష్ స్పందిస్తూ యువగళం అనుభవాలను గుర్తు చేసుకున్నారు. పల్నాడులో పాదయాత్ర చేస్తున్నప్పుడు మా కార్యకర్త నా చేయి తీసుకున్నాడు. ప్రేమ చూపిస్తున్నాడేమో అని భావించా. కానీ నా చేతిని కొరికాడు. ప్రేమను వ్యక్తం చేయడం తెలియక అలా చేశాడు. ఇక్కడివారు ప్రేమను, అభిమానాన్ని మొరటుగా చూపిస్తారు. మరోవైపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తున్నాము. సీఎం ఆ కార్యక్రమం కోసమే పాయకరావుపేట వెళ్లారు. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తి చేసుకుంది. ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టు అనకాపల్లికి వచ్చింది అని లోకేష్ అన్నారు.

**స్టాన్‌ఫోర్డ్‌లో విలువలు నేర్చుకున్నా**

విలువలు లేని వికసిత్ భారత్.. వికసిత్ భారత్ కాదు. నేను స్టాన్ ఫోర్డ్‌లో విలువలు నేర్చుకున్నాను. అక్కడ పరీక్షలు రాసే సమయంలో ఇన్విజిలేటర్లు ఉండరు. ఎవరూ కాపీ కొట్టరు. దీనివల్ల వ్యక్తిత్వం నిర్మితమవుతుంది. అవకాశాలు అనేకం ఉన్నాయి. అయితే కష్టపడాలి. విజయానికి దగ్గరి దారులు లేవు. కష్టపడటం ఒక్కటే మార్గం. ధీరూభాయ్ అంబానీ ఎంత కష్టపడ్డారో అందరం చూశాం. ముఖేష్ అంబానీ, అదానీ, ప్రధాని మోదీ, మన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కష్టపడతారు. 76 ఏళ్ల వయసులోనూ 18 గంటల పాటు కష్టపడతారు. మనం కూడా అదే విధంగా కష్టపడాలి. నేను అనేక దేశాలు చూశాను. ఏ దేశంలో చూసినా కనీసం రెండు జనరేషన్లు త్యాగం చేశారు. అంటే కష్టపడ్డారు. సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, రష్యాల్లో దీనిని చూశాను. సింగపూర్‌ను లీన్ క్వాన్ యూ ఏవిధంగా మార్చారో మనం చూశాం.

**యువతకు అవకాశాలు కల్పిస్తాం**

యువత విలువలు, కష్టపడేతత్వం అలవర్చుకోవాలి. ప్రభుత్వం తరపున మేం చేయాలో అది చేస్తాం. అవకాశాలు కల్పిస్తాం. పరిశ్రమలు తీసుకువస్తున్నాం. ఇందుకు పరిశ్రమలకు అనేక రాయితీలు ఇస్తున్నాం. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్యాషన్ లేకపోతే మనం విజయం సాధించలేం. రాజకీయాలంటే ప్యాషన్ ఉంది కాబట్టే 24 గంటలూ కష్టపడుతున్నా. కుటుంబాన్ని వారానికోసారి మాత్రమే కలుస్తా. చంద్రబాబు 18 గంటలు కష్టపడుతుంటే నేను కనీసం 20 గంటలైనా కష్టపడాలి కదా.

**యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం**

యువగళం పాదయాత్రలో నేను ప్రతిరోజూ నేర్చుకున్నాను. స్టాన్‌ఫోర్డ్ ఎంబీయే బిజినెస్‌కు పనికిరాగా.. పాదయాత్ర రాజకీయాల్లో పనికివచ్చింది. ప్రజల సమస్యలను బాగా అర్థం చేసుకోగలుగుతున్నా. పాదయాత్రలో వచ్చిన ఆలోచనే 20 లక్షల ఉద్యోగాల కల్పన. ఇందుకోసం అందరం అహర్నిశలూ కష్టపడదామని మంత్రి లోకేష్ చెప్పారు.









# నర్సరావుపేటలో మంత్రి లోకేష్‌కు బ్రహ్మారధం

నర్సరావుపేట (చైతన్యరథం): నర్సరావుపేట నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే చదలువాడ అరవిందబాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. పట్టణంలోని ఎస్ఆర్‌కే సెంటర్ వద్ద పసుపు సైనికులు, అభిమానులు డప్పు వాయిద్యాలు, డీజే పాటలతో హోరెత్తించారు. లోకేష్ రాకతో నర్సరావుపేట ప్రధాన రహదారి పసుపుమయమైంది. అక్కడి నుంచి ఉప్పలపాడు గ్రామానికి చేరుకున్న యువ నేత లోకేష్‌కు వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు రోడ్లపైకి వచ్చి అపూర్వ స్వాగతం పలికారు. మహిళలు సంప్రదాయబద్ధంగా హారతులు ఇచ్చారు. అనంతరం కాకాని చేరుకున్న మంత్రి లోకేష్‌ను స్థానిక నాయకులు, శ్రేణులు భారీ గజమాలలతో సత్కరించారు. అభిమానులు ప్రత్యేకంగా ఎక్స్‌కవేటర్లపై నిలుపుని పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. యువకులు మోటారు సైకిళ్లపై నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
















చైతన్యరథం

# వైసీపీ నాయకుల భూ కబ్జాలు

- నిబంధనల ప్రకారం కడుతున్న ఇంటి గోడ ధ్వంసం
- టీడీపీలో ఉన్నాననే కక్షతో దాడి..పొలం గట్టు కబ్జా
- 46 ఏళ్లుగా సాగులో ఉన్న భూమిపై కానిస్టేబుల్ కన్ను
- అర్జీలు స్వీకరించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వాల్మీకి, బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుశీలమ్మ



మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ నాయకుల భూకబ్జాపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రజావినతుల కార్యక్రమంలో బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా నల్లమా డకు చెందిన రవీంద్రనాథ్ సమస్యను వివరిస్తూ గ్రామంలో తమకు జీవనాధారమైన 3.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే గ్రామానికి చెందిన సుమారు 12 మంది వైసీపీ వ్యక్తులు రాజకీయ పలుకుబడితో ఆ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించు కున్నారు. ఈ అన్యాయంపై స్థానికంగా మండల, రెవెన్యూ అధికారులకు దాదాపు మూడు నాలుగు సార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజే శారు. స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఏపీ వాల్మీకి, బోయ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కపట్రాల సుశీలమ్మ అర్జీలు స్వీకరించారు.

## వైసీపీ నాయకుడి అండతో గోడ కూల్చివేత

పల్నాడు జిల్లా మాచర్ల మండలం నాగులవరం గ్రామానికి చెందిన గుండాల రంగనాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో తమకు చెందిన స్థలంలో నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకుంటున్నాం. అయితే పక్కనే ఉండే వ్యక్తులు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నారు. స్థానిక వైసీపీ నాయకుడు రాజకీయ పలుకుబడి అధికారుల అండదండలు చూసుకుని తన స్థలంలో వేసుకున్న ఇంటి గోడను దౌర్జన్యంగా కూల్చివేశాడు. సదరు స్థలానికి సంబంధించి తన వద్ద అన్ని రకాల అధికారిక పత్రాలు ఉన్నప్పటికీ బలవంతంగా తనను అడ్డుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## వైసీపీ మూకల హత్యాయత్నం

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి చెందిన సామ్యూల్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ గత 35 సంవత్స రాలుగా టీడీపీ కార్యకర్తగా పనిచేస్తున్నాను. ఈ క్రమంలో 24-08-2026 సాయంత్రం తన ఇంటి వద్ద ఉండగా వైసీపీకి చెందిన పెల్లి ఇమ్మానియేలు, గొర్రెముచ్చు మార్కు రవీంద్ర, విజయ్ కుమా ర్ అనే నలుగురు వ్యక్తులు మూకగా వచ్చి తనపై ఒక్కసారిగా దాడికి దిగారు. తీవ్రంగా కొట్టి హత్యాయత్నం చేయడంతో పాటు, "గ్రామంలో మీ కుటుంబాన్ని లేకుండా చేస్తాం.. అందరినీ చంపే స్తాం" అంటూ తీవ్రమైన అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరిం పులకు పాల్పడ్డారు. తనపై ఇలాంటి దాడి జరగడం ఇది నాలుగో సారి. సదరు నలుగురు వ్యక్తుల వల్ల తనతో పాటు తన కుటుంబ సభ్యుల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉంది. శారీరక దాడులు, బెది రింపులతో పాటు తన తండ్రి కష్టపడి సంపాదించిన వ్యవసాయ పొలంలో ఉన్న గట్టును కూడా సదరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## ఏపీఎస్పీ కానిస్టేబుల్ దందా

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం జాగువారిపల్లి గ్రామానికి చెందిన దామోదర్, చంద్రశేఖర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ 1980లో తమ తాత, తండ్రుల కాలంలో ప్రభుత్వం జిల్లా హరిజన అభివృద్ధి సంస్థ పథకం (బావి నం.2, సర్వేస్ నం. 579) కింద సర్వే నంబర్లు 779-3, 779-5 పరిధిలో సుమారు 2.50 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ భూమిలోనే నివాసం ఏర్పరచుకుని, ఐడీసీ బోరు ద్వారా పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నాం. 2005లో తాత మరణించారు. 2021లో అవ్వ చని పోగా వారి సమాధులను కూడా ఆ భూమిలోనే నిర్మించుకున్నాం.గత మూడు నెలలుగా తమ పక్క పొలం (సర్వే నం. 779-4)లో ఉన్న ఏపీఎస్పీ కానిస్టేబుల్ కేశం రాజశేఖర్ కన్ను తమ భూమిపై పడింది. జేసీబీలతో తమ పొలంలోని గట్టును చదును చేసి, 15 వెదురు గుమ్మెలు, 10 వేప చెట్లను నాశనం చేశారు. దీనిపై 03-06-2026న అప్పటి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆయన నిందితులను మందలించి తమకు అనుకూలంగా ఆదేశాలిచ్చారు. అయితే ఆ తహశీల్దార్ బదిలీపై వెళ్లగానే కానిస్టేబుల్ రాజశేఖర్ తన బంధువులైన కేశం సాయి, విజయ, మోదపోతుల వేణు, మోదపోతుల బాల, రవీంద్రలతో పాటు దాదాపు 15 మందితో దౌర్జన్యానికి దిగాడు. తమ పనులను అడ్డుకుని రాత్రి వేళల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సాయంతో నిమ్మ చెట్లు నాటుతూ భూమిని తమ ఆధీనంలో ఉన్నట్లు రికార్డుల్లో చూపించే దుకు ప్రయత్నాలు సాగిస్తున్నాడు. నిందితుడు రాజశేఖర్ ఏపీఎస్పీ కానిస్టేబుల్ అని చెప్పుకుంటూ..గత రెండేళ్లుగా విధులకు హాజరు కాకుండా స్థానికంగానే ఉంటూ సర్వే నెంబర్లు మారాయనే సాకుతో అమాయకుల భూములను కబ్జా చేసి విక్రయిస్తున్నాడు. స్థానిక పోలీసులలోని కొందరి అండదండలతోనే అతడు ఇలాంటి బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నాడు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## దివ్యాంగుడిపై దాడి.. నగదు, బంగారం దోపిడీ

ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన సుధాకర్ తన సమస్యను వివరిస్తూ దివ్యాంగుడైన తాను ఆటో నడుపుకుంటూ ప్రభుత్వం ఇచ్చే రూ.6,000 పెన్షన్‌తో జీవనం సాగిస్తున్నాను. గతంలో తలతోటి మస్తాన్ అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి ఉదయం 6:30 సమయంలో తన ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఇంటిని ధ్వంసం చేయడంతో పాటు రూ.1,60,000 నుంచి రూ.2,00,000 వరకు నగదు, బంగారు ఆభరణాలను అపహరించుకు పోయారు. ఈ అన్యాయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేసినా స్వీకరించకపోగా నిందితుడు తలతోటి మస్తాన్ తో కుమ్మక్కై తనపైనే అక్రమ కేసులు బనాయించారు. కాలు విరగ్గొడతామని బెదిరించి చిత్రహింసలకు గురిచేశారు. ఈ క్రమంలో 28-08-2026 తేదీన తలతోటి మస్తాన్, అతని అనుచరులైన తూము మల్లేశ్వరి, తలతోటి రమణ, ఏపూరి లక్ష్మీరాజ్యం, ఏపూరి వేణు, సాధు శ్రీనివాస్, కంకణం రాజు, గెంటెలపల్లి ప్రసాద్, చిన్న బ్రహ్మయ్య తదితరులు కలిసి మళ్లీ తనపై విచక్షణారహితంగా దాడి చేశారు. స్థానిక పోలీసుల నుంచి ఎలాంటి రక్షణ లభించక పోవడంతో పాటు, అక్కడే ఉంటే ప్రాణహాని ఉందని భయపడి అదేరోజు సాయంత్రం కందుకూరు వదిలి విజయవాడకు వచ్చి తలదాచు కుంటున్నాను. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## భూమిని మరొకరికి కట్టబెట్టేందుకు యత్నం

పల్నాడు జిల్లా మాచర్ల మండలం హస్నాబాద్ తండాకు చెందిన కేతావత్ గుందురాం నాయక్ సమస్యను వివరిస్తూ నాగార్జునసాగర్ నిర్మాణంలో దేవరకొండ ప్రాంతంలో ఉన్న తన 38 ఎకరాల భూమి ముంపునకు గురైంది. పరిహారంగా నూజెండ్ల మండలం ముక్కెళ్ళపాడులో ఇచ్చిన 12.50 ఎకరాల భూమి పూర్తి గా రాతిమయమై సాగుకు పనికి రాకుండా పోయింది. ఆ భూమి పనికిరాదని గత కలెక్టర్ నివేదిక ఇచ్చి విజయపురిసౌత్ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఆదేశించినా గురజాల ఆర్డీవో, మాచర్ల తహశీల్దార్ పట్టించు కోలేదు. ప్రత్యామ్నాయ భూమిని వేరొకరికి కట్టబెట్టేందుకు అధికారులు రికార్డులు మార్చి తనకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## భూమిని సబ్‌డివిజన్ చేయాలి

అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం పెద్దకాలవపల్లెకు చెందిన పి.రెడ్డెప్పరెడ్డి సమస్యను వివరిస్తూ మాసాపేట రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 925 నందు 3.56 ఎకరాల భూమి ఉంది. గతంలో జరిగిన సబ్‌డివిజన్ ప్రక్రియ ప్రకారం ఈ భూమిలో 0.66 సెంట్లు కాలువ విస్తరణ కోసం పోయింది. ఈ నేపథ్యంలో కాలువ కిందకు వెళ్లిన 0.66 సెంట్ల భూమిని అధికా రిక రికార్డుల నుంచి మినహాయించి మిగిలిన భూమికి తక్షణమే సబ్‌డివిజన్ చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించు కోవడం లేదు. ఈ భూమి ప్రస్తుతం 'డి-పట్టా'గా నమోదై ఉండటంతో ప్రభుత్వ తాజా నిబంధనలకు అనుగుణంగా దీనిని సాధారణ పట్టాగా మార్చి ఫ్రీహోల్డ్ చేయాలని కోరాడు.

# గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర జలస్వప్నం సాకారం

- సీఎం చంద్రబాబు చొరవ అభినందనీయం
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి చారిత్రాత్మక మలుపు
- శ్రీకాకుళం చివరి ఆయకట్టుకూ తీసుకెళ్లాలన్నదే ఆకాంక్ష
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అనకాపల్లి/కోటబొమ్మాళి(చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల జలస్వప్నం సాకారమైన వేళ గోదావరి జలాలు పోలవ రం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు చేరుకోవడంపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణతోనే గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకాయని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తరుణం నిజమైంది. ప్రాజెక్టు పనుల్లో ఎదురైన అత్యంత క్లిష్టమైన ఇంజినీ రింగ్ అడ్డంకులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే అధిగమించి రికార్డు స్థాయిలో కాలువ నిర్మాణ పనులను పూర్తి చేశారు. జలహారతి ఇచ్చి పాయకరా వుపేట వద్ద రెగ్యులేటర్ ఆన్ చేసిన రైతులకు సాగునీరు విడుదల చేయడం సీఎం చంద్రబాబు చారిత్రాత్మక ఘట్టమని కొనియాడారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు చేరుకోవడం తొలి ఘట్టం మాత్రమే. రాబోయే రోజుల్లో ఈ జలాలు విజయనగరం దాటి చివరి ఆయకట్టు ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా వరకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సిక్కోలు నేలను సస్యశ్యామలం చేసే గోదావరి జలాల కోసం ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నో



ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్రలో ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించే లక్ష్యం నెరవేరే వరకు కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, పట్టుదలతో శరవేగంగా పూర్తయిన ఈ ప్రాజెక్టు ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు సాగు, తాగునీటితో పాటు పరిశ్రమలు, అవసరాలకు 23.44 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇది కేవలం జల ప్రాజెక్టు మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరిచే ప్రాజెక్టు అని పేర్కొన్నారు. రెండేళ్లలో కాలువ తవ్వకం, క్లిష్టమైన అక్విడక్ట్ నిర్మాణాలతో సహా కీలక పనులను రికార్డు వేగంతో పూర్తి చేసిన ఇంజినీరింగ్ అధికా రులు, సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకి వేల చరిత్రలో నిలిచిపోతుంది. ఉత్తరాంధ్రను సుజల సస్యశ్యామలంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. అనకాపల్లితో మొదలైన ఈ జలయాత్ర శ్రీకాకుళం చివరి ఆయకట్టు వరకు కొనసాగాలన్నదే మా లక్ష్యమని తెలిపారు.

# శానిటరీ కిట్లతో బీసీ హాస్టళ్లలో పరిశుభ్రత

- రూ.6 కోట్ల వ్యయంతో పంపిణీ
- ఒక్కొ దానిలో 11 రకాల వస్తువులు
- పారిశుధ్య మెరుగుకు 1,200 మంది భర్తీ
- టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళికలు
- విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



విజయవాడ(చైతన్యరథం): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నిర్దేశించుకున్న 'విజన్–2047' లక్ష్యాలను చేరుకునే క్రమంలో భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణం, మౌలికవసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బీసీ హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నామని, ఇందుకోసం 11 రకాల వస్తువుల తో కూడిన రూ.6కోట్ల విలువైన శానిటరీ కిట్లు అంద జేస్తున్నామని తెలిపారు. బుధవారం విజయవాడ గుణదల ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమంలో శానిటేషన్ మెటీరియల్‌తో కూడిన శానిటరీ కిట్లను వర్కర్లకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న బీసీ హాస్టళ్ల రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. గతంలో బీసీ సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్‌వో ప్లాంట్లు, విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్లు, కిటికీలకు నెట్లు, విద్యార్థుల సౌకర్యార్థం హ్యాంగింగ్ హుక్స్ వంటి వసతులు కల్పించినట్లు చెప్పారు. వసతి గృహాల్లో పారిశుధ్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సుమారు 1,100 కొత్త టాయిలెట్లను నిర్మించామని మంత్రి తెలిపారు. వాటి నిర్వహణ, పరిశుభ్రత కోసం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది శానిటేషన్ వర్కర్లను నియమించినట్లు చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను బట్టి శానిటేషన్ సిబ్బందిని కేటాయించామని తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వంటి ప్రత్యేక సేవలను కూడా అందిస్తున్నా మని చెప్పారు. టాయిలెట్లు, కారిడార్లు, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు సంబంధించి శానిటేషన్ సిబ్బందికి స్పష్టమైన ఎస్‌ఓపీ జారీ చేశామని, కిట్ల నిర్వహణపై వార్డెన్లకు కూడా నిబంధనలు రూపొందించామని వివరించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా హాస్టళ్లను 1–స్టార్ నుంచి 5–స్టార్ వరకు విభజించి, నెల, మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి, వార్షి కంగా అవసరమైన శానిటేషన్ సామగ్రిని అందించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

### విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

హాస్టల్ విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహి స్తున్నామని తెలిపారు. రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనకు ఇప్పటినుంచే ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన, పౌష్టికాహారం అందించా లన్న ముఖ్యమంత్రి ఆలోచన మేరకు డైట్ ఛార్జీలను 10 శాతం పెంచినట్లు తెలిపారు. వసతిగృహాలకు అవసరమైన కొత్త వంట సామగ్రిని సమకూర్చడంతోపాటు, అవసరానికి అనుగుణంగా కుక్–కమ్–అటెండర్లు, కుక్స్, హెల్పర్లను కూడా నియమి స్తున్నామని తెలిపారు. హాస్టళ్లలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్' కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యకరమైన, పరిశు భ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు హాస్టల్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును పరిశీలించి నీరు తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్.మల్లిఖార్జున, జాయింట్ డైరెక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ. జగ్గయ్య, వార్డన్ ఎమ్.రజని పాల్గొన్నారు.

# ఉద్యోగ సంఘాలతో త్వరలో భేటీ

**సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళతాం**

**రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్**



అమరావతి(చైతన్యరథం): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఉద్యోగ సంఘ నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తానని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలి పారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు మంత్రిని కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు ఉద్యోగుల సమస్యలను వివరించారు.

ఈ రాష్ట్రంలో పనిచేస్తున్న రెవిన్యూ ఉద్యోగుల సమస్యలపై వెంటనే చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీఆర్‌ఏ, వీఆర్‌ఓ,సర్వేయర్లు, రెవెన్యూశాఖలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే అనేకసార్లు మీ దృష్టికి తీసుకువచ్చామన్నారు. వెంటనే మా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్‌సీ కమిషన్‌కు సంబంధించిన విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి అనగాని స్పందిస్తూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, అలాగే ఉద్యోగులుకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్‌సీ కమిషన్‌కు సంబంధించిన ఆర్థిక పరమైన విషయాలపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులతో సానుకూల చర్చలు జరిపి న్యాయం చేస్తామని చెప్పారు.

# 10 రోజుల్లో రెండో విడత నేతన్న సాయం

- పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికచేయాలి
- రూ.25.52 కోట్ల ముద్ర రుణాలు ఇవ్వాలి
- చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ, గ్రామీణ ఖాదీ బోర్డు అధికారులతో మంత్రి సవిత సమీక్షించారు.చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, ఖాదీ బోర్డు సీఈవో సింహా చలం, లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నేతన్నలకు, హస్త కళాకారులకు గౌరవప్రద జీవనం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. నేతన్నలకు ఆర్థిక మేలు కలగజేయడానికే నేతన్నల సేవలో పథ కం అమలు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో పథకం వర్తింపచేస్తున్నట్లు వివరించారు. నేతన్న సేవలో పథకం అమలులో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వ కుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపా రు. కొత్తగా వచ్చిన 36,632 దరఖాస్తులను 10 రోజుల్లోగా పరిశీలించి అర్హులను ఎంపిక చేసి రెండో విడత నేతన్నలో సేవలో ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. ఈ ఏడాది నేతన్న లకు రూ.25.52 కోట్ల ముద్ర రుణాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గడువులోగా ముద్ర రుణాలు అందజే యాలని ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షో రూమ్‌ల్లో అమ్మకాలు పెంచాలని సూచించారు. రానున్న పండగల నేపథ్యంలో చేనేత ఉత్పత్తుల డిస్కౌంట్ సేల్స్ ప్రారంభించాలి. చేనేత సహకార సంఘాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తున్నాం. చేనేత పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. గ్రామీణ ఖాదీ బోర్డు ద్వారా అందజేసే స్వయం ఉపాధి రుణాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

# ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్తే లక్ష్యం




- అలా ఎదిగితేనే సమాజ ప్రగతి చక్రం మారుతుంది
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు
- గ్రోత్ వర్క్‌షాప్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ(చైతన్యరథం): మహిళలు అందరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగితేనే రాష్ట్రం, దేశంతో పాటు సమాజ ప్రగతిచక్రం మారుతుందని ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం విజయవాడ లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ భవనంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీ ఎంఎస్‌ఎంఈ డీసీ, ఇండియా ఎస్‌ఎంఈ ఫోరమ్ భాగస్వామ్యంతో జరిగిన ఎంఎస్‌ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబా బు ప్రవేశపెట్టిన ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త నినాదానికి అనుగుణంగా రాష్ట్రంలోని యువత, మహిళలు, డ్వాక్రా మహి ళలు, నూతన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమ న్నారు. ఎంఎస్‌ఎంఈలతో దేశ జీడీపీలో 30 శాతం ఆదాయంతోపాటు 50శాతానికి పైగా ఉద్యోగాల కల్పన జరుగుతోందన్నారు. నియో జకవర్గస్థాయిలో కూడా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 19పార్కులు ప్రారంభించగా.. మరో 138పార్కు లు పురోగతిలో ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా 2876 పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేసి రూ.8వేల కోట్ల పెట్టుబడితో 1.03 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఇక కొత్త ఇండస్ట్రీల ఏర్పాటు కోసం సీఎంఈపీ పథకంలో రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్టు మంత్రి చెప్పారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అందజేస్తోందని.. వారు తీసుకునే డ్వాక్రా లోన్లపై ప్రతి ఏడాది రూ.33,500 వరకు ప్రాసెసింగ్ చార్జీలు ముఖ్యమంత్రి రద్దు చేయించారని.. గ్రామీణ బ్యాంకుల వడ్డీని 13శాతం నుంచి 12 శాతాని కి తగ్గించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లు డిజిటల్ రంగా నికి మారడం, ఈ–కామర్స్ సేవలు పొందడం, ఎగుమతుల అవకాశాలు పెంచుకోవడం, బ్యాంకింగ్ రుణాలు మరియు జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ సర్టిఫికేషన్ వంటి అంశాలపై హాజరైన వారికి అవగాహన కల్పించాయి. ఇక రాంప్ ప్రోగ్రామ్ కింద ఈ అవగాహన సదస్సులను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. విజయవాడ తర్వాత కృష్ణా, కాకినాడ, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో దశలవారీగా ఈవర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసి ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలకు పూర్తి సహకారాన్ని అందించనున్నారు. ఈ కార్యక్ర మంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మెటా, అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్, వాల్‌మార్ట్ వృద్ధి, సీఐఐ–నీతి ఆయోగ్ వంటి అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఏపీ ఎంఎస్‌ఎంఈ సీఈఓ విశ్వమ నోహరన్, ఎంఎస్‌ఎంఈ ఈడీ సుధాకర్ జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

చైతన్యరథం

# గ్రామీణ క్రీడాకారులకు వికాస కేంద్రం

- 20 ఎకరాల విస్తీర్ణంలో ప్రాంగణం
- మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలి
- గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఆత్మకూరు
- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ రూ.28 కోట్లతో అభివృద్ధి
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు(చైతన్యరథం): ఆత్మకూరు పట్టణంలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి యువత, క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఉద యం ఆత్మకూరులోని క్రీడా వికాస కేంద్రాన్ని అధికారులు, రెవెన్యూ, క్రీడా శాఖాధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం క్రీడా ప్రాంగణ అభివృద్ధికి చేపట్టా ల్సిన చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రతిపాదిత క్రీడా ప్రాంగణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించి క్రీడా ప్రాంగణ నిర్మాణానికి రూపొందించిన డిజైన్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని యువత, క్రీడాకా రులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాలమైన క్రీడా మౌలికవసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రతిష్టా త్మక స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆర్డీవో, తహసీల్దార్లతో చర్చించి ప్రతిపాదించిన స్థలంతో పాటు, పక్కనే ఉన్న మరో 9 ఎకరాల 80 సెంట్ల స్థలాన్ని కూడా కలిపి మొత్తం 20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొంది స్తున్నట్లు వెల్లడించారు. నెల్లూరులోని ఏసీ స్టేడియం సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా..దానికంటే పెద్దదిగా ఆత్మకూరు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. నేషనల్ హైవే, అభయాంజనేయ స్వామి ఆలయం, నాగులపాడు రోడ్డు తదితర ప్రాంతాలకు అనుసంధానంగా ప్రవేశ మార్గాలు, రహదారి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. రాబోయే 15 నుంచి 20 రోజుల్లో సమగ్ర ప్రణాళిక నివేదికను సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. క్రీడా రంగంలో ప్రతిభ కలిగిన గ్రామీణ యువతను గుర్తించి వారికి ఆధునిక శిక్షణ, మెరుగైనవసతులు అందించడం ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఆత్మకూరు ప్రాజెక్టు కింద క్రీడా వికాస కేంద్రం 2017 సెప్టెంబ ర్‌లో మంజూరు కాగా, 2018 ఆగస్టు 18న పనులు ప్రారంభ మైనట్లు తెలిపారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనుల్లో ఇప్పటికే సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. గత ఎనిమిదేళ్లుగా కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల కాకపోయినా సుమారు రూ.కోటి వరకు సొంత నిధులు వెచ్చించి పనులు చేపట్టినట్లు తెలిపారు. శాప్ చైర్మన్ రవినాయుడు చొరవతో కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అంగీకరించారని చెప్పారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అదనంగా రూ.1.78 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు శాప్ అధికారులు అంగీకరించినట్లు తెలిపారు. ప్రణాళిక ప్రకారం మూడు నెలల్లో మిగిలిన పనులను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

### గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఆత్మకూరు

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల అభివృద్ధి, మౌలికసదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆత్మకూరును గ్రేడ్-1 మున్సిపా లిటీ స్థాయికి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల అనంతరం పట్టణ నడిబొడ్డున పెద్ద ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి ఆత్మకూరు పట్టణ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశానికి రాజకీ యాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, వారి సలహాలు, సూచనలు స్వీకరించి అభివృద్ధి ప్రణాళికలో పొందుపరుస్తామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఆత్మకూరులో వివిధ మౌలికవసతుల కల్పనకు రూ.2 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అలాగే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.28 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, పార్కుల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లతో అభివృద్ధి పనుల ప్రణాళికపై సమీక్షించి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు.

# దివ్యాంగులు, వయోవృద్ధులకు లిఫ్ట్ సౌకర్యం

- ఒంగోలు కలెక్టరేట్‌లో రూ.43 లక్షలతో ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



ఒంగోలు(చైతన్యరథం): సమాజంలో దివ్యాంగులు,వయోవృద్ధులు స్వతంత్రంగా ఎవరిపై ఆధారపడకుండా జీవించేలా చూడటంతోపాటు ప్రభుత్వకార్యాలయాల్లో వారికి సులభతరమైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని సాంఘికసంక్షేమ,విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ప్రకాశంజిల్లా కలెక్టరేట్‌లో రూ.43లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక లిఫ్ట్‌ని జిల్లాకలెక్టర్ పి.రాజాబాబు,ఒంగోలు,సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బి.ఎన్. విజయ్‌కుమార్,జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కలెక్టరేట్ భవనానికి రోజువారీ పనుల నిమిత్తం వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులుపై అంతస్తులకు వెళ్లే క్రమంలో పడుతున్న ఇబ్బందులను నివారించేందుకు ఈ లిఫ్ట్ సౌకర్యాన్ని సమకూర్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన ఎస్ఐపీడీఏ పథకంకింద జిల్లా యంత్రాంగం ఈ చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ లిఫ్ట్ నిర్మాణం, ఏర్పాటు బాధ్యతలను ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు పూర్తి చేసినట్లు చెప్పారు. ఒకేసారి 13మంది ప్రయాణించేలా రూపొందించిన ఈ లిఫ్ట్ వద్దకు చక్రాల కుర్చీలలో వచ్చే వారు నేరుగా చేరుకునేలా ప్రత్యేకంగా ర్యాంప్ సౌకర్యాన్ని కూడా సమకూర్చారని తెలిపారు. జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా గుర్తించిన సుమారు 28,500 మంది దివ్యాంగులలో అత్యవసర సహాయం అవసరమైన 15,000 మందికి విడతల వారీగా నాణ్యమైన సహాయ పరికరాలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

# వచ్చే నెలలో న్యాయవాదుల బ్యాడ్మింటన్ టోర్నీ

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆహ్వానం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రస్థాయి న్యాయవాదుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2026కు రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ది బెజవాడ బార్




అసోసియేషన్ ప్రతినిధులు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 3, 4తేదీల్లో నిర్వహించనున్న టోర్నమెంట్ వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా బార్‌కౌన్సిల్‌సభ్యులు చలసాని అజయ్‌బాబు,బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి కిరణ్, ఈసీ కిరణ్, స్పోర్ట్స్ సెక్రటరీ జి.రామ్‌తేజ, ఆర్గనైజర్ రైసా పాల్గొన్నారు.

### గొల్లగుప్ప గ్రామస్తులకు

# తక్షణమే వైద్యపరీక్షలు

- మందులను వెంటనే ల్యాబ్‌కు పంపాలి
- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం
- బాలిక కుటుంబసభ్యులకు సానుభూతి

అమరావతి(చైతన్యరథం): పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్పలోని గ్రామస్తులందరికీ తక్షణం వైద్యపరీక్షలు నిర్వహిం చాలని అధికారులను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. గ్రామస్తులకు పంపిణీ చేసిన మలేరియా మందుల (క్లోరోక్విన్)ను ల్యాబ్‌కు పంపాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫోన్ చేసి బాలిక (7) మృతి ఘటనపై ఆరా తీశారు. అలాగే ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసు కున్నారు. రెండో తరగతి చదువుతున్న బాలిక మృతిపై ఆయన విచారం వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ప్రత్యేక వైద్యబృందంతో పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ వివరించారు. మలేరియా నివారణ కోసం మాత్రలు తీసుకున్న 53 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో పలువురు అనారోగ్యం బారిన పడ్డారు. దీంతో తెలంగాణలోని భద్రాచలంతో పాటు లక్ష్మీపురంలో వారం తా చికిత్స పొందుతున్నారు.

ఈ ఘటనపై ఇప్పటికే సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అలాగే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అదేశించారు. గొల్లగుప్పలో 71 మందికి మలేరియా నివారణ కోసం క్లోరోక్విన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ ట్యాబ్లెట్ వికటించి విద్యార్థి జమున (7) మృతిచెందింది.



# పోలవరం ఎడమ కాలువ ప్రారంభం సువర్ణాధ్యాయం

- ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం
- మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలి
- ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర నుంచి తరిమికొట్టాలి
- ఎల్‌నినోనూ పుష్కర, పట్టిసీమ పథకాలతో ఎంతో మేలు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



పోలవరం(చైతన్యరథం): గోదావరి జలాలు నేడు ఉత్తరాంధ్రను తాకుతున్నా యంటే అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతే అని నిమ్మల రామానాయుడు కొనియాడారు. ఆయన ముఖ్యమంత్రిగా రాష్ట్ర నీటివనరుల శాఖ కు సంబంధించి పోలవరం ఎడమ కాలువ ప్రారంభం ఒక సువర్ణాధ్యాయం గా అభివర్ణించారు. 2014లో ముఖ్య మంత్రి చంద్రబాబు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకొస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. పోల వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందే గోదావరి జలాలను అటు కృష్ణాడెల్టాకు, ఇటు ఉత్తరాంధ్రకు తీసుకువస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్న మహనీయుడు చంద్రబాబు అని ప్రశం సించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా దాహార్తిని తీర్చారు. పుష్కర ద్వారా ఉత్త రాంధ్రకు గోదారమ్మని తీసుకొచ్చారు.. ఇది ఆయన ముందుచూపునకు, దార్శ నికతకు నిదర్శనమన్నారు. ఇదే తరుణం లో గొడ్డలి పార్టీ అధినేత నాడు ప్రతిపక్ష హోదాలో పట్టిసీమ వట్టిసీమని, పుష్కర పనికిరానిదని ఎద్దేవా చేశారు.అంతటితో ఆగకుండా తాను అధికారంలోకి వస్తే ఈ రెండింటినీ పీకేస్తానని అన్నారు. సూపర్ ఎల్‌నినో ఉపద్రవ సమయంలో ఈ రెండు పథకాలు ఎంతగా ఉపకరిం చాయో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఐదు ప్రధాన నదులను, 9చోట్ల జాతీయ రహదారులను, కుమ్మరి లోవ తదితర ప్రాంతాలలో 100మీటర్ల లోతున తవ్వ కాలు జరిపి కాలువ ముందుకు తీసుకు రావడం వంటి ఎన్నో క్లిష్టమైన పనులను చేయడం వెనుక ఎంతో శ్రమ ఉందని చెప్పారు. ఇదే తరుణంలో ఐదేళ్ల అధికా రంలో ఉన్న గొడ్డలిపార్టీ ఎడమ కాలువ కు సంబంధించి తట్టమట్టి తీయలేదు.. బస్తా సిమెంట్ వేయలేదు.. ఇలాంటి ముంచేసే గొడ్డలి పార్టీ అవసరమా? అని ప్రశ్నించారు. మీకోసం అహర్నిశలు కష్టపడుతూ భవిష్యత్తుతరాలకు బంగారు బాటలువేసే మంచి చేసే కూటమి ప్రభు త్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. గొడ్డలి పార్టీ హయాంలో పోలవరం విధ్వంసం కాకుండా ఉండుంటే కుడి కాలువకు 17,500 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 17500 క్యూ సెక్కు లు వెరసి 350 టీఎంసీల నీటితో సమృ ద్ధిగా మనపంటలు పండేవన్నారు. ఐదేళ్ల అమూల్య సమయం వృథా చేయడమే కాకుండా ఉత్తరాంధ్రకు గొడ్డలి పార్టీ తీవ్ర ద్రోహం చేసిందని ధ్వజ మెత్తారు. అటువంటి గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర నుంచి తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

# జీఎస్‌ఎల్వీ-ఎఫ్17 ప్రయోగానికి కౌంట్‌డౌన్

**షార్ రెండవ వేదికపై రాకెట్ ప్రయోగం**

**శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్**

సూళ్లూరుపేట(చైతన్యరథం): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో మైలురాయిని చేరుకోవడానికి సిద్ధమైంది. ఎర్త్ అబ్జర్వేషన్‌లో అత్యంత అధునాతన సాంకేతికతతో కూడిన ఈవో ఎస్-05 ఉపగ్రహాన్ని జీఎస్‌ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా రోదసిలోకి పంపనున్నారు. శ్రీహరి కోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం లోని రెండో ప్రయోగ వేదిక నుంచి శుక్ర వారం తెల్లవారు జామున 2.55 గంటల కు ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించిన మిషనర్ రెడీనెస్ రివ్యూ సమావేశం మంగళవారం షార్‌లో ఎంఆర్ఆర్ చైర్మన్ మోహన్ అధ్యక్షతన జరిగింది. ప్రయోగంపై శాస్త్రవేత్తలు సుదీ ర్ఘంగా చర్చించిన అనంతరం షార్ డైరె క్టర్ ముత్తుచెళియన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశమై ప్రయోగా నికి సంసిద్ధత తెలిపింది. కౌంట్‌డౌన్‌ను బుధవారం రాత్రి 11.25 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రయోగ సన్నాహా ల్లో భాగంగా నిర్వహించే రిహార్సల్‌ను కూడా శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. దేశ సరిహద్దులను నిరం తరం పర్యవేక్షించడానికి ఎప్పటికప్పుడు వాతా వారణాన్ని అంచనా వేయడానికి ఈప్రయోగం ఎంతో ఉపయోగపడనుంది.

**శ్రీవారి పాదాల చెంత రాకెట్ నమూనా**

ఇస్రో చైర్మన్ నారాయణన్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో తన బృందంతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్సు ద్వారా ఆనంద నిలయంలోకి వెళ్లిన నారా యణన్.. జీఎస్ఎల్వీ ఎఫ్-17, ఇఓఎస్-05 నమూనా రాకెట్‌ను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేకపూజలు నిర్వహించా రు. అనంతరం రంగనాయకుల మండ పంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశా రు. ఇస్రో చేపడుతున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 17సెప్టెంబర్ 4నతెల్లవారుజామున 2:55 నిమిషాలకు శ్రీహరికోటలోని సతీష్ ధావ న్ అంతరిక్షకేంద్రం(షార్) రెండవ ప్రయో గ వేదిక నుంచి నింగిలోకి వెళ్లనుంది.



## మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ కీలక బాధ్యతలు

**సేవా సంకల్ప్ దక్షిణాది ఇన్‌చార్జిగా నియామకం**

అమరావతి(చైతన్యరథం): భాజపా జాతీయ నేత, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జిగా నియమించింది. మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ సందర్భంగా దేశవ్యాప్తంగా నెలరోజుల పాటు



సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు జరగనున్నాయి. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 17 వరకు బీజేపీ, ఎన్డీయే ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా ఆయన వ్యవహరించనున్నారు.

# పోలవరంపై క్రెడిట్ తీసుకునే దమ్ముందా జగన్?

- ప్రాజెక్టుకు వైఎస్ఆర్, మీరు చేసింది సున్నా
- మట్టి పనుల కోసమే నాడు జలయజ్ఞం చేపట్టారు
- వెలిగొండ ప్రాజెక్టుకు మీరు చేసింది శూన్యం
- నిర్వాసితులకు రూపాయి కూడా విదల్చలేదు
- చెప్పిన ప్రకారమే పోలవరం ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్రకు నీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుది
- మా హయాంలోనే ప్రాజెక్టును పూర్తి చేయబోతున్నాం
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ విజయ్‌కుమార్




మంగళగిరి(చైతన్యరథం): వెలిగొండ, పోలవరం ప్రాజెక్టులకు ఏమీ చేయకుండా క్రెడిట్ కొట్టేసేందుకు గొడ్డలి పార్టీ నానా తంటాలు పడుతోందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ మండిపడ్డారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహిం చారు. వెలిగొండ ప్రాజెక్టుకు రెండేళ్లల్లో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి నిర్వాసితులకు డబ్బులు ఇచ్చి నీళ్లు ఇచ్చిన ఘనత చంద్రబా బుది. పోలవరం ప్రాజెక్టులో క్రెడిట్ మాదే అని చెప్పే ధైర్యం, దమ్ము జగన్‌కు లేదు. ఎందుకంటే ఐదేళ్ల పాలనలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జగన్ చేపట్టారు. పోలవరం ఎడమ కాలు వలో 150 కి.మీ.లో 70 కి.మీ మట్టి తవ్వి సొమ్ము చేసుకున్నారు. 72 శాతం పోలవరం పనులను 2014-19 మధ్యలో చేశాం. పోలవరంపై క్రెడిట్ మాదే అని సాక్షిలో చెప్పుకోలేక పోయారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా సాక్షిలో 5 వేల క్యూసెక్కులే అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 60 రోజుల పాటు రోజు కు అర టీఎంసీ చొప్పున 30 టీఎంసీలు ఎడమకాలువ ద్వారా తరలించబోతున్నాం. పోలవరానికి ఏం చేయలేదనే ఆవేదన గొడ్డ లి పార్టీలో కనిపిస్తోంది. 2021 పోలవరం పూర్తి చేస్తామని అసెంబ్లీలో అనిల్‌కుమార్ బల్ల గుద్ది చెప్పాడు. పోలవరం పనులు ఇప్పట్లో చేయలేం.. నాకు ఈ ప్రాజెక్టు అర్థం కాలేదని అంబటి రాంబాబు మాట్లాడాడు. అలాంటి వారిని జలవనరుల శాఖ మంత్రులుగా పెట్టుకుని మీరు నీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడితే జనాలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు.

**మట్టి పనులు చేసుకుని దోచుకున్నారు**

వెలిగొండ ప్రాజెక్టుకు వైఎస్ఆర్, జగన్ ఇద్దరూ ఖర్చు చేసింది కేవలం రూ.2,175 కోట్లే...అందులో జగన్‌రెడ్డి పెట్టింది రూ.800 కోట్లు. రూ.10,400 కోట్ల ప్రాజెక్టులో కేవలం 20 శాతం నిధులు కూడా మీరు ఖర్చు చేయలేదు. ఆ చేసిన పనుల్లో కూడా మట్టి పనులు చేసుకుని సొమ్ము చేసుకుని దోచుకున్నారు తప్పితే...కాలువల లైనింగ్ చేయలేదు, ప్యాచింగ్ వర్క్ చేయలేదు, నిర్వాసితులకు రూపాయి కూడా సాయం చేయలేదు. టన్నెల్ అరకొరగా తవ్వి వదిలేసి ఇప్పుడు క్రెడిట్ చోరీ చేశారని చెబితే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరు. చంద్రబాబు ప్రభుత్వం ఈ రెండేళ్లలోనే రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నిర్వాసితులకు రూ.905 కోట్లు విడుదల చేసి రూ.768 కోట్లు 48 రోజుల్లో అందజేశాం. 11 గ్రామాలను తరలించి 10.4 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తరలించాం. 1.19 లక్షల ఎకరాల కు సాగునీరు, 4.3 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించా మని వివరించారు.

**2014 నుంచి 2019 మధ్య పోలవరం 72 శాతం పూర్తి**

2014 నుంచి 2019 మధ్య కాలంలో రూ.11,762 కోట్లు ఖర్చు చేసి పోలవరం పనులను 72 శాతం పూర్తి చేశాం. 2019-24 మధ్య జగన్‌రెడ్డి పాలనలో పోలవరం విధ్వంసం చేశారు. 17 నెలల పాటు పనులను నిలిపివేశారు. రివర్స్ టెండ రింగ్ పేరుతో పోలవరాన్ని వరదల్లో ముంచేశాడు. డయాఫ్రం వాల్ విధ్వంసానికి కారణమయ్యారు. సాగునీటి ప్రాజెక్టులను విధ్వంసం చేశాడు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఇచ్చిన రూ.3,385 కోట్లు జగన్ ఎక్కడ ఖర్చు పెట్టాడో చెప్పాలి. ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలను జగన్‌రెడ్డి మోసం చేశాడు. ఈ రెండేళ్ల పాలనలో రూ.8,323 కోట్లు పోలవరంపై ఖర్చు చేశాం. రికార్డ్ టైంలో 440 రోజుల్లోనే రూ.1000 కోట్లు ఖర్చు చేసి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేశాం. రూ.2,250 కోట్లు పోలవరం భూ నిర్వాసితులకు అందజేశాం. మార్చి 2027 నాటికి పోలవరం పూర్తి చేయబోతున్నామని స్పష్టం చేశారు.

**మట్టి పనులతో దోచుకోవడానికే జలయజ్ఞం**

పోలవరం ప్రాజెక్టు పనులను చేపట్టకుండా కేవలం కాలువ తవ్వకం పనులను చేసి వైఎస్ఆర్ హయాంలో మట్టి పనులు చేసి దోచుకున్నారు. బందరాళ్లు అడ్డు వస్తే పట్టించుకోలేదు, లైనింగ్ వేయలేదు, కేవలం మట్టిని తవ్వి డబ్బులు చేసుకున్నారు. అది హంద్రీనీవా అయినా, వెలిగొండ అయినా, పోలవరం అయినా మట్టి పనులు చేసుకుని దోచుకోవడమే పనిగా జలయజ్ఞాన్ని ధన యజ్ఞం చేశారు. రాయలసీమకు, కోస్తాకు, ఉత్తరాంధ్రకు ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదు. 2008లో జీవో 104 తెచ్చి వైఎస్ఆర్ పోలవరం ఎడమ కాలువ సామర్థ్యాన్ని 3,500 క్యూసెక్కులకు జీవో ఇచ్చారు. కానీ చంద్రబాబు ప్రభుత్వంలో 10 వేల క్యూసెక్కు లకు పోలవరం ఎడమ కాలువ సామర్థ్యం పెంచాం. వైఎస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేసుకున్నారు. ఒక్క ఎకరాకు వైఎస్ఆర్ నీళ్లు ఇవ్వలేదు. రాయలసీమ బిడ్డ అని చెప్పు కునే జగన్ అక్కడ ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదు. మట్టి తవ్వుకుని సొమ్ము చేసుకునేందుకే జలయజ్ఞం తీసుకొచ్చారు. పోలవరం నిర్వాసితులకు జగన్ రూపాయి ఖర్చు చేయలేదని మండిపడ్డారు.

**ఎడమ కాలువ ద్వారా రోజుకు 5 వేల క్యూసెక్కులు**

పోలవరం ఎడమ కాలువ ద్వారా రోజుకు 5 వేల క్యూసెక్కులు తరలించబోతున్నాం. అంటే 30 టీఎంసీల ద్వారా తూర్పు గోదా వరి, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాం. రెండేళ్లల్లోనే రూ.1800 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేశాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు ఇస్తే విశాఖకు నీళ్లు వెళతాయి. విశాఖకు 12 టీఎం సీల నీరు ఇస్తున్నాం. అందులో 4 టీఎంసీలు విశాఖ జిల్లాలోని పరిశ్రమలకు ఇస్తున్నాం. 7 నుంచి 8 టీఎంసీలు విశాఖ జిల్లాలో సాకుకు ఇవ్వబోతున్నాం. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లు వెళుతున్నాయి. మొత్తం రాష్ట్ర ప్రగతికి అవసరమైన పోలవరం ప్రాజెక్టును శరవేగంగా మేం పూర్తి చేస్తుంటే...ఐదేళ్ల నిర్లక్ష్యం చేసి నేడు తప్పుడు కథనాలు రాయిస్తూ అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పట్టిసీమ ద్వారా రూ.70 వేల కోట్లు రాష్ట్ర రైతులకు ఆదా అయింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ ఎన్డీయే ప్రభుత్వమే వస్తుందని, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి.. టీడీపీనే మూడ్ ఆఫ్ ది ఆంధ్రప్రదేశ్ అని స్పష్టం చేశారు.

# గిరిజన బిడ్డలతో జగన్‌రెడ్డి శవ రాజకీయం

- ఉన్నట్లుండి వారిపై ప్రేమ పుట్టుకొచ్చిందా?
- ఐదేళ్ల మీ పాలనలో అరాచకాలు గుర్తులేవా?
- గిరిజనులతో భవిష్యత్తుతో ఆటలాడితే జాగ్రత్త
- జీవో 3ను కూడా కాపాడలేని అసమర్థుడివి
- ఐటీడీఏలు, బెస్ట్ అవెయిలబుల్ స్కూల్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, విదేశీ విద్య రద్దు చేశారు
- గిరిజన ప్రాంత సంపదను దోచుకుతిన్నారు
- రెండేళ్లలో కూటమి పాలనలో గిరిజన సంక్షేమం, అభివృద్ధికి రూ.24 వేల కోట్లు ఖర్చు చేశాం
- వారు బాగుపడుతుంటే ఓర్చుకోలేకపోతున్నారా?
- గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ధ్వజం



మంగళగిరి(చైతన్యరథం): జగన్‌రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం గిరిజన భవిష్యత్తుతో చెలగాటం ఆడితే చూస్తూ సహించేది లేదని గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉన్న పళంగా గిరిజనులపై జగన్‌కు ప్రేమ పుట్టుకొచ్చిందా? అని ప్రశ్నించారు. తాడేపల్లి, బెంగళూరు, చెన్నై నుంచి గొడ్డలిపార్టీ అధినేత ఒక ట్వీట్ చేశారు. మహిళలు, గిరిజనుల మీద తనకు ప్రేమ, ఆప్యాయత ఉన్నట్టుండి పుట్టుకొచ్చాయని ఆ ట్వీట్‌లో చెప్పాడు. మహిళలను పోలీసులు అరెస్టు చేశారు..మహిళలకు గౌరవం, మర్యాద ఇవ్వ లేదంటూ తనకు వర్తించని పదాలు వాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీకి చెందిన మహిళా నాయకులను ఏ విధంగా ఎన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టారో జగన్‌రెడ్డికి గుర్తులేదా? అని ప్రశ్నించారు.

## తల్లి, చెల్లికి గౌరవం ఇవ్వనివాడు ఎవరిని గౌరవిస్తాడు?

రాజధాని మహిళలను బూటు కాళ్లతో తన్ని, వాళ్ల బట్టలు చించి వాళ్లను ఎలా ఇబ్బందిపెట్టారో గుర్తులేదా? సొంత తల్లి, చెల్లిని ఏవిధంగా ఇంట్లో నుండి బయటకు గెంటేశారో గుర్తు లేదా? పినతల్లి, సునీతకు ఏ విధంగా ద్రోహం చేశారో గుర్తులేదా? పదవి కోసం తల్లిని పార్టీ నుంచి మెడబట్టి బయటకు గెంటేయలేదా? మీ సొంత చెల్లి షర్మిల మీద మీ పార్టీ నేతలతో అసభ్యకరమైన పోస్టులు, ట్వీట్లు పెట్టించలేదా? తల్లికి, చెల్లికి గౌరవం ఇవ్వనివాడు ప్రపంచంలో ఎవరినీ గౌరవించడు. సొంత పిన్ని బొట్టు చెరిగిపోయి ఏడుస్తుంటే నువ్వు ఏ విధంగా ప్రవర్తిం చావో దేశం మొత్తం తెలుసు. న్యాయం కోసం పోరాడుతున్న సునీత గురించి నువ్వు ఏ విధంగా ఎద్దేవా చేస్తూ హంతకులకు అండగా నిలిచావో దేశమంతా తెలుసు. ఇలాంటి మీకు రాష్ట్ర ప్రజలంతా ఓటుతో తీర్పు తీర్చారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని 11 రెడ్డిగా మిగిలిపోయారని ధ్వజమెత్తారు.

## నాడు మాట్లాడని వారు.. నేడు నోరుతెరవడం హాస్యాస్పదం

గతంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేసిన పాముల పుష్ప శ్రీవాణి ఏనాడూ గిరిజనులను పట్టించుకున్న పాపాన పోలేదు. దళిత, గిరిజన సామాజికవర్గానికి చెందిన నాపై, హోం మంత్రి అనితపై కూడా అట్రాసిటీ కేసులు వర్తించకపోయినా తప్పుడు కేసులు పెట్టారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజనులను ఏ విధంగా ఇబ్బందులు పెట్టారో అందరికీ తెలుసు. అందుకే 7 సీట్లలో మీకు 5 సీట్లు 2024లో ఇవ్వలేదు. కానీ ఈరోజు మీరు గిరిజనుల గురించి మొసలికన్నీరు కారుస్తూ ట్వీట్లు పెట్టడం సిగ్గుచేటు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఐటీడీఏలను నిర్దాక్షిణ్యంగా మూసేస్తే కనీసం వైసీపీకి చెందిన ఒక్క గిరిజన నాయకుడు, నాయకురాలు నోరుమెదపలేదని మండిపడ్డారు.

## జీవో 3ను కాపాడలేని అసమర్థుడు జగన్

జీవో నెంబర్ 3పై సుప్రీంకోర్టులో నెలరోజుల్లోపు కౌంటర్ వేయకుండా వదిలేశారు. కానీ ఈరోజు గిరిజన నాయకులం అని వైసీపీ వాళ్లు రోడ్డెక్కడానికి సిగ్గులేదా? బెస్ట్ అవెయిలబుల్, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, విదేశీ విద్య వంటి పథకాలను జగన్ రద్దు చేస్తే అప్పుడు వైసీపీ నేతలు ఎందుకు నోరెత్తలేదు? వైసీపీ పాలనలో గిరిజన సంపదను, బాక్సైట్, ఖనిజ సంపదను దోచుకుంటే ఎవరూ ఎందుకు మాట్లాడలేదు? ఆ రోజు నోరెత్తితే జగన్ ఏం చేస్తాడో అన్న భయంతో మాట్లాడలేదు. అక్రమ కేసులు పెట్టి లోప ల వేస్తారని మాట్లాడలేదు. కానీ ఈరోజు సభ్యత, సంస్కారం గురించి మాట్లాడడం దుర్మార్గం కాదా? మీరు నీతులు చెబితే నేడు మేం నేర్చుకోవాలా? అని ప్రశ్నించారు.

## జగన్ అంటే విధ్వంసం- చంద్రబాబు అంటే వికాసం

విధ్వంసకర పరిపాలన చేసిన జగన్‌రెడ్డికి, విజ్ఞానం- వికాసానికి బ్రాండ్‌గా నిలిచిన చంద్రబాబుకి ఎలాంటి పోలిక లేదు. బోత్ ఆర్ నాట్ సేమ్ అనే విషయాన్ని వైసీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలి. గిరిజనుల సంక్షేమం కోసం ఈ రెండేళ్లలో రూ.24 వేల కోట్లతో రోడ్లు, తాగునీరు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, సాగునీటి కోసం ఖర్చుపెట్టాం. గిరిజన విద్యలో విప్లవాత్మకమైన మార్పులను లోకేష్ తీసుకొచ్చారు. పవన్‌కళ్యాణ్ గిరిజనులకు రోడ్లు వేస్తున్నారు. 10వ తరగతి చదివిన జగన్ రెడ్డికి, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదివిన లోకేష్ గురించి మాట్లాడే నైతిక విలువ ఉందా? జగన్ పాలనలో కరోనా విలయ తాండవం చేస్తే 128 మంది విద్యార్థులు హాస్టల్‌లో చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా పలకరించలేదు. గత విద్యాశాఖ మంత్రి లేదా గిరిజన శాఖ మంత్రి ఎవరినైనా పరామర్శించారా? అని ప్రశ్నించారు.

## ఉనికిని కాపాడుకునేందుకు శవ రాజకీయాలు

శవం కనిపిస్తే వెళ్లి గద్దల్లా వాలిపోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ఉనికిని కాపాడుకునేందుకు వెంపర్లాడుతున్నారు. చంద్రబాబు గిరిజన విద్యను అభివృద్ధి చేసి గిరిజనులను విదేశాలకు పంపాలని, ఎన్ఐటీ, ఐఐటీలు, ఎంబీబీఎస్‌లోకి వెళ్లాలని కృషి చేస్తున్నారు. మీరు రోడ్డెక్కి అల్లరి చేయడానికి 445 మంది విద్యార్థులు ఉన్న మారికవలస పాఠశాలలో 411 మంది వేరే వేరే పాఠశాలల్లో చేరి వారికి నచ్చిన విధంగా చదువుకుంటుంటే ... కేవలం 8 శాతం ఉన్న విద్యార్థులను ఆధారంగా చేసుకుని ధర్నా లు చేయడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. అమాయక గిరిజనులను మీరు రెచ్చగొట్టి మీ స్వార్థ రాజకీయాలకు వారి భవిష్యత్తును బలిచేస్తారా? గిరిజన విద్యార్థులకు మంచి జరుగుతుంది అంటే మేము ఏదైనా చేయడానికి సిద్ధం. మీరు ఎన్ని అన్నా భరిస్తాం. కానీ మా బిడ్డల భవిష్యత్తుకు అడ్డం వస్తే మాత్రం చూస్తూ భరించే పరిస్థితి లేదు. జీవో నెంబర్ 3ని తీసుకొచ్చింది ఎవరో వైసీపీ నేతలకు తెలుసా? చంద్రబాబు లేకపోతే జీవో నెంబర్ 3 ఉందా? ఆ జీఓ సుప్రీంకోర్టులో పోతే కనీసం పట్టించు కోని మీరు నేడు దీనిపై అవాకులు చెవాకులు పేలడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

## సంస్కారం గురించి మాట్లాడటం మా ఖర్మ

ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని గొడ్డలి పార్టీ అధినేత విద్యావ్యవస్థ, చదువు, సంస్కారాలు గురించి మాట్లాడడం మా ఖర్మ. నాలుగు గోడల మధ్య కూర్చుని పబ్జీ ఆడుకునే మీరు ట్వీట్లు పెట్టి రాజకీయాలు చేయడం రాష్ట్రానికి పట్టిన ఖర్మ. ప్రతిపక్ష హోదాలేని మీరు అసెంబ్లీకి ఏనాడూ రాలేదు.. ప్రజా సమస్యలపై నోరెత్తలేదు. ట్వీట్లు పెట్టే ముందు సబ్జెక్టుపై అవగాహన ఉన్న వారి ని పక్కన పెట్టుకుంటే బాగుంటుందని హితవుపలికారు. నీ సొంత, తల్లి చెల్లిపైనే విషం చిమ్మే సాక్షి పత్రికలో వాస్తవాలు ఏమీ ఉండ వు. మీ డబ్బాలు మీరు కొట్టుకోవడం, మీ జాకీలు మీరు ఎత్తు కోవడం తప్ప అని ఎద్దేవా చేశారు.

## కూటమి పాలనలో మారుతున్న గిరిజనుల బతుకులు

కూటమి పాలనలో మా గిరిజన బ్రతుకులు మారుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా జరుగుతోంది. ఐటీడీఏలు అమలవుతున్నాయి. బెస్ట్ అవెయిలబుల్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, సెంటర్ ఆఫ్ కాలేజీ, విదేశీవిద్య వంటి పథకాలు అన్నీఅమలవుతున్నాయి. హాస్టళ్లలో రూపురేఖలు మారాయి, మౌలికసదుపాయాలు మెరుగుపడ్డాయి. 50 ఏళ్లకే పెన్షన్లు వస్తున్నాయి. మీ స్వార్థ రాజకీయాల కోసం మాగిరిజనుల బతుకులను నాశనం చేయాలని చూస్తే ఎవరూ ఊరుకోరని హెచ్చరించారు. మా తండ్రి గిరిజన నాయకుడిగా, మాజీ ఎమ్మెల్యేగా చేశారు. ఒక సామాన్య కుటుంబం నుంచి నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. ఒక జాతీయ పార్టీలో పొలిట్‌బ్యూరో హోదాలోఉన్నాను. ఆస్థాయికి తెచ్చింది మా నాయకుడు చంద్రబాబు. జగన్ ఇంట్లో తన కుటుంబసభ్యులు ఎవరూ ఉండరు. కోటరీ మాత్రమే ఉంటారు. బయటకు వస్తే రప్పా రప్పా బ్యాచ్ తప్ప ఎవరూ ఉండరు. మీ రాజకీయాల కోసం మా గిరిజన జోలికి వస్తే వదిలే ప్రసక్తి ఉండదని హెచ్చరించారు.

# గొల్లగుప్ప బాధితులకు మెరుగైన వైద్యసేవలు

- ప్రత్యేక వైద్య బృందాలతో నిరంతర పర్యవేక్షణ
- భయాందోళన చెందాల్సిన అవసరం లేదు
- వైజాగ్ ఫొరెన్సిక్ ల్యాబొరేటరీకి మాత్రలు
- పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్



భద్రాచలం(చైతన్యరథం): పోలవరం జిల్లా ఎటపాక మండ లం గొల్లగుప్ప గ్రామంలో క్లోరోక్విన్ మాత్రలతో పలువురు అస్వస్థ తకు గురికాగా వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తు న్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం భద్రాచలం ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించి చికిత్స పొందుతున్న బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వివరాలను వెల్లడించారు. గొల్లగుప్ప గ్రామంలో మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ఫీవర్ సర్వేలెన్స్‌లో భాగంగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. మలేరియా నివారణకు వైద్య ఆరోగ్యశాఖ ప్రోటోకాల్ ప్రకారం వయసుకు అనుగుణమైన మోతాదులో క్లోరోక్విన్ మాత్రలను పంపిణీ చేసినట్లు చెప్పారు. మాత్ర వేసుకున్న అనంతరం జమున (7) అనే బాలిక అపస్మారక స్థితికి చేరుకుని రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గడంతో అస్వస్థతకు గురైందన్నారు. వెంటనే బాలికను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి,అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా దురదృష్టవశాత్తూ మృతిచెందినట్లు తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా గొల్లగుప్ప గ్రామానికి చెందిన 54 మందిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు, ప్రస్తుతం 53మందిలో చిన్నారులు 48 మంది, పెద్దలు ఐదుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరూ క్రిటికల్ లేదా డేంజరస్ పొజిషన్‌లో లేరని స్పష్టం చేశారు. గ్రామంలో ఉన్న మరో 17 మందికి ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటుచేసి వైద్యసేవలు అందిస్తున్నామని, వారంతా కూడా సురక్షితంగా ఉన్నారని తెలిపారు. మృతిచెందిన బాలిక జమున (7)కు సంబంధించి వైద్యపరీక్షలు, పోస్టుమార్టం తదితర ప్రక్రియలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాథమిక వైద్య పరిశీలనలో బాలికకు కుటుంబ పరంగా లేదా జన్యుపరంగా గుండెకు సంబంధించిన సమస్య ఉండి ఉండవచ్చని వైద్యులు అంచనా వేసినట్లు చెప్పారు. అటువంటి పరిస్థితిలో క్లోరోక్విన్ వినియోగంవల్ల కార్డియాక్ అరిథ్మియా ఏర్పడి ఉండేఅవకాశం ఉందనివైద్యులు భావిస్తున్నప్పటికీ, దీనిపై పూర్తిస్థాయి క్లినికల్ నిర్ధారణ రావాల్సి ఉందని స్పష్టంచేశారు. క్లోరోక్విన్ మాత్రలను వయసుకు అనుగుణమైన డోసేజ్ ప్రకారమే పంపిణీ చేసినట్లు తెలిపారు. మందుల నాణ్యతకు సంబంధించి ఇప్పటికే నిర్వహించిన క్వాలిటీ కంట్రోల్ పరీక్షల నివేదికలు సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు. మరింత స్పష్టత కోసం వినియోగించిన క్లోరోక్విన్ మాత్రల బ్యాచ్‌ను వైజాగ్ ఫొరెన్సిక్ ల్యాబొరేటరీకి పంపించినట్లు వెల్లడించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ ప్రాంతాల నుంచి మూడుప్రత్యేక ర్యాపిడ్ రెస్పాన్స్ వైద్యబృందాలు భద్రాచలం చేరుకుని బాధితులకు వైద్యసేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఈ బృందాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు, జనరల్ ఫిజీషియన్లు తదితర వైద్య నిపుణులు ఉన్నారని చెప్పారు. గొల్లగుప్ప గ్రామంలోని సుమారు 270 మంది ప్రజలందరికీ హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి సికిల్ సెల్ ఎనీమియా తదితర ఇతర ఆరోగ్య సమస్యలు, కొమార్బిడిటీలను గుర్తించేందుకు వైద్యబృందాలు చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరంలేదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు పీవో, సబ్ కలెక్టర్ శుభం నొక్వల్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పి.సరిత, ప్రత్యేక వైద్య బృందాల సభ్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

## చిన్నారి మృతిపై సమగ్ర విచారణకు ఆదేశం




అమరావతి(చైతన్యరథం): పోలవరం జిల్లాలో మలేరియా నివారణ మాత్రలు (క్లోరోక్విన్) వికటించి చిన్నారి మృతి చెందిన ఘటనపై ఇన్‌ఛార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చిన్నారి మృతిపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చనిపోయిన చిన్నారి కుటుంబ వైద్య హిస్టరీని అధ్యయనం చేస్తున్నట్లు మంత్రికి కలెక్టర్ తెలిపారు. ఇతర విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. బుధవారం మధ్యాహ్నం వరకూ స్పెషలిస్టుల అబ్జర్వేషన్‌లో ఉంచి డిశ్చార్జ్ చేయనున్నట్లు కలెక్టర్ తెలియజేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులకు మంత్రి సంధ్యారాణి సూచించారు.

## టీటీడీ డిప్యూటీ ఈవో నివాసంలో ఏసీబీ సోదాలు

### కోట్ల విలువైన స్థిర, చరాస్తుల గుర్తింపు




తిరుపతి(చైతన్యరథం): తిరుపతిలో ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే సమాచారంతో టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం నివాసంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయం పెదకాపు వీధిలోని లోకనాథం నివాసంతోపాటు సమీపంలో ఉన్న ఆయన పెద్ద బావమరిది, చిన్న బావమరిది ఇళ్లలోనూ అధికారులు సోదాలు చేపట్టారు. చెల్లూరు గ్రామంలో లోకనాథం బంధువు నివాసంలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. అలాగే తిరుమలలోని 'బి టైప్ 53' నంబరు గల గెస్ట్ హౌస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఎస్టీవీ నగర్ బ్రాంచ్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో లోకనాథంకు లాకర్ ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, స్థిర..చరాస్తులు గుర్తించిన ట్లు సమాచారం. ప్రస్తుతం లోకనాథం టీటీడీ డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్నారు. అలాగే తిరుమల ఆలయానికి సంబంధించిన కీలక బాధ్యతలను కూడా ఆయన నిర్వహిస్తున్నారు. గతంలో టీటీడీ అధికారుల ఇళ్లలో ఏసీబీ సోదాలు చేసిన పరిస్థితి లేదు. ఇదే మొట్టమొదటి సారి. ఇలాంటి విషయాల్లో శాఖాపరమైన చర్యలు తీసుకోవడమే తప్ప.. టీటీడీ ఉద్యోగుల ఇళ్లల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేయడంతో తోటి ఉద్యోగుల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది.

## 38వ రోజూ ఇంటింటికీ తెలుగుదేశం

**- 1.20 లక్షల ఇళ్లను సందర్శించిన పార్టీ శ్రేణులు**

**- ఇప్పటివరకు 98.52 లక్షల ఇళ్ల సందర్శన**

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు.. వారి సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం -2026" కార్యక్రమం 38వ రోజు బుధవారం విజయవంతంగా కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా 1.20 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించడంతో మొత్తం సందర్శనలు 98.52 లక్షలకు చేరుకున్నాయి. దీంతో కార్యక్రమం కోటి ఇళ్ల మైలురాయికి చేరువైంది. ఇంటింటి పర్యటనల్లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు వివరిస్తున్నారు.అదే సమయంలో ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. ప్రజలతో నేరుగా మమేకమవుతూ ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా 'ఇంటింటికీ తెలుగుదేశం-2026' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.



# ఆధునిక కాలపు అపర భగీరథుడు చంద్రబాబు

జాతి సౌభాగ్యానికి జలసిరియే రక్ష కాబట్టి ప్రభువు అనేవాడు ప్రజలను శత్రు సైన్యాల నుంచే కాక, కరువు కాటకాల నుంచి కూడా రక్షించాలి. ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి, సమర్థ జల నిర్వహణను ప్రోత్సహించి, జల రక్షణతో జనరక్షణ చేసినవాడే నిజమైన రాజు అన్నారు మహాకవి వేమన.

భగీరథుడు గంగను భువికి తీసుకొచ్చి జీవకోటికి జలధారను అందించాడు. ఆ జలధారతో ఎండిన నేలలు పచ్చగా మారాయి. ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాయి. నేటి ఆంధ్రప్రదేశ్‌లోనూ నదీ జలాలను సద్వినియోగం చేసుకుని బీడు భూములను బంగారు పంట పొలాలుగా మార్చాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న ఆధునిక కాలపు అపర భగీరథుడు చంద్రబాబు. సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేసి, సాగును బాగుచేసి, భావితరాల పురోగతికి బాటలు వేయాలని, వ్యవసాయ రంగాన్ని, రైతుని కాపాడాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తలపెట్టిన ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసి కరువు రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యంగా అపర భగీరథుడు అవతారం ఎత్తారు సీఎం చంద్రబాబు. ఏ దేశంలోనైతే సాగునీటి రంగం వర్ధిల్లుతుందో, ఆ దేశం సుభిక్షంగా ఉంటుంది. 2028 నాటికి 36 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రతి ప్రాజెక్టుకు నిర్దిష్ట గడువు నిర్ణయించారు. ఈ 36 ప్రాజెక్టుల కోసం సుమారు రూ.35,555 కోట్ల వ్యయ ప్రణాళికను రూపొందించి క్యాలెండర్ విడుదల చేసిన సీఎం చంద్రబాబు, ఒక్కో ప్రాధాన్య ప్రాజెక్టునూ పూర్తి చేస్తున్నారు. క్యాలెండర్‌ను కాగితాలపై కాకుండా కార్యక్షేత్రంలో అమలు చేయడం అభినందనీయం.

హంద్రీ-నీవా ద్వారా 250 రోజుల్లో 52 టీఎంసీ రాయలసీమకు తరలించి కరువు సీమ రైతులను ఆదుకొన్నారు. బావుల్లో నీరు లేక, చెరువులు ఎండిపోయి అల్లాడే రాయలసీమకు హంద్రీ-నీవా సుజల స్రవంతి ఊపిరి పోస్తోంది. గత రెండేళ్లలో రూ.3,870 కోట్లతో రికార్డుస్థాయిలో 100 రోజుల్లో హంద్రీ-నీవా ఫేజ్-1, 2 ప్రధాన కాలువలు, పుంగనూరు-కుప్పం బ్రాంచ్ కాలువల విస్తరణ, సీసీ లైనింగ్ పనులు పూర్తి చేసి, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు తరలించి, రాయలసీమవ్యాప్తంగా 530 చెరువులను నింపడం ద్వారా సాగునీటికి భరోసా ఇచ్చారు.

వెలిగొండ రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల నీటి భద్రతకు కీలకమైన ప్రాజెక్టు. కృష్ణా నదీ జలాలను రాయలసీమ, దక్షిణ కోస్తాకు తరలించాలని చంద్రబాబు ఆలోచన నుంచే వెలిగొండ ప్రాజెక్టు పుట్టుకొచ్చింది. ఈ ప్రాజెక్టును మొట్టమొదటిసారి 1996 మార్చి 5న అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రారంభించారు. ముప్పయ్యేళ్లుగా ఎదురుచూస్తున్న ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లావాసుల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ఆగస్టు 31న ప్రారంభించారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు 2026లోనూ తానే సీఎంగా వెలిగొండను ప్రారంభించడం అభినందనీయం. వెలిగొండ ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలవనుంది. కరవు సీమలను సస్యశ్యామలం చేసి, ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపే వెలిగొండ ప్రాజెక్టు మొదటి విడతను విజయవంతంగా పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సాగు, తాగునీటితో పాటు ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపే వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను చంద్రబాబు ప్రారంభించారు. వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని సుమారు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించనున్నది.

అట్లాగే, దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర అనగానే గుర్తుకొచ్చే చేదు నిజాలివి. సొంత ఊళ్లో ఉపాధి లేక, పొలంలో పనులు లేక బతుకు జీవుడా అంటూ ముంబైకో, సూరత్‌కో రైలు ఎక్కే ఉత్తరాంధ్ర బిడ్డల ఆవేదన ఆ భూమికే తెలుసు. ఆ తరతరాల కన్నీటి గాథలకు స్వస్తి పలుకుతూ, ఆ నేల భవిష్యత్తును సరికొత్తగా తిరగరాసే చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. పోలవరం ఎడమ కాలువ ద్వారా పరవళ్లు తొక్కుతూ గోదావరి జలాలు ఉత్తరాంధ్రను ముద్దాడాయి. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు దక్కిన ప్రతిఫలమిది. వలసల నేలలో సస్యశ్యామల స్వప్నమిది!

ఉత్తరాంధ్ర కష్టాలు వర్షం కురిస్తేనే పైరు, లేదంటే కరువుతో పోరు. ఎడమ కాలువ ద్వారా విడుదలవుతున్న గోదావరి ప్రవాహం ఆ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయనున్నది. పరాయి ప్రాంతాలకు కూలీలుగా వెళ్లే ఉత్తరాంధ్ర ప్రజలు ఇకపై సొంత మట్టిలోనే బంగారం పండించనున్నారు. ఏజెన్సీ కొండల నుంచి విశాఖ తీరం వరకు ప్రతి పల్లె, ప్రతి ఇంట్లో తాగునీటి సమస్య తీరనున్నది. విశాఖపట్నం పారిశ్రామిక నగరానికి ఈ జలాలు ఇంధనంలా మారి, వేలాది మంది యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి. పోలవరం ఎడమ కాలువ ద్వారా పారనున్న ప్రతి నీటి బొట్టు ఉత్తరాంధ్ర భవిష్యత్తుకు బలమైన పునాది కాగలదు. దశాబ్దాలుగా వెనుకబాటుతనంతో అల్లాడిన ఆ ప్రాంతం ఇకపై స్వర్ణాంధ్రకు చిరునామాగా మారబోతోంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛను తీర్చారు సీఎం చంద్రబాబు. తుని-నర్సీపట్నం రహదారిపై నిర్మించిన అక్విడెక్టు వద్ద గోదావరికి జల హారతి ఇచ్చి, అక్విడెక్టు గేట్లను ఎత్తి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేశారు. మొదటి దశలో 30 టీఎంసీల నీటిని అనకాపల్లికి తరలించనున్నారు. ఇప్పటి వరకు ఉత్తరాంధ్ర ప్రజల కన్నీళ్లను చూసిన గోదావరి, ఇక నుంచి ఉత్తరాంధ్ర పచ్చని పొలాలను తడిపి ఆ ప్రాంత ప్రజల కన్నీళ్లను తుడవనున్నది. అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట ప్రాంతాలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చనున్నాయి. అధికారుల వివరాల ప్రకారం సుమారు 3,500 క్యూసెక్కుల నీటిని కాలువ వ్యవస్థ ద్వారా తరలించే ప్రణాళిక ఉంది. పుష్కర వ్యవస్థ ద్వారా 110 చెరువులను నింపి సుమారు 1.48 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నది. మొత్తం మీద మూడు ప్రాంతాల్లో సుమారు 2,87,320 ఎకరాలకు సాగునీరు, సుమారు 9.23 లక్షల మందికి తాగునీటి ప్రయోజనం కలిగేలా ప్రణాళిక రూపొందించారు. అదే సమయంలో విశాఖ-అనకాపల్లి పారిశ్రామిక ప్రాంతానికి కూడా నీటి లభ్యత ఎంతో కీలకం. భవిష్యత్తులో పెట్టుబడులు, డేటా సెంటర్లు, ఉక్కు, ఫార్మా, అల్యూమినియం వంటి పరిశ్రమలు విస్తరించాలంటే నీటి భద్రత అవసరం. అందుకే సీఎం చంద్రబాబు అనకాపల్లి ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధిచేసే లక్ష్యాన్ని ప్రకటించారు.

గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రాణం పోసింది. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి సంబంధించి కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పూర్తి చేసింది. ఉత్తరాంధ్రలో వెనుకబడిన ప్రాంతాల సాగు,తాగునీటి అవసరాల కోసం వంశధార, తోటపల్లి, తారకరామ తీర్థసాగర్, జంఝావతి, హిరమండలం లిఫ్ట్ వంటి సుమారు 11కీలక ప్రాజెక్టులను రాబోయే రెండేళ్లలోగా పూర్తిగా అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

గత పాలనలో సరైన నిర్వహణ లేక అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోవడం, పులిచింతల, తుంగభద్ర, గుండ్లకమ్మ డ్యామ్ గేట్లు విరిగిపోవడంవల్ల కొన్ని వేల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంపాలైంది. తుంగభద్ర డ్యామ్ రూ.61 కోట్లతో 33 నూతన స్టాప్ లాగ్ గేట్ల మార్పిడి పనులను జూన్ 2026లో విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. కాటన్ బ్యారేజీ ధవళేశ్వరంలో రూ.146.87 కోట్లతో గేట్ల మార్పిడి పనులు వేగంగా జరుగుతున్నాయి. శ్రీశైలం డ్యామ్ రూ.203.95 కోట్లతో ప్లంజ్ పూల్ అధ్యయనం, రక్షణ గోడ పనులు ప్రారంభమయ్యాయి. గుండ్లకమ్మ రిజర్వాయర్: రూ.9.17 కోట్లతో 14 గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయి. చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులతో పాటు కూలిపోయిన డయాఫ్రమ్ వాల్స్, దెబ్బతిన్న గేట్ల మరమ్మతులు వంటి క్లిష్టమైన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసింది ప్రభుత్వం.

ఆర్థిక వ్యవస్థ బలపడితేనే రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించిన చంద్రబాబు, సాగునీటి ప్రాజెక్టులను కేవలం నిర్మాణాలుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తును మార్చే అభివృద్ధి ఆయుధాలుగా భావించి, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి గడువులు నిర్ణయించి, ఒక్కో ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న ఆధునిక కాలపు అపర భగీరథుడు చంద్రబాబు.

**- నీరుకొండ ప్రసాద్**

చైతన్యరథం




# మంగళగిరి @ లోకేష్ మార్క్



**హామీల నుంచి ఆచరణ వైపు మంగళగిరి ప్రగతి ప్రయాణం - సంక్షేమం, అభివృద్ధి కలబోతగా నియోజకవర్గంలో నవ శకం**

ఒక నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని చెప్పడానికి కొత్త రోడ్లు, భవనాలు, పార్కులు కనిపించడం మాత్రమే సరిపోదు. అక్కడి ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు కనిపించాలి. యువతలో భవిష్యత్తుపై భరోసా పెరగాలి. మహిళల్లో ఆత్మవిశ్వాసం రావాలి. పేద కుటుంబాల్లో తమ పిల్లల భవిష్యత్తుపై నమ్మకం కలగాలి. రైతుకు సాగుపై భరోసా, చిరు వ్యాపారికి ఉపాధిపై ధైర్యం, విద్యార్థికి అవకాశాలపై ఆశ కనిపించాలి. ఈ సమగ్ర మార్పు దిశగా మంగళగిరి నియోజకవర్గంలో జరుగుతున్న ప్రయత్నాలను గమనిస్తే.. ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. అభివృద్ధిని కేవలం ప్రభుత్వ పథకాల అమలుగా కాకుండా, ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పుగా చూడాలనే ఒక ప్రత్యేకమైన విధానం. అదే "లోకేష్ మార్క్ మంగళగిరి".

నియోజకవర్గానికి ఒక నాయకుడుఉండటం వేరు. నియోజకవర్గంలోని ప్రతి సమస్యను తన బాధ్యతగా స్వీకరించడం వేరు. ప్రజలు అడిగిన తర్వాత స్పందించడం వేరు. సమస్యను ముందుగానే గుర్తించి పరిష్కారం కోసం ప్రయత్నించడం వేరు. ఈ రెండింటి మధ్య ఉన్న తేడానే మంగళగిరిలో కనిపిస్తున్న కొత్త రాజకీయ సంస్కృతికి కేంద్ర బిందువుగా మారుతోంది.

## అభివృద్ధి అంటే కేవలం పెద్ద ప్రాజెక్టులు కాదు

మంగళగిరిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. పెద్ద ప్రాజెక్టుల నుంచి చిన్నపాటి ప్రజా అవసరాల వరకు ఒక సమగ్ర ప్రణాళిక కనిపిస్తోంది. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వందల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ముందుకు వస్తున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు చర్యలు జరుగుతున్నాయి. రహదారులు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డొంక రోడ్లు, వంతెనలు, రైల్వే ఓవర్ బ్రిడ్జి వంటి మౌలిక వసతుల పై దృష్టి పెట్టారు. మరోవైపు పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, జంక్షన్ల అభివృద్ధి, ఆధునిక సిగ్నల్ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణవంటి అంశాలు పట్టణ జీవనాన్ని మెరుగుపరిచే దిశగా సాగుతున్నాయి. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, నీటి సదుపాయాలు వంటి ప్రాథమిక అవసరాలపై సమాంతరంగా పనులు జరగడం అభివృద్ధిని ఒకే రంగానికి పరిమితం చేయకుండా చూడాలనే ఆలోచనను ప్రతిబింబిస్తోంది.

## విద్యకు ప్రాధాన్యం.. భవిష్యత్ తరాలపై పెట్టుబడి

ఒక ప్రాంత భవిష్యత్తును మార్చాలంటే అక్కడి పిల్లల భవిష్యత్తును మార్చాలి.ఈ ఆలోచనతో మంగళగిరిలో విద్యా రంగానికి ప్రాధాన్యం కనిపిస్తోంది. నిడమర్రులో మోడల్ స్కూల్ నిర్మాణం, పాఠశాలల్లో ఆధునిక సదుపాయాల కల్పన, ఈ-టాయిలెట్లు, పాఠశాలల మరమ్మతులకు సీఎస్ఆర్ నిధుల వినియోగం వంటి చర్యలు విద్యార్థులకు మెరుగైన వాతావరణాన్ని కల్పించే ప్రయత్నంగా నిలుస్తున్నాయి. పుస్తకాలు చదివే అలవాటును ప్రోత్సహించేందుకు



గ్రంథాలయాల ఆధునికీకరణ, డిజిటల్ లైబ్రరీల దిశగా అడుగులు వేయడం మరో ముందడుగు. విద్య అంటే కేవలం తరగతి గది కాదు. నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, అవకాశాలు కూడా విద్యలో భాగమే. అందుకే స్కిల్ సెన్సెస్‌ను పైలట్ ప్రాజెక్టుగా మంగళగిరిలో ప్రారంభించడం యువత భవిష్యత్ అవసరాలను గుర్తించే ప్రయత్నంగా చూడాలి.

## ఉపాధి... యువతకు కొత్త దారి

నేటి యువతకు ప్రభుత్వ ఉద్యోగాలే ఏకైక లక్ష్యం కాదు. తమ ప్రతిభకు సరిపోయే అవకాశాలు కావాలి. నైపుణ్యానికి తగ్గ ఉపాధి కావాలి. వ్యాపారం ప్రారంభించేందుకు సహకారం కావాలి. ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని మంగళగిరిలో మెగా జాబ్ మేళాల నిర్వహణకు ప్రాధాన్యమిచ్చారు. వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నం జరిగింది. అదే సమయంలో మహిళలకు కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలు ఉపాధి కల్పనలో మరో కోణాన్ని చూపిస్తున్నాయి. చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు అందించడం... శ్రామికులకు ఫ్లాట్‌ఫామ్ రిక్షాలు, వెల్డింగ్ మెషిన్లు, ఇస్త్రీ బండ్లు వంటి ఉపాధి పరికరాలు అందించడం.. ఇవి పెద్ద మొత్తంలో కనిపించకపోయినా ఒక కుటుంబం జీవితాన్ని మార్చగలిగే సహాయాలు.

## మహిళలకు చేయూత...

ఒక కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చడంలో మహిళ పాత్ర కీలకం. అందుకే మహిళలకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, కుట్టు మిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యంఇవ్వడం కనిపిస్తోంది. అదే సమయంలో అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రత్యక్ష సహాయం, వైద్య సేవలు, వివాహ సహాయం వంటి కార్యక్రమాలు మహిళలు, కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్నాయి.

## చేనేతకు అండ...



మంగళగిరి పేరు చేనేతతో విడదీయలేనిది. ఈ ప్రాంత ఆర్థిక, సామాజిక జీవనంలో నేతన్న కుటుంబాలకు ప్రత్యేకస్థానం ఉంది. అకాల వర్షాల వల్ల నష్టపోయిన చేనేత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, మగ్గాలు ఉన్న కుటుంబాలకు ఉచితవిద్యుత్ వంటి చర్యలు నేతన్నల జీవనోపాధికి అండగా నిలిచే ప్రయ త్నాలు. ఇక మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా అభివృద్ధి చేయాలనే ఆలోచన,స్వర్ణకారుల కోసం కార్పొరేషన్ వంటి చర్యలు సంప్రదాయ వృత్తులకు ఆధునిక అవకాశాలను జోడించే దిశగా సాగుతున్నాయి.

## వైద్యం... ప్రజల గడపకు భరోసా

ప్రజలకు అత్యంత అవసరమైన రంగాల్లో వైద్యం ఒకటి. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, ఈమని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి వైద్య సేవలను మరింత చేరువ చేసే దిశగా సాగుతున్నాయి. అదే సమయంలో సొంత నిధులతో కొనసాగుతున్న సంజీవని వైద్య సేవలు అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రత్యక్ష సహాయం అందించే ప్రయత్నంగా నిలుస్తున్నాయి. ఆపదలో ఉన్నకుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

## పేద కుటుంబాలకు సొంత ఇంటి కల

నియోజకవర్గంలో వేలాది కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ, అవసరంలో ఉన్న కొన్ని కుటుంబాలకు వ్యక్తిగత చొరవతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇల్లు లేని కుటుంబానికి ఇల్లు.. ఉపాధి లేని వ్యక్తికి ఉపాధి సాధనం.. వైద్యం అవసరమైన వారికి వైద్య సహాయం.. ఇవన్నీ కలిపి చూసినప్పుడే సంక్షేమానికి అసలు అర్థం తెలుస్తుంది.

## ప్రతి వర్గానికీ... ప్రతి ప్రాంతానికీ...

మంగళగిరి ప్రత్యేకతదాని వైవిధ్యం. ఈ నియోజకవర్గంలో వివిధ మతాలు, కులాలు, వృత్తులు, సామాజికవర్గాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. అందుకే అభివృద్ధి కూడా అందరికీ చేరాలన్న దృక్పథం అవసరం. ఆలయాల అభివృద్ధి నుంచి మసీదులు, చర్చిలు, ఈద్గాలు, బరియల్ గ్రౌండ్లు, కమ్యూనిటీ హాళ్ల వరకు వివిధ వర్గాల అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న పనులు సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తున్నాయనే సంకేతాన్ని ఇస్తున్నాయి.

## పారిశుధ్యం నుంచి పర్యావరణం వరకు

'స్వచ్ఛ మంగళగిరి' వంటి కార్యక్రమాల ద్వారా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం, భారీగా పేరుకు పోయిన చెత్తను తొలగించడం, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటు, రీసైక్లింగ్ వస్తువుల స్వీకరణ కేంద్రాల ఏర్పాటువంటి చర్యలు పట్టణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్నవిగా చెప్పొచ్చు. ఇక ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనకు విస్తృత ప్రచారం కల్పించడం, ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వడం పర్యావరణహిత భవిష్యత్తు వైపు మరో అడుగు.

## క్రీడలకు ప్రోత్సాహం.. ప్రతిభకు గుర్తింపు

మంగళగిరిలో క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వడం కూడా ప్రత్యేకంగా కనిపిస్తోంది. మంగళగిరి ప్రీమియర్ లీగ్, వాలీబాల్ లీగ్, కబడ్డీ టోర్నమెంట్లు నిర్వహించడం, స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించడం, ప్రతిభకనబరిచిన వారికి నగదుబహుమతులు అందించడం.. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచే ప్రయత్నం. మంగళగిరికి ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ తీసుకురావడం, ఏపీఎల్ వంటి క్రికెట్ కార్యక్రమాలకు వేదికగా నిలిచేలా మౌలిక సదుపాయాలను సిద్ధం చేయడం క్రీడా రంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది.

## భక్తి.. సంస్కృతి.. సంప్రదాయాలకు గౌరవం

మంగళగిరి ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతం. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రతిపాదనలు, భక్తుల సౌకర్యాల మెరుగుదల, వివిధ ఆలయాల అభివృద్ధికి సహకారం వంటి చర్యలు స్థానిక ఆధ్యాత్మిక,సాంస్కృతిక వారసత్వాన్నికాపాడే ప్రయత్నంగా నిలుస్తున్నాయి.పండుగల సందర్భంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలకు బియ్యం వితరణ,ఆలయ కార్యక్రమాలకు సహకారం వంటి కార్యక్రమాలు స్థానిక సంప్రదాయాలతో ప్రజా ప్రతినిధి అనుబంధాన్ని మరింత బలపరుస్తున్నాయి.

## ప్రజా సమస్యలకు వ్యక్తిగత చొరవ

లోకేష్ మార్క్ మంగళగిరి గురించి మాట్లాడేటప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అంశం ఒకటి ఉంది. ప్రభుత్వ నిధులతో జరిగే అభివృద్ధి ఒక భాగం అయితే... సొంత నిధులతో ప్రజలకు అందిస్తున్న సహాయం మరో ప్రత్యేక భాగం.

## అన్న క్యాంటీన్ నుంచి తాగునీటి ప్రాజెక్టు వరకు

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడం పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు భోజనాన్నిఅందించే ప్రయత్నం. మరోవైపు వందల కోట్ల రూపాయలతో తాగునీటి ప్రాజెక్టు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ వ్యవస్థ వంటి శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టడం.. తక్షణ ఉపశమనం, దీర్ఘకాలిక అభివృద్ధి రెండింటినీ సమన్వయంచేసే విధానాన్ని చూపిస్తోంది.

## రోడ్డు నుంచి రైలు వరకు...

ఒక ప్రాంత అభివృద్ధికి కనెక్టివిటీ కీలకం. మంగళగిరి-తెనాలి మార్గం, గ్రామీణ రహదారులు, తాడేపల్లి-రేవేంద్రపాడు ప్రాంతాల రహదారులు, వివిధ గ్రామాల మధ్య బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం.. ప్రయాణాన్ని సులభతరం చేయడమే కాకుండా స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతమివ్వగలవు. రైల్వే స్టేషన్ అభివృద్ధి, నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి దిశగా అడుగులు, సీఆర్‌డీఏ పరిధిలో రోడ్లు, ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టులు భవిష్యత్ మంగళగిరి కనెక్టివిటీని దృష్టిలో పెట్టుకున్న ప్రయత్నాలు.

## నమ్మకం నుంచి బాధ్యత వరకు

మంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను చూస్తే.. 'ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట' నుంచి 'ఎన్నికల తర్వాత చేసిన పని' వరకు ప్రయాణం సాగుతున్నట్టు కనిపిస్తోంది.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



## ఉత్తరాంధ్రకు గోదారమ్మ... జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు



పాయకరావుపేట (చైతన్యరథం): ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఉత్తరాంధ్ర వాసుల కల సాకారం అయింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చేరుకున్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రెగ్యులేటర్ ఆన్ చేసి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేశారు. తొలుత సీఎం చంద్రబాబు పోలవరం ఎడమ ప్రధాన కాలువ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ గోదారమ్మకు సీఎం జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనిత, అచ్చెన్నాయుడు, ఎంపీ సి.ఎం. రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## హజ్-2027 యాత్రికులకు వైద్య పరీక్షలు

●ప్రభుత్వ వైద్యాధికారుల ద్వారా మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు : హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ భాష

విజయవాడ (చైతన్యరథం): హజ్-2027 యాత్రకు తాత్కాలికంగా ఎంపికైన యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాష సూచించారు. ఈ మేరకు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యాన్‌కు లిఖితపూర్వకంగా వినతి పత్రం అంద చేసినట్లు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీ చేసిన 2026 సెప్టెంబర్ 1 తేదీ సర్క్యులర్ నంబర్ 10 ప్రకారం తాత్కాలికంగా ఎంపికైన ప్రతి యాత్రికుడు తప్పనిసరిగా నిర్దేశిత మెడికల్ స్క్రీనింగ్ అండ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందన్నారు. ఈ సర్టిఫికెట్‌ను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రక్షణ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి సంస్థల ఆధ్వర్యంలో అధికారికంగా అనుమతించబడిన ప్రభుత్వ అల్లోపతి వైద్యాధికారి ద్వారా పొందాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో హజ్ యాత్రికులు తాత్కాలికంగా ఎంపికైన నేపథ్యంలో, వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, నిర్దేశిత నమూనాలో మెడికల్ స్క్రీనింగ్ అండ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసేలా అన్ని జిల్లాల జిల్లా వైద్య ఆరోగ్య అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్దేశించిన గడువులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసి, సర్టిఫికెట్లను పొందేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ సర్టిఫికెట్లను తదుపరి హజ్ కమిటీ ఆఫ్ ఇండియాకు సమర్పించేందుకు,



ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు వీలు కల్పించనున్నామని ఆయన చెప్పారు. హజ్ యాత్రికులు ఎలాంటి ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టితో హజ్ యాత్రకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వారి ఆదేశాల మేరకు ఫిట్నెస్ సర్టిఫికెట్లను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అందించాలని ఆయన కోరారు.

## మాయలోడు కంటే ఎమ్మెల్సీ తోటనే దిట్ట : ఎమ్మెల్యే వేగుళ్ళ మండిపాటు

● కనీసం ప్రజలు గమనిస్తున్నారన్న భయం కూడా లేదా...

●విషయం మనిద్దరి ఆస్తుల ప్రకటన... దాన్ని సైడ్‌ట్రాక్ పట్టించకండి...

●కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో సహా ప్రకటించేందుకు నేను సిద్ధం... మీరు సిద్ధమా?

●ఎమ్మెల్సీ తోటకు ఎమ్మెల్యే వేగుళ్ళ సూటి ప్రశ్న



మండపేట (చైతన్యరథం): అడిగేది ఒక్కటైతే చెప్పేది ఇంకోటి... ఇక ఈ తీరు మార్చుకోరా.... మీ ముందు మాయలోడు కూడా పనికిరాడు కదా అంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఫైర్ అయ్యారు. ఆయన సూటిగా మాట్లాడటం తాను ఎప్పుడూ చూడలేదని, కనీసం ప్రజలు గమనిస్తున్నారన్న భయం కూడా లేకపోతే ఎలా అని వేగుళ్ళ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఏడు సంవత్సరాలుగా త్రిమూర్తులు మాటల గారడీ చేస్తారని తాను చెబుతున్నానని, దానిని ఆయన తాజాగా మరోసారి అక్షరాలా నిజం చేసి చూపారని పేర్కొన్నారు. ఒక విషయం అడిగితే మరో విషయం చెప్పడం త్రిమూర్తులకు అలవాటేనని, కిరాణా దుకాణంలో బెల్లం ఉందా అని అడిగితే పంచదార ఉందని చెప్పినట్లుగా ఆయన సమాధానాలు ఉంటాయని ఎద్దేవా చేశారు. తాను త్రిమూర్తులను సూటిగా అడిగిన ప్రశ్న ఆస్తులకు సంబంధించినదన్నారు. రాజకీయాల్లోకి రాకముందు తన ఆస్తులు ఎంత? ప్రస్తుతం ఎంత? అలాగే త్రిమూర్తులు రాజకీయాల్లోకి రాకముందు ఆయన ఆస్తులు ఎంత? ప్రస్తుతం ఎంత? ఈ విషయాలు తేల్చుకోవడానికి తాను సిద్ధంగా వున్నట్లు వేగుళ్ళ తెలిపారు. ఈ విషయంపై లెక్కలు తేల్చుకునే ఉద్దేశ్యం ఎమ్మెల్సీ తోటకు ఉంటే ఆయనకు నచ్చిన ప్లీడర్, ఆడిటర్ లను నియమించాలని కోరారు. ఆయన ఆస్తుల వివరాలు ప్రకటించి సదరు విషయం నాకు చెబితే తాను సైతం సంబంధిత ప్లీడర్, ఆడిటర్ లకు ఆస్తుల వివరాలు వెల్లడిస్తానన్నారు. ఈ విషయంలో ఆయనకు నచ్చిన వ్యక్తులను నియమించుకునే అవకాశం ఆయనకే ఇస్తున్నట్లు చెప్పారు. మన ఆస్తులతో పాటు కుటుంబ సభ్యుల ఆస్తులను కూడా ప్రకటించుకుందామన్నారు. ఒకవేళ ఎవరైనా ఆస్తుల ప్రకటనలో తప్పులు చేస్తే రెండో వారు ఆ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చన్నారు. తాను ఎక్కడైనా ఆస్తులు ప్రకటించకుండా దాచి పెడితే ఆ ఆస్తులను ఎమ్మెల్సీ తోట స్వాధీనం చేసుకోవచ్చన్నారు. అలాగే ఎమ్మెల్సీ తోట దాస్తే వాటిని తాను స్వాధీనం చేసుకుంటానన్నారు. ఈ సవాల్ కు సిద్ధమే కాదో డొంక తిరుగుడు సమాధానాలు చెప్పకుండా సూటిగా చెప్పాలన్నారు. కోరుమిల్లి చెరువు గట్టు వద్ద తొలగించిన ఇళ్ల స్థలాల అంశంపై కూడా త్రిమూర్తులు అసలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఇతర విషయాలు ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. మాజీ సర్పంచ్ సలాది వీరబాబు తనకు తెలియకుండానే కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ వేశారని త్రిమూర్తులే చెబుతున్నారని, ప్రస్తుతం వీరబాబు ఏ పార్టీలో ఉన్నారో కూడా ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కోరుమిల్లి లో పేదల ఇల్లు తొలగించే సమయంలో మండపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఎవరున్నారో ఆయనే సమాధానం చెప్పాలన్నారు. అదే విధంగా కోరుమిల్లిలో తొలగించిన ఇళ్లు నిజంగా ఇళ్లు లేని నిరుపేదలవా లేక ఇతరులవా అనే విషయంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఇల్లు తొలగించే క్రమంలో పేదలకు అండగా నిలిచి వీరబాబుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆధారాలు గాని, న్యూస్ పేపర్ కటింగ్ లు గానీ ఏమైనా ఉంటే వాటికి కూడా చూపించాలన్నారు. లేదా వీరబాబు పై ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేయలేదో దానికి కూడా సమాధానం చెప్పాలన్నారు.

## జామి మండలం చింతాడలో భారీ అగ్నిప్రమాదం

●12 పశువుల పాకలు దగ్ధం

●బాధితులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి భరోసా



విజయనగరం (చైతన్యరథం): జామి మండలం చింతాడ గ్రామంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు గ్రామంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈ ఘటనలో 12 పశువుల పాకలు, ఎనిమిది గడ్డి వాములు, నాలుగు ధాన్యం పురులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సరికే మంటలు ఉధృతంగా వ్యాపించి పశువుల పాకలు పూర్తిగా బూడిదయ్యాయి. ఏడాది పొడవునా కష్టపడి దాచుకున్న ధాన్యం, పశుగ్రాసం కాలి బూడిదవడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా సమీక్షించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఆమె వెంటనే స్పందించి స్వయంగా నాలుగు వాటర్ ట్యాంకర్లను సమకూర్చి మంటలను అదుపు చేయించారు. అనంతరం బాధిత రైతు కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. గ్రామంలో జరిగిన ఆస్తి నష్టం వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున బాధిత రైతులకు పూర్తి న్యాయం జరిగేలా, తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే పాకలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న 12 బాధిత కుటుంబాలకు తక్షణమే 'గోకుల షెడ్లు' మంజూరు చేయిస్తున్నట్లు ప్రకటించారు. విపత్తు వేళ ఎమ్మెల్యే తక్షణమే స్పందించి అండగా నిలవడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామి మండల పార్టీ అధ్యక్షుడు వర్రి రమణ, తెలుగు యువత అధ్యక్షుడు రాయవరపు శంకర్, రెడ్డి పైడి బాబు, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## పుష్కరాల నాటికి నగరంలో మరో 22 పార్కుల అభివృద్ధి

●ఆరోగ్యకరమైన నగరం మా లక్ష్యం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

●రూ.9 లక్షలతో 13వ డివిజన్ వెలుగు పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రానున్న పుష్కరాల నాటికి నగరంలో మరో 22 పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగర ప్రజల ఆరోగ్యం మెరుగుపరిచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్థానిక 13వ డివిజన్‌లోని వెలుగు పార్కును రూ.9 లక్షలతో ఆధునీకరించే పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... 13వ డివిజన్ ఎప్పటి నుంచో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉందని, ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఇక్కడ టీడీపీ జెండా ఎగురుతూనే ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ డివిజన్‌లో ఇప్పటికే సుమారు రూ.60 లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. వెలుగు పార్కు అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు, పిల్లల ఆట స్థలం, నేమ్ బోర్డులు, పెయింటింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనానికి ఈ పార్కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే నగరంలో 25 పార్కులను అభివృద్ధి చేశామని, పుష్కరాల నాటికి మరో 22 పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అభివృద్ధి అంటే కేవలం ప్రధాన రహదారులు, డివైడర్లు నిర్మించడం మాత్రమే కాదన్నారు. గత పాలకులు ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా పలుచోట్ల డివైడర్లు ఏర్పాటు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అవసరాలను గుర్తించి వాటికి తగ్గట్టు అభివృద్ధి పనులు చేపట్టమన్నారు. ప్రధాన రహదారులతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న ఇంటర్నల్ రోడ్లు, పార్కులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదావరి జలాలు ఉత్తరాంధ్రలోకి... సీఎం జలహారతి

అనకాపల్లి (చైతన్యరథం): ఉత్తరాంధ్రలో ఓ భావోద్వేగ దృశ్యం ఆవిష్కృతమైంది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు తొలిసారిగా ఉత్తరాంధ్రలోకి అడుగుపెట్టాయి. పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ప్రవహించిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని.. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లాకు గోదారమ్మ తరలివచ్చిన సందర్భంగా కాలువ వద్దకు భారీగా చేరుకున్న స్థానికులు, రైతులు, మహిళలు పుష్పాలతో జలాలకు స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. అరుణవర్ణంలో పరవళ్లు తొక్కుతూ వస్తున్న గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు పుష్పాలు, పసుపు, కుంకుమ సమర్పించి జలహారతి ఇచ్చారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**●రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక మూడవ వార్డులో రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అవిర్భావం నుంచే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేలా అనేక అవకాశాలను కల్పిస్తూ వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని కుడుపూడి సత్తిబాబు తెలిపారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రం అందజేత



కొవ్వూరు (చైతన్యరథం): మండలం చిడిపి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బొల్లా వెంకటేశ్వరరావు గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో, పార్టీ సభ్యత్వం ద్వారా లభించిన రూ.5,00,000 ప్రమాదబీమా మొత్తానికి సంబంధించిన పత్రాలను కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు చిడిపి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి, ఆయన సతీమణి బొల్లా ఆదిలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరపని చిన్ని, బేతిన నారాయణ, మెన్ని పార్దు, మంకిన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ అంటే ప్రశ్నించే గొంతుక

**●వాడవాడలా ఘనంగా ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు**

**●హాజరైన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**




గుంటూరు (చైతన్యరథం): తెలుగుచలన చిత్రరంగంలో అభిమానుల గుండెలను దోచుకున్న నటుడిగా, ఆలోచనల్లో కదిలే తత్వవేత్తగా, ప్రజల కష్టాల్లో పాలుపంచుకునే నాయకుడిగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జీవితం ఆదర్శప్రాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పాత గుంటూరు రామ్మూర్తి వృద్ధాశ్రమంలో, ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద ఇస్రాయిల్ పేట మెయిన్ రోడ్డులో, పాత గుంటూరు కాపు కళ్యాణ మండపంలో, నెహ్రూనగర్ 6వ లైన్ లో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అంటే ప్రశ్నించే గొంతుక అని తెలిపారు. తుపానులా దూసుకొచ్చే వ్యక్తిత్వం వెనుక ఎంతో నిశ్శబ్దమైన తపన ఉందని చెప్పారు. ఆయన వెండితెరపై ప్రదర్శించిన ఉద్వేగాలు లక్షలాది గుండెల్లో ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ప్రజల భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాయని చెప్పారు. నాయకత్వం అంటే నిరంతర బాధ్యత అని చాటుతూ ముందుకు సాగుతున్న ఆయన అడుగుల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఓటములు ఎదురైనా అధైర్యపడకుండా, సిద్ధాంతాలకే కట్టుబడి నిలబడిన ఆయన ధైర్యం, నిబద్ధత ఈ రోజు ఆయనను ప్రజా నాయకుడిగా నిలబెట్టాయని తెలిపారు. రైతుల సమస్యలు, యువత ఉపాధి, మహిళల రక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ కళ్యాణ్ పడ్డ తపన, చూపిన చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్ పవన్ కళ్యాణ్ ప్రస్థానం ఉన్నతమని చెప్పారు. రాష్ట్ర ప్రగతి కోసం సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి పవన్ కళ్యాణ్ వేసిన అడుగులు ఎంతో కీలకమని తెలిపారు.

## నిమ్మకూరులో నందమూరి హరికృష్ణ 70వ జయంతి వేడుకలు

**●టీటీడీ కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ**

**●ఎన్టీఆర్, హరికృష్ణ లకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించిన నేతలు**



నిమ్మకూరు (చైతన్యరథం): చైతన్యరథ సారథి, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ 70వ జయంతి సందర్భంగా నిమ్మకూరు గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ హాజరయ్యారు. ఎన్టీఆర్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, పామర్రు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, కొప్పెర్ల లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ తిరుపతి చైర్మన్ కొప్పెర్ల దివాకర్ రావు పర్యవేక్షించారు.ముందుగా రామకృష్ణ ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులోని నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హరికృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. ఈ శిబిరాలకు విశేష స్పందన లభించింది 221 మంది రక్తదానం చేయగా 302 మంది చర్మవ్యాధులు, షుగర్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేయించుకున్నారు. 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 89 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు 18 మందికి ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. 180 మంది దంత వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోగా చిన్న పిల్లల విభాగంలో 55 మంది పిల్లలు వైద్య సహాయం పొందారు, గుండె వ్యాధులు, నరములు, కీళ్లు, ఎముకలు ఇతర వ్యాధులకు 314 మంది పరీక్షలు చేయించుకున్నారు.

**రక్తదాన శిబిరానికి అపూర్వస్పందన**

ఎన్టీఆర్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిమ్మకూరులో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో రక్తదానం చేసేందుకు యువత ముందుకు వచ్చారు. 221 మంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ... రక్తదానం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండటం వల్లే శిబిరానికి అపూర్వ ఆదరణ లభించిందని.. రక్తదానం చేసి ప్రాణదాతలుగా మిగిలిపోతారని అన్నారు. రక్తదానం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని చెప్పారు.

**ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ...** సొంత గ్రామంలో తన సోదరుడు హరికృష్ణ జయంతిని పురస్కరించుకుని రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. హరికృష్ణ ప్రజల మధ్య తిరిగిన నాయకుడని, ఆయన పర్యటనలకు అపూర్వ ప్రజాదరణ లభించేదని గుర్తు చేశారు. రవాణా శాఖ మంత్రిగా హరికృష్ణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ట్రాక్టర్ పన్ను రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. గోదావరి వరదల సమయంలో జోలె పట్టి విరాళాలు సేకరిస్తూ బాధితుల కోసం కృషి చేసిన సేవాస్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. డ్రైవింగ్‌పై ఆయనకు ఉన్న మక్కువ, ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, సూరపనేని హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



గోపాలపురం (చైతన్యరథం): పీ - 4 విధానంలో దేవరపల్లి, గోపాలపురం పోలీస్ స్టేషన్లకు రూ.24 లక్షల విలువైన రెండు మహీంద్రా బొలెరో నియో వాహనాలను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 విధానంలో భాగంగా, బుధవారం రాజమహేంద్రవరం జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని గోపాలపురం, దేవరపల్లి పోలీస్ స్టేషన్లకు రూ.24 లక్షల విలువైన రెండు మహీంద్రా బొలెరో నియో వాహనాలను పోలీస్ శాఖ, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఐపీఎస్‌కి ఈ రెండు వాహనాలను ఎమ్మెల్యే మద్దిపాటి అందజేశారు. గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు ఒక మహీంద్రా బొలెరో నియో వాహనాన్ని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, గోపాలపురం మండల నాయకులు మరియు ఎమ్మెల్యే సౌజన్యంతో అందజేశారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్‌కు మరో మహీంద్రా బొలెరో నియో వాహనాన్ని పరమేశు బయోటెక్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద స్వరూప్ తమ సంస్థ సౌజన్యంతో అందజేశారు. ఈ వాహనాన్ని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ సమక్షంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మరియు పరమేశు బయోటెక్ ఎండీ ఆనంద స్వరూప్ కలిసి పోలీస్ శాఖకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ... పోలీస్ శాఖకు అవసరమైన వాహనాలను సమకూర్చడం ద్వారా పోలీసు అధికారులు, సిబ్బంది మరింత వేగవంతంగా విధులు నిర్వహించడంతో పాటు, అత్యవసర సమయాల్లో సత్వర స్పందన అందించేందుకు, ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**●పవన్ భుజం నొప్పి తగ్గి త్వరగా ప్రజాక్షేత్రంలోకి రావాలి: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలు బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో, హనుమాన్‌నగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొనగా, జనసేన గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు చలమలశెట్టి రమేష్‌బాబుతో కలిసి అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... తన ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ సభలతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ తిరుపతి నుంచి గన్నవరం చేరుకుని హనుమాన్ జంక్షన్ సమీపంలో తన విజయాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించిన సభను జీవితాంతం మరచిపోలేనన్నారు. నేషనల్ మీడియా ఇంటర్వ్యూలను సైతం మంగళగిరి నుంచి హనుమాన్ జంక్షన్‌కు మార్చుకుని రావడం తనపై చూపిన అభిమానానికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు సమయంలో రాజమహేంద్రవరం జైలు వద్ద సీట్ల లెక్కలు చూడకుండా కూటమికి అండగా నిలిచి కలిసి ఎన్నికలకు వెళ్తానని ప్రకటించిన పవన్ కళ్యాణ్ రాజకీయ నిబద్ధతకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. 2008 నుంచి ప్రజా జీవితంలో క్రియాశీలకంగా ఉంటూ ప్రజాసేవ లక్ష్యంతో జనసేన పార్టీని స్థాపించి, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా కూటమికి మద్దతు ఇవ్వడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

# పవన్ కళ్యాణ్ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం

●దుష్ట పరిపాలన అంతం కోసం పవన్ కళ్యాణ్ చేసిన పోరాటం మరువలేనిది

●చంద్రబాబు-పవన్ కళ్యాణ్ మైత్రి రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా (తిరువూరు జనసేన పార్టీ కార్యాలయం)ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. తిరువూరు జనసేన పార్టీ ఇంచార్జి మనుబోలు శ్రీనివాసరావు, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ జిల్లా కూటమి తరపున ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. గతంలో రాష్ట్రంలో సాగిన దుష్ట పరిపాలనకు చరమగీతం పాడేందుకు పవన్ కళ్యాణ్ చేసిన పోరాటం, కూటమి ఏర్పాటులో ఆయన పోషించిన కీలక పాత్రను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరని ఎంపీ కేశినేని అన్నారు. ఎలాంటి వ్యక్తిగత లేదా రాజకీయ లాభాలను ఆశించకుండా, రాష్ట్ర అభివృద్ధి కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా కలిసి పనిచేస్తేనే ఆంధ్రప్రదేశ్‌ను మరింత అభివృద్ధి చేయగలమని ఆలోచించిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా అండగా నిలబడి పార్టీకి, నాయకత్వానికి బాసటగా నిలిచిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని కేశినేని చిన్ని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్న ఆయనలాంటి నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో అవసరమని అన్నారు. పవన్ కళ్యాణ్ చేసే ప్రతి పని రాష్ట్ర ప్రయోజనం, ప్రజల ప్రయోజనం కోసమేనని ఎంపీ తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం యువత పవన్ కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న మైత్రి, సమన్వయం ఎంతో గొప్పదని కేశినేని చిన్ని అన్నారు. ఈ మైత్రి రాష్ట్ర అభివృద్ధికి మరింత బలాన్ని ఇస్తుందని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా, సమన్వయంతో కలిసి పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ కేశినేని చిన్ని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

## లోకేష్ రాకతో పులకించిన పల్నాడు.. నరసరావుపేటలో కూటమి సైనికుల జోష్

●డప్పులు, డీజేలతో హోరెత్తిన ఎస్.ఆర్.కే. సెంటర్... భారీ జనసందోహం మధ్య జై లోకేష్ నినాదాలతో మార్మోగిన ప్రాంతం



నరసరావుపేట (చైతన్యరథం): పల్నాడు జిల్లా ముఖద్వారమైన నరసరావుపేట పట్టణంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కు తెలుగుదేశం, జనసేన శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. మంత్రి లోకేష్ రాకతో నరసరావుపేట పట్టణం పసుపుమయంగా మారింది. ఎస్.ఆర్.కే. సెంటర్ వద్దకు భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన కార్యకర్తలు, యువత, అభిమానులు డప్పులు, డీజేలతో సందడి చేస్తూ తమ అభిమాన నాయకుడికి ఘనంగా స్వాగతం పలికారు. జై లోకేష్ నినాదాలతో ఎస్.ఆర్.కే. సెంటర్ పరిసరాలు మార్మోగాయి. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జాన్ సైదా, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, గుంటూరు మాజీ మేయర్ కోవెలమూడి నాని తదితరులు ఉన్నారు. మంత్రి లోకేష్ పర్యటన నేపథ్యంలో పల్నాడు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో నరసరావుపేటకు చేరుకున్నారు. పార్టీ జెండాలు, బ్యానర్లు, స్వాగత తోరణాలతో ప్రధాన రహదారులు కళకళలాడాయి. యువత, మహిళలు, పార్టీ అభిమానులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిమాన నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కూటమి ప్రభుత్వంలో విద్య, ఐటీ రంగాల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి పట్ల ప్రజల్లో ముఖ్యంగా యువతలో మంచి స్పందన ఉందని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి యువతకు మెరుగైన అవకాశాలు, విద్యారంగంలో ఆధునిక సంస్కరణల దిశగా లోకేష్ తీసుకుంటున్న చర్యలను ప్రజల్లో విశేష ఆదరణ కలిగి ఉందని పేర్కొన్నారు.

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ రికార్డు

●83,638 గృహాల సందర్శనతో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిన పార్టీ శ్రేణులు: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన “ఇంటింటికి కూటమి ప్రభుత్వం” కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విజయవంతం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో మొత్తం 83,638 గృహాలను సుమారు 90 శాతం మేర సందర్శించి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలు, సూచనలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా పార్టీ శ్రేణులు రికార్డు స్థాయి పనితీరును కనబరిచాయని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం ప్రజా ప్రభుత్వ లక్షణమని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి వెళ్లడానికి కూడా వెనుకంజ వేసేవారని, ప్రజలకు అందుబాటులో ఉండకుండా వ్యవహరించారని విమర్శించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తుంటే వారు ఆప్యాయంగా స్వాగతిస్తున్నారని చెప్పారు. ప్రజలకు చేరువగా ఉండే ప్రజా ప్రభుత్వానికి, ప్రజలకు దూరంగా ఉండే నియంతృత్వ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదేనని వైసీపీ నేతలు గమనించాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. జగన్ రెడ్డి ఇతరులు చేసిన పనులకు క్రెడిట్ తీసుకునే ప్రయత్నాలు చేయడం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జగన్ రెడ్డి క్రెడిట్ చోరీ రాజకీయాలకు పాల్పడుతున్న తీరును చూసి ఆ పార్టీ నాయకులే నవ్వుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు.

## చెట్లు లేకపోతే భూమి మరో మార్స్‌లా తయారవుతుంది

●ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబు ఎంపిక రాష్ట్ర హరితాభివృద్ధిలో కీలక ముందడుగు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): విద్యార్థిగా ఉన్నప్పుడే పచ్చదనం, పర్యావరణంపై మిక్కిలి ఆసక్తి కనబరిచేవాడినని, రాజకీయాల్లోకి రాకముందు గుంటూరు, విజయవాడ వచ్చినప్పుడు పర్యావరణ పరిరక్షణపై యువతతో చర్చించి వారిలో అవగాహన పెంచేవాడినని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక ఆ విభాగం తరపున చిలకలూరిపేటలో స్థానిక ఆర్.వీ.ఎస్, సీ.వీ.ఎస్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ హోదాలో రాష్ట్రంలో చేపట్టిన తొలి కార్యక్రమం చిలకలూరిపేటలో విద్యార్థులు, కూటమి నాయకుల మధ్య, ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నాడు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా నాగబాబు తెలిపారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం ఎమ్మెల్సీ నాగబాబు ఎమ్మెల్యే ప్రత్తిపాటి విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి తమకు ఇచ్చిన మొక్కను తమ ఇంటి ఆవరణ, లేదా ఖాళీ ప్రదేశాల్లో నాటి సంరక్షించాలని వారు సూచించారు. అనంతరం విద్యార్థులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్.వీ.ఎస్, సీ.వీ.ఎస్ హైస్కూల్లో కార్యక్రమానంతరం ఎమ్మెల్సీ నాగబాబు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి నివాసంలో జనసేన, టీడీపీ, బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసిన నాగబాబు, పవన్ కళ్యాణ్ తరపున ఆయన అభిమానులు, కూటమి శ్రేణులకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి అందించిన ఆతిథ్యాన్ని నాగబాబు స్వీకరించారు.

**రాజకీయాల్లోకి రాకముందే పర్యావరణ పరిరక్షణపై యువతకు అవగాహన కల్పించేవాడిని : నాగబాబు**

విద్యార్థిగా ఉన్నప్పుడే పచ్చదనాన్ని బాగా ఇష్టపడేవాడినని, రాజకీయాల్లోకి రాకముందు గుంటూరు, విజయవాడ వచ్చినప్పుడు స్థానిక యువతతో పర్యావరణ పరిరక్షణపై చర్చించి, వారి అభిప్రాయాలు తెలుసుకొని, పచ్చదనం ఆవశ్యకతపై వారిలో అవగాహన పెంచేవాడినని నాగబాబు పేర్కొన్నారు. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరచుకుంటానని, రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు శాయశక్తులా కృషి చేస్తానని నాగబాబు చెప్పారు.

**మొక్కలు లేకపోతే భూమి మరో మార్స్ లా తయారవుతుంది**

పచ్చదనం కనుమరుగై, మొక్కలనేవి లేకపోతే భూమి మార్స్‌లా తయారవుతుందని, ఈ సందర్భంగా మా తరం పచ్చదనం పెంపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు నేను విద్యార్థులకు (భవిష్యత్ తరాలు) సభాముఖంగా బహిరంగక్షమాపణలు చెబుతున్నానని నాగబాబు తెలిపారు. స్వార్థపూరిత మనుషుల ఆలోచనా విధానమే పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతోందని, మొక్కలు, ముఖ్యంగా చెట్లు మన జీవితంలో ఒక భాగమని ఆయన అభిప్రాయపడ్డారు.

## జగ్గయ్యపేటలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

● పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మాజీ మంత్రి నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట (చైతన్యరథం): డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మాజీమంత్రి నెట్టెం రఘురాం పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి నేతలు పవన్‌కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీమంత్రి, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. చంద్రబాబునాయుడు అనుభవం, పరిపాలనా దక్షతకు పవన్ కళ్యాణ్ ప్రజా బలం, యువతలో ఉన్న విశ్వాసం తోడవడంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడిందని నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఐక్యతే రాష్ట్ర ప్రగతికి బలం అని, కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మరింత వేగంగా పనిచేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కళ్యాణ్‌కి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని నెట్టెం రఘురామ్ హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. నెట్టెం రఘురామ్ సమక్షంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

జోన్-4 (ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు) చైతన్యరథం

# మహోన్నత ముఖ్యమంత్రి చంద్రబాబు

## క్రెడిట్ లేకే వైసీపీకి 11 సీట్లు, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి



కనిగిరి (చైతన్యరథం): వెలుగొండ ప్రాజెక్టు విషయంలో వైసీపీ క్రెడిట్ చోరీ మాటలపై కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మీకు క్రెడిట్ అనేది ఉంటే 11 సీట్లు వచ్చి ఉండేవి కావన్నారు. వైసీపీ హయంలో వెలిగొండలో కేవలం 7 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. మట్టి పనులు చేసి నిధులు దోచుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు కూడా వైసిపి తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఎద్దేవా చేశారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితుల కుటుంబాలను సీఎం చంద్రబాబు ఆదుకున్నారని ఎమ్మెల్యే ఉగ్ర కొనియాడారు. రికార్డు స్థాయిలో రూ. 900 కోట్లు నిర్వాసితులకు పరిహారం అందజేసిన మహోన్నత నేత సీఎం చంద్రబాబు అన్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా, నీళ్లు వదలకుండా ప్రజలను మోసం చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారన్నారు. వైసీపీ చేసిన ఈ మోసం వల్లే పశ్చిమ ప్రకాశం జిల్లాలో కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం టీడీపీ గెలిచింది, స్వల్ప మెజారిటీతో ఎర్రగొండపాలెం ఓడిపోయామన్నారు.




# అండమాన్‌లో పట్టణ గృహ పథకాలపై చర్చలు

## పాల్గొన్న కమిటీ చైర్మన్ ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు (చైతన్యరథం): ఆధ్యయన సందర్శన కార్యక్రమంలో భాగంగా గృహ పట్టణ వ్యవహారాల పార్లమెంటు కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కమిటీ సభ్యులతో కలసి బుధవారం అండమాన్ నికోబార్ స్వరాజ్ ద్వీపంలో (హేవ్ లాక్ ద్వీపం) గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలకు సంబందించిన పలు కేంద్ర పథకాల అమలుపై రాష్ట్ర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవులు, గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, శ్రీ విజయపురం మునిసిపల్ కౌన్సిల్, హడ్కో, యన్.బి.సి.సి., సి.పి.డబ్ల్యు.డి., స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ బరోడా ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారి పథకాలు కార్యక్రమాల అమలు గురించి, మానవ వనరుల సామర్థ్యం, ఆదాయ వనరులు గురించి అండమాన్ నికోబార్ దీవులలో హడ్కో, ఎన్‌బీసీసీ పథకాల అమలు గురించి చర్చలు జరిపారు. ఈ చర్చలలో ప్రతినిధులు కోరిన సదుపాయాలు చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వానికి శిఫార్సు చేస్తానని వారికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు.

# ఎంతటివారైనా కబ్జాదారుల కోరలు పీకేస్తాం : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళగా భావించి సమతుల్య పాలన అందిస్తోందని వెంకటగిరి శాసనసభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, బాలాయపల్లి మండలం, జయంపు గ్రామంలో జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు భాస్కర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటింటికీ సంక్షేమ వివరణ కార్యక్రమం నూతన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ప్రారంభించి, ఆరోగ్య ఉపకేంద్రం, సొసైటీ గౌడోన్ భవనముల శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జయంపు పంచాయతీ పరిధిలో దాదాపు రూ. 9.80 కోట్ల వ్యయంతో రహదారులు, భవనాలు, మౌలిక వసతుల పనులను చేపట్టినట్లు వెల్లడించారు. స్థానిక నాయకులు, ప్రజల వినతి మేరకు సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తామని, మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.రూ. 1.10 కోట్లతో తహశీల్దార్ కార్యాలయం: బాలాయపల్లి మండల కేంద్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం రూ. 1.10 కోట్లతో నూతన ఎమ్మార్వో కార్యాలయ భవన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అధికారులు వెంటనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.అక్కడే ఏర్పాటు చేసిన ప్రజాధర్బార్ లో ప్రజల ద్వారా వినతి పత్రాలను స్వీకరించి అక్కడక్కడే మండల అధికారులుకు సమస్యలును వివరించి పరిష్కరించాలని ఆదేశించారు.?ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, మండలలోని సొసైటీల అధ్యక్షులు, ఎమ్మార్వోలు, ఎంపీడీఓ,మండల అధికారులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, జయంపు గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మండల జనసేన, బీజేపీ నాయకులు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరవు నేలను తాకిన కృష్ణమ్మ జలధార

## యర్రగొండపాలెం టీడీపీ నేతల పూజలు



దోర్నాల (చైతన్యరథం): మూడు దశాబ్దాలుగా కరవు పిడిత ప్రజలు ఎదురుచూస్తున్న పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేసి, కృష్ణమ్మ జలాలను విడుదల చేసిన చారిత్రాత్మక ఘట్టం నేపథ్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాలతో మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి ఆధ్వర్యంలో యర్రగొండపాలెం మండల టీడీపీ నాయకులు, దోర్నాల మండల టీడీపీ నాయకులు కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలహారతి ఇచ్చి, పసుపు, కుంకుమ సమర్పించి కృతజ్ఞతలు తెలిపారు... కృష్ణమ్మ జలాలు ఈ ప్రాంత రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఎకరం పచ్చగా మారాలని, ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటు పూజలు నిర్వహించారు.



# మారికవలస పాఠశాలపై మాట్లాడితే మాడు పగులుద్ది

## వైసీపీ నేతలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ హెచ్చరిక

అమరావతి (చైతన్యరథం): గిరిజన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థలను రాజకీయాలకు వేదికగా మార్చడం అత్యంత దురదృష్టకరమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. మారికవలస గురుకుల రెసిడెన్షియల్ స్కూల్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మారికవలస గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను మరింత ఉన్నత స్థాయికి అప్‌గ్రేడ్ చేయడంతో పాటు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. గిరిజన విద్యార్థులు కేవలం పాఠశాల విద్యకే పరిమితం కాకుండా, ఉన్నత విద్యలో దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశం పొందే స్థాయికి ఎదగాలన్నదే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటుతో గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచి, వారికి నాణ్యమైన విద్యతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన ప్రత్యేక శిక్షణ అందించి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం ద్వారా గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. మారికవలస రెసిడెన్షియల్ స్కూల్‌లో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడం కోసం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మారికవలసకు చెందిన 445 మంది విద్యార్థులను ఇతర ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటుంటే తప్పేంటని నరహరి ప్రసాద్‌ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, మాజీ గిరిజన ఎమ్మెల్యేలు, ఇతర వైకాపా నాయకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను ఇతర పాఠశాలల్లో చేరకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా వైసీపీ నేతలు విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ, తప్పుడు ప్రచారంతో వారి విద్యా భవిష్యత్తును అయోమయంలోకి నెడుతున్నారని విమర్శించారు. ఐఐటీ, జేఈఈ, నీట్, ఎయిమ్స్ వంటి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందించాలనుకోవడంలో తప్పేముంది? దీనిపై కూడా రాజకీయాలు చేయడం ఎందుకు?" అని ఆయన ప్రశ్నించారు. "విద్యార్థులకు మెరుగైన విద్య అందించే ప్రయత్నాన్ని అడ్డుకోవడం అంటే వారి భవిష్యత్తుకు అడ్డుకట్ట వేయడమే అని స్పష్టం చేశారు. గత ఐదు సంవత్సరాల్లో గిరిజన ప్రాంతాల సమస్యలను పట్టించుకోకుండా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. గిరిజనుల హక్కులు, ప్రయోజనాలకు సంబంధించిన జీవో నంబర్ 3, 1/70 చట్టం విషయంలో గత పాలనపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. గిరిజన విద్యార్థులకు అందాల్సిన కనీస సదుపాయాల్లో భాగమైన కాస్మెటిక్స్ కూడా సక్రమంగా అందించలేదని, ముఖ్యంగా గిరిజన విద్యార్థులు చదువుతున్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. "గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టని వారు నేడు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. అరకు ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని నాడు ఆరోపణలు వచ్చిన సమయంలో అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకులు, సజ్జల రామకృష్ణారెడ్డి అనుచరులుగా పేర్కొంటున్న వారిపై గిరిజన నాయకులు ఎందుకు ప్రశ్నించలేదని నరహరి వరప్రసాద్ నిలదీశారు. "గిరిజన ప్రాంతాల సహజ వనరులపై అక్రమంగా దోపిడీ జరుగుతోందని ఆరోపణలు వచ్చినప్పుడు మౌనం వహించిన నాయకులు, ఇప్పుడు గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించే కార్యక్రమాలపై మాత్రం ఎందుకు రాజకీయాలు చేస్తున్నారు?" అని ప్రశ్నించారు.

# ఒక్క గుంతనైనా పూడ్చడం చేతగాని వైసీపీ

## గతుకుల రోడ్లకు మోక్షం కల్పిస్తున్నామన్న ఎమ్మెల్యే సునీత



రాప్తాడు (చైతన్యరథం): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లకు పడ్డ గుంతలు కూడా పూడ్చలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు చేశారు. కనగానపల్లి మండల పరిధిలో ఆమె రూ.3.40కోట్లతో నూతన రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ధర్మవరం, కళ్యాణదుర్గం రోడ్డు నుంచి వయా యలక్కుంట్ల మీదుగా భద్రాపురం గ్రామం వరకు 8కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ రోడ్డు యలక్కుంట్ల, నెమలివరం, బద్దలాపురం గ్రామాల ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు రైతులకు మండల కేంద్రంలోని కార్యాలయాలకు అనేక పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇక గుంతల వలన ఇబ్బంది పడే పరిస్థితి ఉండదన్నారు. గతంలో ఇక్కడ ఉన్న తారు రోడ్డు గుంతలు పడి ప్రజలు చాలా ఇబ్బంది పడేవారని.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయలేదన్నారు. దీంతో రోడ్డు మరింత దెబ్బతినిందన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సునీత చొరవ తీసుకుని ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు తీసుకొచ్చారు. కనగానపల్లి మండలంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణాల విషయంలో కనగానపల్లికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు.



# కరోనా శవాలపై సొమ్ములేరిన కిరాతకుడు

## మాజీమంత్రి అనిల్‌పై విరుచుకుపడిన టీడీపీ నేత కేతంరెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతుల ప్రజాదరణను చూసి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భయపడుతున్నారని తెలుగుదేశం పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇటీవల విలేకరుల సమావేశాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వినోద్ మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రజలు అల్లాడుతుంటే, మాజీమంత్రి అనిల్ తన తమ్ముడిని అడ్డుపెట్టుకుని వందల కోట్లు దోచుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. పెద్దాస్పత్రిలో బెడ్‌లు, రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు, చివరికి బాధితులకు ఇచ్చే తిండిని కూడా అమ్ముకుని తిన్న నీచుడు అనిల్ అని మండిపడ్డారు. నెల్లూరు ప్రజల శాపాలు తగిలే నెల్లూరులో తంతే పల్నాడులో, పల్నాడులో తంతే చెన్నైలో పడ్డాడని విమర్శించారు. నెల్లూరులో ఎంట్రీ లేక, వైసీపీలో ఎమ్మెల్యే టిక్కెట్ దక్కక, రాబోయే మేయర్ ఎన్నికల్లో సీటు సాధించడానికే జగన్ మెప్పు కోసం వేమిరెడ్డిపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. నుడాలో నెలకు రూ.5 కోట్ల చొప్పున కమిషన్లు మింగారని, బిల్డింగ్ పర్మిషన్లు, లేఅవుట్లలో దోచుకున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ శాఖలో వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, నెల్లూరు రిటైనింగ్ వాల్ నిర్మాణంలో రూ.100 కోట్ల అవినీతిపై ఇప్పటికీ కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ఇక కాలువల తవ్వకాలు, ఇసుకను అక్రమంగా చెన్నైకి తరలించి సంపాదించిన అక్రమార్జనపై ప్రింట్ వేస్తే 15 పుస్తకాల చిట్టా అవుతుందని చెప్పారు. కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తీరును కూడా కేతంరెడ్డి వినోద్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. వేమిరెడ్డి గారి తరపున మాట్లాడే వారిని విమర్శిస్తున్న ప్రసన్న, అసలు అనిల్‌కు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో చెప్పాలని నిలదీశారు.

# వ్యవసాయాన్ని పండుగ చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యం

## 'అగ్రి ఎక్స్‌పో, కిసాన్ మేళాలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ వెల్లడి



నాయుడుపేట (చైతన్యరథం): నాయుడుపేట పట్టణంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'అగ్రి ఎక్స్‌పో, కిసాన్ మేళా – 2026' కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల అవగాహన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుమారు 40కి పైగా వ్యవసాయ స్టాల్స్‌ను ఎమ్మెల్యే విజయశ్రీ, జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రదర్శనలో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, డ్రోన్ల వినియోగం, నూతన యంత్రాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ టెక్నాలజీ ప్రదర్శన రైతులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ "గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దార్శనికతతో, వ్యవసాయాన్ని దండగ కాదు పండుగ అని నిరూపించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం అరకొరగా రూ.13,500 ఇస్తే, మన ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా 'అన్నదాత సుఖీభవ' కింద రూ. 20,000 అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రాత్రి వేళల్లో రైతుల కష్టాలు తీర్చేందుకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు, సాగునీటి కోసం కొత్తగా లక్షకు పైగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం," అని వివరించారు. అలాగే, రైతులపై పెట్టుబడి భారం పడకుండా ఆధునిక డ్రోన్లపై 80–90 శాతం భారీ సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తోందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. రైతులు ఈ నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి ఆర్థికంగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.



# చెత్త డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

## స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

కర్నూలు (చైతన్యరథం): కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. నగర శివార్లలోని గార్గేయపురం డంప్‌యార్డును కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి బుధవారం పరిశీలించారు. అక్కడ నిర్మిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పట్టాభిరామ్ సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా దశాబ్దాలుగా గార్గేయపురం, జొహరాపురం డంప్‌యార్డుల్లో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో పేరుకుపోయిన 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ ద్వారా రెమీడియేషన్ చేస్తున్నట్లు తెలిపారు. పాత వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడంతో పాటు భవిష్యత్తులో చెత్త డంపింగ్ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. చెత్త డంపింగ్‌కు శాశ్వత ముగింపు పలికి, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో గార్గేయపురం డంప్‌యార్డులో 15 ఎకరాల విస్తీర్ణంలో రూ.330 కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఆధునిక వ్యర్థాల నిర్వహణలో భాగంగా 9.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రతిరోజూ 200 మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసి, పునర్వినియోగానికి అనువుగా మార్చే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. కర్నూలు నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చేపడుతున్న ఈ ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని పట్టాభిరామ్ సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగం పెంచాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ డంప్‌యార్డుల్లో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల రెమీడియేషన్‌తో పాటు ఆధునిక వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే కర్నూలు నగరానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. నగరాన్ని స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య సాంకేతిక ఇంజనీరింగ్ ఈఈ గుర్రప్ప యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# నాడు టెన్త్ ఫెయిల్... నేడు దుబాయ్‌లో బిలియనీర్

## కష్టాల కడలి దాటి... గల్ఫ్ గడ్డపై గెలిచిన తోట రామ్‌కుమార్

### శూన్యం నుంచి రూ.680 కోట్ల వ్యాపార సామ్రాజ్యాధిపతిగా ఎదిగిన వైనం



**ఒక సాధారణ పల్లెటూరి కుర్రాడు దుబాయ్‌లో నవాబులా ఖరీదైన 'రోల్స్ రాయిస్' కారులో తిరగగలడా? బతుకుతెరువు కోసం అనేక తిప్పలు పడ్డవాడు రూ.680 కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి కాగలడా? గల్ఫ్ దేశంలో వేలాది మందికి ఆదర్శంగా నిలవగలడా? 'అవును... కృషి, పట్టుదల ఉంటే అసాధ్యం కూడా సాధ్యమే" అని నిరూపించారు తోట రామ్‌కుమార్ (తోట రాము). తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల (పాత కరీంనగర్) జిల్లా వేములవాడలో ఒక సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి మొదలైన ఆయన ప్రయాణం నేడు దుబాయ్ వ్యాపారవర్గాల్లో భారతదేశ కీర్తి పతాకను ఎగురవేసింది.**

#### పదో తరగతి ఫెయిల్ నుంచి... గల్ఫ్ విమానం దాకా!

1980ల కాలంలో కరీంనగర్ ప్రాంతంలో తీవ్ర కరువు, నిరుద్యోగం, అలజడుల వాతావరణం నెలకొంది. బతకాలంటే పొట్టచేతపట్టుకుని వేరే ప్రాంతానికి వెళ్లక తప్పని పరిస్థితి. అలాంటి క్లిష్ట సమయంలో వేములవాడకు చెందిన తోట నారాయణ-నర్సమ్మ దంపతుల కుమారుడు రామ్‌కుమార్ కేవలం పదో తరగతి సర్టిఫికెట్ (అదీ ఒకసారి ఫెయిల్ అయి గట్టెక్కినది), రెండు జతల బట్టలతో 1989లో దుబాయ్ విమానమెక్కారు.

దుబాయ్‌లో ఒక కంపెనీలో అకౌంట్స్ అసిస్టెంట్‌గా చేరిన రామ్‌కుమార్... స్నేహితుల మాటలతో విద్య ప్రాముఖ్యతను గుర్తించారు. కసితో దుబాయ్‌లోనే ఇంటర్ పూర్తి చేసి అనంతరం చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సు చదివారు. ఒకవైపు చదువుకుంటూనే సేల్స్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ప్రతిభను గుర్తించిన ప్రముఖ 'అదానీ గ్రూప్', పెట్రో కెమికల్ విభాగంలో సేల్స్ డైరెక్టర్‌గా పెద్ద కొలువు ఇచ్చింది. అక్కడ అదానీ గ్రూప్ అధికారి యోగేష్ మెహతా ప్రోత్సాహంతో కార్పొరేట్ రంగానికి చెందిన మెళకువలను క్షుణ్ణంగా నేర్చుకున్నారు.

#### దుబాయ్ నిర్మాణాత్మక రంగంలో 'ఎస్ఆర్ఆర్' జైత్రయాత్ర

2004లో సొంతంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన రామ్‌కుమార్, 2007లో వేములవాడ రాజరాజేశ్వరస్వామిపై ఉన్న భక్తితో 'శ్రీరాజరాజేశ్వర బిల్డింగ్ మెటీరియల్ ట్రేడింగ్' (SRR BMT) సంస్థను స్థాపించారు. తొలి ఏడాదే రూ.200 కోట్ల లావాదేవీలతో గల్ఫ్ దేశాల దృష్టిని ఆకర్షించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బుర్జ్ ఖలీఫా నిర్మాణానికి బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేసే అరుదైన అవకాశం ఎస్ఆర్ఆర్ సంస్థకే దక్కింది. మహమ్మద్ బిన్ రషీద్ సిటీ, అల్ మక్తూమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, దుబాయ్ మాల్, పామ్ జుమేరా, బిజినెస్ బే వంటి ల్యాండ్‌మార్క్ ప్రాజెక్టులకు బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేశారు. గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్ (GCC)లోని టాప్ బిల్డర్స్ కంపెనీల జాబితాలో ఎస్ఆర్ఆర్ 23వ స్థానం దక్కించుకుంది. ప్రస్తుతం దుబాయ్, ఒమన్ దేశాల్లో కలిపి ఏటా రూ.600 కోట్ల టర్నోవర్ సాధిస్తోంది. చైనాలోనూ రూ.200 కోట్ల టర్నోవర్ గల అల్యూమినియం ప్యానెల్ పరిశ్రమలో 40% వాటాతో వ్యాపారాన్ని విస్తరించారు.



**"చూడు బిడ్డా... బతుకుడంటే నువ్వొక్కడివే తినడం కాదు. నువ్వు బాగా బతకాలే, మరో పది మందిని బతికించాలే. అదీ బతుకంటే!"**
**- దుబాయ్ వెళ్తున్నప్పుడు తండ్రి చెప్పిన మాటలు**

**ఆ మాటలే రామ్‌కుమార్‌ను నిరంతరం నడిపించాయి. ప్రస్తుతం ఆయన కంపెనీలో 345 మంది ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారు. అందులో మన తెలుగు వారితో పాటు ఇతర దేశాల ప్రతినిధులు కూడా ఉన్నారు. 2008 ఆర్థిక మాంద్యం, 2016 మోసపూరిత చెక్కుల వల్ల కోట్లాది రూపాయల నష్టం వచ్చినా ధైర్యంతో తట్టుకుని నిలబడ్డారు తప్ప ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించలేదు.**

*ఇరుకైన గదిలో జీవితాన్ని ప్రారంభించి నేడు రెండు లక్షల చదరపు అడుగుల ఆఫీసును, దుబాయ్‌లో విలాసవంతమైన విల్లాను సొంతం చేసుకున్న తోట రామ్‌కుమార్ విజయం... గల్ఫ్ వెళ్లే ప్రతి ఒక్క తెలుగు యువకుడికీ ఒక ప్రేరణ.*

## సొంత ఊరిపై మమకారం... టీఆర్‌కే ట్రస్టు ద్వారా సేవలు

కన్న ఊరికి ఏం చేసినా తక్కువే. నాకు జీవితాన్ని ఇచ్చిన పల్లె అది. ఇప్పటిదాకా చేసిన సాయం వేరు. ఇకపై చేయాల్సింది వేరు. అందుకే సేవ ఆర్గనైజ్డ్‌గా ఉండాలని వేములవాడలో టీఆర్‌కే ట్రస్టు ప్రారంభించారు. బావ వుప్పుల దేవరాజు, మిత్రులు నాయిని శేఖర్, గోలి శ్రీనివాస్, బూర సదానందంలను ట్రస్టీలుగా నియమించారు. ట్రస్టు కోసం ఒక భవనాన్ని కూడా నిర్మించారు. వేములవాడ, పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత 12 ఏళ్లుగా దుబాయ్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. గల్ఫ్‌లో తెలుగు వారికి అందిస్తున్న సేవలకు దుబాయ్‌లో తెలంగాణ తరపున 'కాన్సులేట్ మెంబర్'గా గౌరవం దక్కించుకున్నారు.





---

### ప్రవాస తెలుగు బాలల కోసం

## అంతర్జాల సాహితీ సమ్మేళనం

**యూఎస్ఏ:** విదేశాల్లో నివసిస్తున్న 16 ఏళ్లలోపు ప్రవాస తెలుగు బాల బాలికల కోసం ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాతృభాషపై మమకారాన్ని, సాహితీ అభిరుచిని పెంచేందుకు ఈ నెల 26వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు "ప్రవాస బాలల అంతర్జాల సాహితీ సమ్మేళనం" నిర్వహించనున్నట్టు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనంలో చిన్నారులకు ఇష్టమైన వివిధ సాహితీ, సాంస్కృతిక అంశాల్లో ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

**పోటీలు-నిబంధనలు:**

పద్య పఠనం: రెండు నిమిషాల వ్యవధిలో రెండు తెలుగు పద్యాలు చదవాలి.

కవితా పఠనం: రెండు నిమిషాల వ్యవధిలో స్వీయ కవిత లేదా ఇతరుల కవితను చదవవచ్చు.

ఏకపాత్రాభినయం: రెండు నిమిషాల వ్యవధి ఉంటుంది.

పాట (గానం): మూడు నిమిషాల వ్యవధిలో తెలుగు లలిత గీతం లేదా శాస్త్రీయ సంగీతం ఆలపించాలి.

సంప్రదించాల్సిన వివరాలు:

ఈ పోటీలో నమోదు, ఇతర సమాచారం కోసం సమన్వయకర్తలు రాధిక మంగిపూడి (+91 9029409696), ఫణి మాధవ్ కస్తూరి (+91 9121906969)లను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

---

### సిలికానాంధ్ర మనబడి ఆధ్వర్యంలో ఘనంగా

## 'తెలుగుకు పరుగు'

**అమెరికా:** గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా సిలికానాంధ్ర మనబడి ఆధ్వర్యంలో అమెరికా అంతటా 'తెలుగుకు పరుగు' నిర్వహించారు. వల్లభాపురపు బాలాజీ, అల్లం శ్రీదేవి నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పడంతో పాటు 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సందేశాన్ని సమాజానికి అందించడమే ఈ పరుగు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొని తెలుగు భాషపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. తెలుగు భాషను భావితరాలకు అందించాలనే సంకల్పంతో భాషా సైనికులు, స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మనబడి 'తెలుగుకు పరుగు' నిర్దేశకుడు వల్లభాపురపు బాలాజీ మాట్లాడుతూ మనబడి నిర్వహిస్తున్న తెలుగు భాషా తరగతులు, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నమోదు వివరాలను వెల్లడించారు. తెలుగు భాషను నేర్పడం, నేర్చుకోవడం ప్రతి తెలుగు కుటుంబ బాధ్యత అని గుర్తు చేశారు. మనబడి అధ్యక్షుడు కులపతి చమర్తి రాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన వారందరికీ అభినందనలు తెలిపారు. 'భాషా సేవయే భావితరాల సేవ' అనే నినాదాన్ని గుర్తు చేస్తూ ఇప్పటి వరకు లక్షా 10వేల మందికి పైగా విద్యార్థులు మనబడి ద్వారా విద్య పూర్తి చేసుకున్నారని చెప్పారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల రెండో వారంలో పది దేశాల్లోని దాదాపు 300 కేంద్రాల్లో తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 12,500 మంది పిల్లలు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఉత్తర అమెరికాలో మనబడికి పాశ్చాత్య పాఠశాలలు, కళాశాలల సంఘం గుర్తింపుతో పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. 'రన్ ఫర్ తెలుగు' పోటీలను రెండు విభాగాల్లో నిర్వహించారు. ప్రతి ప్రాంతంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలను మనబడి పతకాలతో సత్కరించారు. పాల్గొన్న వారందరికీ ధ్రువపత్రాలు అందజేసి ఆయా ప్రాంతాల్లో అల్పాహారం ఏర్పాటు చేశారు. అమెరికాలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి వేలాది మందిని భాగస్వాములను చేస్తూ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది. తెలుగు భాషపై ప్రేమ, ఆరోగ్యంపై అవగాహనను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ కార్యక్రమం తెలుగు భాషా దినోత్సవ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.



# ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల బీభత్సం

**12 మంది మృతి, విరిగిపడిన కొండచరియలు, కూలుతున్న ఇళ్లు, ఉప్పొంగుతున్న నదులు, జనజీవనం అస్తవ్యస్తం**



ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, ఇళ్లు కూలిపోవడం, నదులు ఉప్పొంగడంతో జనజీవనం అస్తవ్యస్తమయింది. రాష్ట్రంలో మంగళవారం ఒక్కరోజే వర్ష సంబంధిత ఘటనల్లో 12 మంది మృతి చెందినట్లు స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ వెల్లడించాయి. భారీ వర్షాల నేపథ్యంలో భారత వాతావరణ శాఖ బుధవారం డెహ్రాడూన్, నైనిటాల్, బాగేశ్వర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కూడా పడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. అల్మోరాలోని ఒడ్యాదా గ్రామంలో తెల్లవారుజామున ఓ ఇంటి గోడ కూలడంతో ముగ్గురు మృతి చెందారు. మరో ఘటనలో అల్మోరా పట్టణంలోని ధార్కితుని ప్రాంతంలో పాత ఇంటి గోడ కూలి ఇద్దరు నేపాలీ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. డెహ్రాడూన్‌లోని కండోలీ బ్రిడ్జి సమీపంలో భారీగా ప్రవహించిన నీటిలో ఓ కారు కొట్టుకుపోయింది. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరో మహిళను రక్షించారు.



# అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా

అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. ఈ మేరకు జన్మభూమి ట్రస్ట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. 5,585 దరఖాస్తులను పరిశీలించిన కమిటీ.. 39 ఏళ్లపాటు ఎయిర్‌ఫోర్స్‌లో సేవలందించిన జితేంద్ర మిశ్రాను ఆలయ ట్రస్ట్ సీఈఓగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. భారత వైమానిక దళానికి సంబంధించిన ఎన్నో ఆపరేషన్లలో కీలకంగా పని చేసిన మిశ్రా.. గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్ట్రన్ కమాండర్‌గా సేవలందించారు. 2026 ఏప్రిల్లో ఆయన ఎయిర్‌ఫోర్స్ కమాండర్‌గా రిటైరైయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో తన కృషికి గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సర్వోత్తమ యుద్ధ సేవ మెడల్‌ను కూడా అందుకున్నారు.

### ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులు

రామాలయ ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులను కూడా కమిటీ నియమించింది. మదన్ మోహన్ పాండే, మహేశ్ భగచంద్కా, నిర్మలా యాదవ్‌లను సభ్యులుగా ఎంపిక చేసింది. కొన్ని నెలల క్రితం అయోధ్య రామాలయ విరాళాల్లో దుర్వినియోగం జరిగిన విషయం తెలిసిందే. అందుకే ట్రస్ట్ ప్రక్షాళన దిశగా ఈ మేరకు మార్పులు అనివార్యమయ్యాయి. రాములోరి నిధులు కాజేసిన కేసులో ఎనిమిది మంది ఇప్పటికే అరెస్టయ్యారు. దీంతో అప్పటి జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ వ్యవహారంతో ఒక్కసారిగా దేశంలో దుమారం రేగిన సంగతి తెలిసిందే.

# ‘జీవితం పరుగుపందెం కాదు’

**అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ**



ఐఐటీ గువాహటి 33వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు. ‘జీవితం పరుగుపందెం కాదు.. మీరు అందరికంటే వేగంగా ముందుకు వెళ్లకపోయినా పర్వాలేదు. దానివల్ల మీరు వెనుకబడినట్లు భావించాల్సిన అవసరం లేదు’ అని సీఎం హిమంత బిశ్వ శర్మ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ గువాహటి కేవలం విద్యలో ప్రతిభ చూపించే సంస్థ కాదని.. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. ఐఐటీ గువాహటి విద్యార్థుల కోసం అస్సాం ప్రభుత్వం 100 స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను కోరారు. అస్సాం ఎదుర్కొనే సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో ఐఐటీ గువాహటి కీలక పాత్ర పోషిస్తుందని హిమంత బిశ్వ శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రముఖ ఆలయాల్లో సెల్‌ఫోన్లపై నిషేధం

తమిళనాడులోని దేవాలయాల్లో రీల్స్ చిత్రీకరించే యువతకు బుద్ధి చెప్పేందుకు విజయ్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 52 ప్రధాన దేవాలయాలలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై టీవీకే ప్రభుత్వం పూర్తి స్థాయి నిషేధాన్ని విధించింది. కొత్త నిబంధనలు ఈ నెల ఒకటో తేదీ నుంచే అమలులోకి వచ్చాయి. మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ మంత్రి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. ‘ఆలయాలలో కొంతమంది భక్తులు, ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల కోసం రీల్స్ చేస్తున్నారు. అలా వీడియోలు తీయడం వల్ల ఆలయ పవిత్రత దెబ్బతింటోంది. ఇతర భక్తుల ప్రశాంతతకు భంగం కలుగుతోంది. అందుకే ఈ చర్యలు చేపట్టాము’ అని తెలిపారు. భక్తులు తమ స్మార్ట్‌ఫోన్లను ఆలయ ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్రపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం ఫోన్‌కు 5 రూపాయల చొప్పున డిపాజిట్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కెమెరాలేని కీప్యాడ్ మొబైల్ ఫోన్లను ఆలయంలోనికి తీసుకెళ్లడానికి అనుమతి ఉంది.



# నా కూతురు ఆత్మహత్య చేసుకోలేదు

**సామూహింగా హత్యాచారం జరిపి చంపేశారు : దిశ తండ్రి ఆమె తండ్రి సతీష్ సాలియన్ ఆరోపణ**





బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, ఆయన మాజీ మేనేజర్ దిశా సాలియన్ మరణాల మధ్య బలమైన సంబంధం ఉందనే వాదనలు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. దిశా సాలియన్ మరణంపై ముంబై పోలీసులు తేల్చిన ఆత్మహత్య కోణాన్ని తోసిపుచ్చుతూ, కేసులో దాగిన నిజాలు బయటకు రావాలని ఆమె తండ్రి సతీష్ సాలియన్ అన్నారు. దిశా మరణం గురించి ఆయన వేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును కేంద్రీయ దర్యాప్తు సంస్థ(జదీ×) విచారించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.బాంబే హైకోర్టు తన కుమార్తె మరణంపై సీబీఐ విచారణకు ఆదేశించిన తర్వాత, దిశా తండ్రి సతీష్ సాలియన్ మీడియాతో మాట్లాడుతూ, ‘నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణానికి, అతని మాజీ మేనేజర్ దిశా సాలియన్ మరణానికి కచ్చితంగా సంబంధం ఉంది’ అని పేర్కొన్నారు. నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ తన బాంద్రా ఫ్లాట్‌లో మరణించడానికి కొన్ని రోజుల ముందు.. 2020 జూన్ 8న ముంబైలోని మలాడ్ ప్రాంతంలో ఒక నివాస భవనం 14వ అంతస్తు నుంచి పడిపోయిన దిశా సాలియన్ మృతదేహం లభించింది. ‘సుశాంత్ చేసిన తప్పులకు సంబంధించిన ఓ వీడియోను దిశా పంపింది. దానికి ఈ మరణంతో సంబంధం ఉంది’ అని సాలియన్ పేర్కొన్నారు. ‘నేను ఇంతకంటే ఎక్కువ చెప్పను. నిజం బయటకు రావాలి, బాధ్యులు తగిన మూల్యం చెల్లించుకోవాలి’ అని ఆయన అన్నారు. సీబీఐ విచారణకు కోర్టు ఆదేశించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, సతీష్ సాలియన్ తన కుమార్తె మరణం ఆత్మహత్య కాదని, అది కొందరు పలుకుబడి ఉన్న వ్యక్తుల కుట్ర అని అన్నారు. ‘అది ఆత్మహత్య కాదు. నేను 100 శాతం కచ్చితంగా ఉన్నాను. ఇందులో కొందరు పలుకుబడి ఉన్న వ్యక్తుల కుట్ర ఉంది. సీబీఐ ప్రతి ఒక్కరినీ విచారిస్తుందని నాకు నమ్మకం ఉంది’ అని ఆయన అన్నారు. దిశా సాలియన్ మరణం వెనుక ఉన్న నిజం బయటకు వస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు. కాగా.. 2020 జూన్ 8న ముంబైలోని మలాడ్ ప్రాంతంలో ఉన్న 14వ అంతస్తు భవనం నుంచి పడి దిశా సాలియన్ మరణించగా, సరిగ్గా ఆరు రోజుల తర్వాత (జూన్ 14, 2020న) సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ తన బాంద్రా ఇంట్లో శవమై కనిపించారు. ఈ రెండు మరణాల మధ్య లింక్ ఉందని సతీష్ సాలియన్ చెబుతున్నారు. సుశాంత్‌కు సంబంధించిన ఓ వీడియోను దిశా పంపిందని, ఈ అంశమే మరణాలకు కారణమై ఉండవచ్చని ఆయన ఆరోపించారు. తన కుమార్తెది ఆత్మహత్య కాదని, ఆమెను సామూహికంగా హత్యాచారం చేశారని సతీష్ సాలియన్ ఆరోపించారు. పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, అధికారులకు ఇందులో ప్రమేయం ఉందని, దీనిని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు.

# మళ్లీ ముంచెత్తుతున్న నేపాల్..

- మూడు నదులు డేంజర్ మార్క్ దాటిన వైనం
- సున్‌కోషి, బుధిగండకి, మహాకాళిలో ప్రమాదకరంగా నీటిమట్టాలు
- నేపాల్‌లో 1,127 మంది మృతి.. 4,858 మంది గల్లంతు
- 6,541 మందిని రక్షించిన భద్రతా సిబ్బంది
- నిరంతర వర్షాలతో సహాయక చర్యలకు ఆటంకం



భారీ వరదల విలయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న నేపాల్‌ను మరోసారి వరద ముప్పు వెంటాడుతోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రధాన నదుల్లో నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. సున్‌కోషి, బుధిగండకి, మహాకాళి నదుల్లో నీటి మట్టాలు ప్రమాదకర స్థాయిని దాటడంతో అధికారులు పలు ప్రాంతాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే వరదలు, కొండచరియలు విరిగిపడటం, హిమనద–శిలా విరిగిపడటంవంటి విపత్తులతో అతలాకుతలమైన ప్రాంతాల్లో మళ్లీ వర్షాలు మొదలవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు సహాయక, గాలింపు చర్యలు కొనసాగుతున్నప్పటికీ ప్రతికూల వాతావరణం వాటికి తీవ్ర ఆటంకంగా మారుతోంది. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం నాటికి సున్‌కోషి, బుధిగండకి, మహాకాళి నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లోని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. లామ్జుంగ్ జిల్లాలోని మార్ష్యాంగ్డి నదిలోనూ మంగళవారం అర్ధరాత్రి నీటిమట్టం ప్రమాదకరస్థాయిని దాటినట్టు అధికారులు తెలిపారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, నదులు, వాగులు, కొండ ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు.

**వరదలనుంచి కోలుకోకముందే మరో ముప్పు**

ఆగస్టు 26న నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన మంచు, రాళ్ల విరిగిపడటం కారణంగా భారీగా నీరు ఒక్కసారిగా దిగువ ప్రాంతాలకు దూసుకురావడంతో ఈ విపత్తు సంభవించింది. బోటేకోశి సహా పలు నదులు ఉగ్రరూపం దాల్చడంతో గ్రామాలు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ కేంద్రాలు, సరిహద్దు వాణిజ్య మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలు ఈ సహాయక చర్యలకు మరింత సవాలుగా మారాయి. కొండ ప్రాంతాల్లో నేల అస్థిరంగా ఉండటం, రహదారులు కొట్టుకుపోవడం, మట్టిపెళ్లలు విరిగిపడటం, నదుల్లో నీటి ప్రవాహం పెరగడం వంటి కారణాలతో కొన్ని ప్రాంతాలకు చేరుకోవడమే కష్టంగా మారింది. దీంతో గాలింపు బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.

**1,127కు చేరిన మృతుల సంఖ్య**

తాజా అధికారిక వివరాల ప్రకారం నేపాల్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య 1,127కు చేరింది. వివిధ జిల్లాల్లో నదులు, వరద ప్రవాహాల్లో కొట్టుకుపోయిన మృతదేహాలను భద్రతా బలగాలు, సహాయక బృందాలు వెలికితీస్తున్నాయి. బుధవారం ఉదయం వరకు రసువాలో 45, నువాకోట్‌లో 155, ధాదింగ్‌లో 59, చిత్వన్‌లో 348, గోర్ఖాలో 66, తనహున్‌లో 38, నావల్పరాసి ఈస్ట్‌లో 217, నావల్పరాసి వెస్ట్‌లో 190 మృతదేహాలను గుర్తించినట్టు నేపాల్ పోలీసులు వెల్లడించారు. భారతదేశంలోని నదుల్లోనూ తొమ్మిది మృతదేహాలు లభించాయి.

ఇప్పటి వరకు 1,113 మృతదేహాలకు పోస్టుమార్టం, చట్టపరమైన గుర్తింపు ప్రక్రియలు పూర్తయ్యాయి. 95 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. మరోవైపు గుర్తింపు లభించని 911 మృతదేహాల వివరాలను నేపాల్ పోలీస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ వివరాలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు.

**4,858 మంది గల్లంతు.. 6,541 మంది రక్షణ**

విపత్తు జరిగిన వారం రోజులైనా గల్లంతైన వారి సంఖ్య భారీగానే ఉంది. ఇప్పటి వరకు 4,858 మంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు వెల్లడించారు. భద్రతా బలగాలు, సహాయక సిబ్బంది ఇప్పటివరకు 6,541 మందిని రక్షించారు. గాలింపు, సహాయక చర్యల్లో 7,912 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు, శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం గాలిస్తున్నారు.

**తగ్గని వరద భయం**

ఒకవైపు మృతుల సంఖ్య పెరుగుతుండగా.. మరోవైపు వేలాది మంది ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో మరోసారి ప్రధాన నదుల్లో నీటిమట్టాలు ప్రమాదకర స్థాయికి చేరడం నేపాల్ ప్రభుత్వాన్ని మరింత అప్రమత్తం చేసింది. నిరంతర వర్షాలు కొనసాగితే ఇప్పటికే దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేపాల్‌లో తాజా పరిస్థితి ఒక విపత్తు ముగియకముందే మరో ముప్పు ఎదురవుతున్న దృశ్యాన్ని తలపిస్తోంది. ప్రాణనష్టం, గల్లంతైన వారి ఆచూకీ, ధ్వంసమైన మౌలిక వసతుల పునరుద్ధరణతో పాటు ఇప్పుడు కొత్తగా పెరుగుతున్న వరద ముప్పును ఎదుర్కోవడం నేపాల్ ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారింది.

## భారత్‌కు కృతజ్ఞతలు!

**ఆపన్నహస్తంపై నేపాల్ ప్రధాని బాలెన్ షా**



ప్రకృతి విపత్తుతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ అందించిన అపన్నహస్తంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. వరదలు సంభవించిన తొలి రోజే భారత్ స్పందించి సహాయ సామగ్రిని పంపిందని పార్లమెంటులో కొనియాడారు. మందులు, ఆహార పదార్థాలు, నీటిని శుద్ధి చేసే పరికరాలతోపాటు నిపుణులైన సహాయక బృందాన్ని పంపిందని వెల్లడించారు. నష్టం తీవ్రతను అంచనా వేసేందుకు పరిశీలనలు కూడా నిర్వహించారని చెప్పారు. భారత సాంకేతిక బృందాలు మారుమూల ప్రాంతాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయని వివరించారు. సంక్షోభ సమయంలో భారత్ నిజమైన మిత్రదేశంగా.. అండగా నిలిచిందని ప్రశంసించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటివరకు 11,993 మందిని రక్షించినట్టు షా తెలిపారు. మరో 3,916 మంది గల్లంతయ్యారని పేర్కొన్నారు. మంత్రులంతా తమ నెల జీతాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో రూ.కోటి అత్యవసర నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఈ విపత్తు రసువా, నువాకోట్, ధాదింగ్ ప్రాంతాలకే పరిమితం కాదని.. దేశం మొత్తానికీ తీరని దెబ్బ అని షా పేర్కొన్నారు. ఈ సంక్షోభాన్ని "ధైర్యం, సంకల్పంతో ఎదుర్కోవడం తప్ప.. మాకు మరో మార్గం లేదు" అని వ్యాఖ్యానించారు. విపత్తు అనంతరం భారత్ నేపాల్‌లో భారీస్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. రెస్క్యూ బృందాలు, వైద్య నిపుణులు, డీఎన్‌ఏ ఆధారిత గుర్తింపు కోసం ఫోరెన్సిక్ నిపుణులను పంపింది. నేపాల్, చైనా అధికారులతో సమన్వయం కోసం విదేశాంగ శాఖలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

# 286 రోజుల తర్వాత నేలపై అడుగు

- పట్టాయాలో అమెరికా నావికుల కోసం నిఘా
- 'అబ్రహాం లింకన్'లో 5 వేల మంది..
- నైట్‌లైఫ్ ప్రాంతాల్లో పోలీసుల పెట్రోలింగ్
- వియత్నాం యుద్ధంనుంచి అమెరికా సైనికులతో పట్టాయాకు ప్రత్యేక అనుబంధం



పశ్చిమాసియా ఉద్రిక్తతలు మొదలైన దగ్గరి నుంచి అక్కడి సముద్ర జలాల్లో మోహరించి ఉన్న అమెరికా విమాన వాహకనౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ ఇప్పుడు తిరుగుపయనమైంది. అందులో 5000 మందివరకు యూఎస్ నావికులు, మెరైనర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 200 రోజులకు పైగా వారు జలాల్లోనే ఉండటంతో కనీస సదుపాయాలు లేక తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కొందరు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్టూ ఇటీవల కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం ఆ నౌక థాయిలాండ్‌లోని పట్టాయాకు చేరనుంది. ఇలాంటి సమయంలో నగరంలోని సెక్స్ వర్కర్లను లక్ష్యంగా చేసుకుని అక్కడి పోలీసులు దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. థాయ్ రాజధాని బ్యాంకాక్‌కు 150 కిలోమీటర్ల దూరంలో పట్టాయా నగరం ఉంటుంది. ఈ సిటీ నైట్ లైఫ్, బీచ్‌లకు ఫేమస్. ఇప్పుడు దానికి కొన్ని కిలోమీటర్ల దూరంలోని లీమ్ చాబాంగ్ పోర్టు వద్ద యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ లంగరు వేయనుంది. ఇంతకాలం గల జలాల్లో విధులు నిర్వర్తించడం ఆ నౌక చరిత్రలో ఇదే తొలిసారి. ఇప్పుడు అది వెనక్కి వచ్చిన తర్వాత నావికులు, మెరైనర్లు విశ్రాంతి తీసుకోవడానికి సమయం ఇవ్వనున్నారు. దీంతో ఈ నగరంలో వ్యభిచార కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే బీచ్‌ల సమీపంలో, నైట్ లైఫ్ ఏరియాల్లో పెట్రోలింగ్‌ను పెంచారు. గత వారాంతంలో జరిపిన సోదాల్లో దాదాపు 50మంది అనుమానిత సెక్స్ వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే, నౌక వచ్చిన తర్వాత ఇక్కడి పరిస్థితి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉంటుందని చెప్పడం కష్టమని పోలీసులు వెల్లడించారు.

ఇలాంటి నౌకల రాకతో ఇదొక ప్రతికూల అంశమే అయినా.. ఆర్థికంగా పట్టాయాకు కలిసొస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఆ నగరం ప్రధానంగా పర్యాటకం, వినోదరంగంపైనే ఆధారపడింది. అలాగే హోటళ్లు, రెస్టారంట్లు, బార్లు, దుకాణాలు, ఇతర వ్యాపారాలు మరింత లాభసాటిగా మారతాయని వ్యాపారవర్గాలు భావిస్తున్నాయి. వ్యభిచారం థాయిలాండ్‌లో చట్టవిరుద్ధం. కానీ పట్టాయా, బ్యాంకాక్ సహా పలు పర్యాటక ప్రాంతాల్లో అది విరివిగా కనిపిస్తుంటుంది.

ఒకప్పుడు మత్స్యకారుల గ్రామంగా ఉన్న పట్టాయా.. ఇప్పుడు వినోద కేంద్రంగా మారింది. అందుకు వియత్నాం యుద్ధమే కారణం. నాడు థాయిలాండ్‌లో మోహరించిన అమెరికా సైనికులు.. విశ్రాంతి, వినోదం కోసం పట్టాయాకు వచ్చేవారు. కాలక్రమంలో అదొక పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందింది. ఇదిలాఉంటే.. ఫిబ్రవరి నెలలో అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ప్రారంభమైన యుద్ధం ఇంకా కొనసాగుతోంది. మామూలుగా పసిఫిక్ మహాసముద్ర జలాల్లో ఉండే శాన్డియాగో పోర్ట్ వద్ద అబ్రహాం లింకన్‌ను మోహరించి ఉంచుతారు. కానీ పశ్చిమాసియా ఉద్రిక్తతలకు కొన్ని వారాల ముందు అది గల్ఫ్ జలాల్లోకి ప్రవేశించింది. నాటినుంచి అక్కడే విధుల్లో ఉన్న ఈ నౌక.. ఇటీవలే గల్ఫ్ జలాలను

# తొందరెందుకు? టైముందిగా!

- చెన్నై సూపర్ కింగ్స్ కొత్త కోచ్‌పై రుతురాజ్ స్పష్టత..
- కెప్టెన్సీ బాధ్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు..
- టీమిండియాలో పునరాగమనంపై ధీమా



చెన్నై సూపర్ కింగ్స్‌తో సుదీర్ఘ అనుబంధానికి స్టీఫెన్ ఫ్లెమింగ్ వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. 2008లో ఆటగాడిగా సీఎస్కేలో అడుగుపెట్టిన ఫ్లెమింగ్.. 2009 నుంచి ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. దాదాపు 18 ఏళ్లపాటు సాగిన ఈ అనుబంధంలో సీఎస్కే ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు ఛాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు సాధించింది. 2026 సీజన్ అనంతరం ఫ్లెమింగ్, సీఎస్కే పరస్పర అంగీకారంతో విడిపోయాయి. దీంతో తదుపరి సీజన్‌కు కొత్త ప్రధాన కోచ్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ఫ్లెమింగ్ స్థానాన్ని భర్తీ చేసే విషయంలో సీఎస్కే యాజమాన్యం ఎలాంటి తొందరపాటుకు వెళ్లడం లేదని కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్పష్టం చేశాడు. రాబోయే ఐపీఎల్‌కు ఇంకా చాలా సమయం ఉందని, మినీ వేలానికి కూడా గడువు ఉందని చెప్పాడు.

### తప్పకుండా వస్తారు..

"చెన్నై సూపర్ కింగ్స్‌కు తప్పకుండా ప్రధాన కోచ్ ఉంటారు. మేనేజ్‌మెంట్ కూడా ఆ దిశగా ఆలోచనలు చేస్తూనే ఉంది. రాబోయే ఐపీఎల్‌కు ఇంకా చాలా సమయం ఉంది. మినీ వేలానికి కూడా గడువు ఉంది. ఇలాంటప్పుడు తొందరపడాల్సిన అవసరం లేదు. సరైన వ్యక్తిని ఎంపిక చేసేందుకు మాకు సమయం ఉంది" అని రుతురాజ్ అన్నాడు. ఫ్లెమింగ్ నిష్క్రమణతో సీఎస్కే ఒక కీలకమైన మార్పు దశలోకి అడుగుపెట్టింది. దాదాపు రెండు దశాబ్దాలుగా జట్టు వ్యవస్థను, ఆటగాళ్ల ఎంపికను, వ్యూహాలను నడిపించిన కోచ్ స్థానంలో ఎవరిని తీసుకురావాలన్నది యాజమాన్యానికి కీలక నిర్ణయమే. అందుకే అందుబాటులో ఉన్న సమయాన్ని ఉపయోగించుకుని సరైన ఎంపిక చేయాలన్నదే సీఎస్కే ఆలోచనగా కనిపిస్తోంది. ఫ్లెమింగ్ వారసుడి కోసం పలువురి పేర్లు చర్చకు వచ్చినప్పటికీ, అధికారికంగా కొత్త కోచ్‌ను ప్రకటించలేదు.

### సవాళ్లను ఆస్వాదిస్తా..

ఎంఎస్ ధోని నుంచి సీఎస్కే కెప్టెన్సీ బాధ్యతలు అందుకోవడం తనకు ఒక పెద్ద సవాలేనని రుతురాజ్ చెప్పాడు. "ఎంఎస్ ధోని నుంచి జట్టు పగ్గాలను అందుకున్నప్పుడు కాస్త సంకోచించా. ఎందుకంటే చాలా బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగానే ఉన్నా. మేం ఐదుసార్లు విజేతగా నిలిచాం. మా జట్టుపై భారీ అంచనాలుంటాయి. అయితే, వీలైనంత వరకూ ఆటను ఆస్వాదిస్తూనే ఉంటా. 2008 నుంచి ప్రతి సీజన్‌లోనూ మేం ఐపీఎల్ ఫేవరెట్లుగానే బరిలోకి దిగాం. మాకు ఎల్లవేళలా మద్దతిస్తూ అభిమానులు అండగా నిలిచారు" అని రుతురాజ్ పేర్కొన్నాడు.

ధోని నుంచి కెప్టెన్సీని స్వీకరించడం సాధారణ విషయం కాదని, సీఎస్కేలాంటి భారీ అంచనాలున్న జట్టుకు సారథ్యం వహించడం మరింత బాధ్యతతో కూడుకున్నదని రుతురాజ్ వ్యాఖ్యానించాడు. అయితే, ఆ ఒత్తిడిని భారంగా కాకుండా సవాలుగా స్వీకరిస్తానన్న అతడి మాటలు కెప్టెన్‌గా అతడి ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తున్నాయి. 2026 సీజన్‌లో సీఎస్కే ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, భవిష్యత్తుపై రుతురాజ్ నమ్మకంతో ఉన్నాడు. తదుపరి సీజన్‌లో జట్టు పునరాగమనం చేస్తుందని కూడా అతడు ధీమా వ్యక్తం చేశాడు.

### సన్నద్ధతపైనే ఫోకస్..

సీఎస్కే బాధ్యతలతో పాటు టీమిండియాలో పునరాగమనంపైనా రుతురాజ్ మాట్లాడాడు. "ఏడాది పొడవునా పరుగులు చేస్తుంటే.. కచ్చితంగా పిలుపు వస్తుంది. నేను ఆ దిశగానే సాగుతున్నా. తప్పకుండా నాకు అవకాశం వస్తుందనే నమ్మకం ఉంది. అఫ్గానిస్థాన్ సిరీస్‌కు ఎంపిక కాలేకపోయినందుకు బాధేమీ లేదు. అయితే, జట్టుతోపాటు లేనప్పుడు సన్నద్ధతపైనే దృష్టి పెడతా. దేశవాళీలో నైపుణ్యాలకు పదును పెట్టుకుంటా. ఎప్పుడు ఛాన్స్ వచ్చినా ఆడేందుకు సిద్ధం" అని రుతురాజ్ వెల్లడించాడు.

ఇలా ఒకవైపు సీఎస్కేకు కొత్త కోచ్ ఎంపిక కోసం సమయం ఉందంటూ యాజమాన్యానికి భరోసా ఇస్తూనే.. మరోవైపు తన బ్యాటింగ్‌పై పూర్తిగా దృష్టి పెట్టి టీమిండియాలో పునరాగమనానికి సిద్ధమవుతున్నాడు రుతురాజ్. కెప్టెన్‌గా కొత్త సవాళ్లు.. బ్యాటర్‌గా జాతీయ జట్టులో చోటు కోసం పోటీ.. ఈ రెండింటినీ సమర్థంగా ఎదుర్కోవడమే అతడి ముందున్న లక్ష్యం. "తొందరెందుకు.. టైముందిగా" అన్న రుతురాజ్ మాటలు ప్రస్తుతం సీఎస్కే కొత్త కోచ్ ఎంపికకే కాదు.. తన అంతర్జాతీయ పునరాగమనంపై అతడి ఆలోచనా విధానానికీ అద్దం పడుతున్నాయి.

## అదరగొట్టిన తిలక్‌వర్మ

### దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సౌత్‌జోన్

బెంగళూరు: దులీప్ ట్రోఫీలో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన రెండో సెమీ ఫైనల్లో సౌత్ జోన్.. 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



రెండో ఇన్నింగ్స్‌లో 256/7 స్కోరుతో బుధవారం ఆటను కొనసాగించిన నార్త్ జోన్.. 297 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో 181పరుగుల లక్ష్యాన్ని సౌత్ జోన్ 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు రికీ భుయ్ (42; 53 బంతుల్లో), నారాయణ్ జగదీశన్(43; 83 బంతుల్లో) శుభారంభం అందించగా.. కెప్టెన్ తిలక్ వర్మ (51బి; 79 బంతుల్లో), రవిచంద్రన్ స్మరన్ (32బి; 42 బంతుల్లో) మిగతా పని పూర్తి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ 195పరుగులకే ఆలౌటైంది. తిలక్ వర్మ (116 నాటౌట్; 250 బంతుల్లో 9x4) శతకంతో మెరవడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 312 పరుగులు చేసింది. ఈ రెండు ఇన్నింగ్స్‌లోనూ అదరగొట్టిన తిలక్‌వర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. సెప్టెంబరు 6నుంచి చెపాక్ స్టేడియంలో దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ మొదలుకానుంది. తుదిపోరులో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది.

## మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం

### వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మ్యాచ్‌లు

ఐసీసీ మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు టోర్నమెంట్ జరగనుంది. మ్యాచ్‌లు క్రికెట్ క్లబ్‌ఆఫ్ ఇండియా(ముంబయి), వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. కటాఫ్ డేట్‌అయిన జులై 6నాటికి మహిళల టీ20 ర్యాకింగ్స్‌లో తొలి ఆరుస్థానాల్లో ఉన్న జట్లు ఇందులో పోటీపడనున్నాయి. ఈలెక్కన ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్,భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక టోర్నమెంట్‌కు అర్హత




సాధించాయి. ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్న పాకిస్థాన్ ఈ టోర్నమెంట్‌కు దూరమైంది. టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టాప్-2లో నిలిచిన టీములు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు అర్హతసాధిస్తాయి. వాస్తవానికి, ఈ టోర్నీ శ్రీలంకలో జరగాల్సి ఉండగా.. శ్రీలంక క్రికెట్ బోర్డు పరిపాలన వ్యవహారాల్లో ఆదేశ ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందన్న కారణంగా ఆతిథ్య హక్కులను కోల్పోయింది. టోర్నమెంట్ నిర్వహణకు బంగ్లాదేశ్, భారత్, దక్షిణాఫ్రికాలను ఆప్షన్లుగా పెట్టుకున్న ఐసీసీ చివరకు ప్రత్యామ్నాయ ఆతిథ్య దేశంగా భారత్‌ను సిఫార్సు చేసింది. ఈ నిర్ణయాన్ని సెప్టెంబర్ 2న ఐసీసీ బోర్డు ఆమోదించింది.

## సీఎం సార్.. మీతో ఒక్క ఫొటో

### కేరళంలో క్రిస్టియానో రొనాల్డో సోదరి

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సోదరి ఎల్మా అవీరో కేరళంలో పర్యటించారు. ఈ క్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సతీశన్‌ను కలిశారు. దీనికి సంబంధించిన వీడియోను సీఎం తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రొనాల్డోకు కేరళంలో భారీగా అభిమానులున్నారని ఎల్మాతో సతీశన్ చెప్పారు. తాను కూడా అభిమానినేని పేర్కొన్నారు. అనంతరం ఇక్కడి ప్రేమ, అభిమానాలను రొనాల్డోకు చెబుతానని ఎల్మా తెలిపారు. ఈ సందర్భంగా సీఎం సతీశన్‌తో ఫొటో కావాలని ఎల్మా అడగడం గమనార్హం. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## 'అందుకే.. లండన్‌లో స్థిరపడ్డారు'



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి తన కుటుంబంతో కలిసి కొన్నాళ్లుగా లండన్‌లో నివాసం ఉంటున్న సంగతి తెలిసిందే. టీమ్ ఇండియా మ్యాచ్‌లు ఉన్నప్పుడు, ఐపీఎల్ సీజన్ సమయంలో మాత్రమే అతడు భారత్‌కు వస్తున్నాడు. దీంతో కోహ్లి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్‌కు గురయ్యాడు. అయితే, విరాట్ భారత్‌ను వీడి లండన్‌లో నివసించడానికి గల కారణాన్ని బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్ భర్త డా. శ్రీరామ్ నేనే బయటపెట్టారు. లండన్‌కు వెళ్లడానికి ముందు అనుష్క శర్మతో జరిపిన ఆసక్తికర సంభాషణను శ్రీరామ్ యూట్యూబర్ రణవీర్ అల్లాబాడియాతో జరిగిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. తమకున్న స్టార్ డమ్ కారణంగా భారత్‌లో కోహ్లి-అనుష్క సాధారణ జీవితాన్ని గడపలేకపోతున్నారని, అందుకే లండన్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారని తెలిపారు.

పబ్లిక్ అటెన్షన్‌కు దూరంగా ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కోహ్లి దంపతులు తమ పిల్లలు వామికా, అకాయను మీడియా దృష్టికి దూరంగా ఉంచి సాధారణంగా పెంచాలనుకుంటున్నారని తెలిపారు. మరోవైపు, టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన కోహ్లి.. వన్డే మ్యాచ్లు, ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో భారత్‌కు వస్తున్నాడు. ఇక, 2018లో విడుదలైన 'జీరో' చిత్రం తర్వాత అనుష్క శర్మ నటనకు దాదాపు దూరంగా ఉన్నారు. తర్వాత ఆమె 'చక్దా ఎక్స్‌ప్రెస్'లో నటించారు. ఇందులో అనుష్క మాజీ భారత క్రికెటర్ ఝులన్ గోస్వామి పాత్రను పోషించారు. అయితే, ఈ సినిమా ఇంకా విడుదల కాలేదు. ఆమె 2022లో తన నిర్మాణ సంస్థ 'క్లీన్ స్లేట్ ఫిల్మ్స్' బాధ్యతలనుంచి వైదొలిగి కుటుంబ బాధ్యతలు చూసుకుంటోంది.

## ఉన్నతి ఔట్

షెన్‌జెన్ (చైనా): భారత యువ షట్లర్ ఉన్నతి హుడా చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టింది. మంగళవారం నుంచి మొదలైన టోర్నీ మహిళల సింగిల్స్ బరిలో నిలిచిన ఉన్నతి.. 10-21, 18-21తో కిమ్ గా యున్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్-అర్జున్ జోడీ.. చెన్ బొ యాంగ్-లియు యి (చైనా) ద్వయంతో తలపడుతూ తొలి గేమ్ (8-11)లో వెనుకబడి ఉండగా గాయంతో మ్యాచ్‌నుంచి తప్పుకున్నారు.



# పవన్ ప్రేమంతా ప్రజలకే..: చిరంజీవి

తనను గెలిపించిన పిఠాపురం ప్రజలకు ప్రజాప్రతినిధిగా కాకుండా, కుటుంబ సభ్యుడిలా పవన్ కల్యాణ్ అండగా నిలుస్తున్నాడని చిరంజీవి వ్యాఖ్యానించారు. పవన్ పుట్టినరోజు సందర్భంగా ఎక్స్ వేదికగా చిరు శుభాకాంక్షలు తెలిపారు. తమ్ముడిని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. పవన్ సంకల్ప సాధకుడంటూ ప్రశంసించారు. "నిబద్ధత, బాధ్యత, అనుక్షణం ప్రజలకు మంచి చేయాలనే చిత్తశుద్ధి.. ఇవన్నీ కల్యాణ్ బాబులో చిన్నప్పటి నుంచీ చూస్తున్నా. మా కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తాడో.. తనను నమ్మిన ప్రజలపైనా అంతే ప్రేమ చూపిస్తాడు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత గ్రామాభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల మౌలిక అవసరాల కల్పనకు అంకితభావంతో పనిచేస్తూ.. పాలనలో తనదైన ముద్ర వేస్తున్నాడు. ఏళ్లుగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తూ, మారుమూల ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నాడు. పవన్‌ను ఇలా చూస్తుంటే ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే కల్యాణ్ బాబు.. ప్రతి అడుగులోనూ విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని చిరంజీవి తన పోస్టులో రాసుకొచ్చారు.





### అన్నయ్యా.. మీరే నా మొదటి హీరో: పవన్

చిరు తెలిపిన బర్త్ డే విషెస్‌పై పవన్ కల్యాణ్ స్పందించారు. చిరంజీవి ఇచ్చిన ప్రోత్సాహం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైనదని తెలిపారు. కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "అన్నయ్యా.. మీ ప్రేమకు, ఆప్యాయతకు, శుభాకాంక్షలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. చిన్ననాటి నుంచి నాపై మీరు ఉంచిన నమ్మకం, ఇచ్చిన అండ నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైనవి. తండ్రి స్థానంలో నిలిచి నాకు దిశ చూపిన మీరు నా జీవితంలో మొదటి హీరో. జీవితంలో ఏం సాధించాలో తెలియని రోజులనుంచి నన్ను నడిపించిన మీ మాటలు, మీ ఆలోచనలు నాతోనే ఉన్నాయి. కుటుంబం పట్ల మీ ప్రేమను, సమాజం పట్ల మీ బాధ్యతను, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలనే మీ తపనను చూస్తూ పెరిగాను. ఆ అనుభవాలే నా ఆలోచనలకు ఒక దిశను ఇచ్చాయి. మీరు నా జీవితానికి ఎప్పటికీ మార్గదర్శి. మన ఇలవేల్పు శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులతో, మీ ఆశీస్సులతో ముందుకు సాగుతాను" అని పవన్ రాసుకొచ్చారు.



# ఓజీ-2.. గ్లింప్స్‌లో అదిరిపోయే ట్విస్ట్

పవన్ కళ్యాణ్ ఓజీ-2పై అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. పవన్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు సుజీత్ అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇచ్చారు. సీక్వెల్‌కు సంబంధించిన చిన్న గ్లింప్స్‌ను విడుదల చేసి సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశారు. గతేడాది విడుదలైన 'ఓజీ' పవన్ కళ్యాణ్ అభిమానులకు కావాల్సిన ఫుల్ మాస్ ట్రీట్ ఇచ్చింది. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన సినిమాలో పవన్‌ను అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో.. దాదాపు అలాంటి పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించారు దర్శకుడు సుజీత్. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ స్టైల్, యాక్షన్, డైలాగ్స్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్‌లోనే సీక్వెల్‌కు సంబంధించిన హింట్ ఇవ్వడంతో 'ఓజీ-2'పై అప్పటి నుంచే ఆసక్తి మొదలైంది. ఇప్పుడు విడుదల చేసిన గ్లింప్స్ చూస్తుంటే.. రెండో భాగం మరింత భారీగా, మాస్ యాక్షన్‌తో ఉండబోతున్నట్టు తెలుస్తోంది. 'ఓజీ-2' కథలో ప్రధానంగా ఓజాస్ గంభీర పాత్ర చుట్టూనే కథ తిరగనున్నట్టు గ్లింప్స్ ద్వారా హింట్ ఇచ్చారు. ముంబై మాఫియా ప్రపంచాన్ని వణికించిన గంభీర కొంతకాలం ముంబైని వదిలి వెళ్లిపోతాడు. అసలు గంభీర ముంబై నుంచి ఎందుకు వెళ్లాడు? ఎక్కడికి వెళ్లాడు? ఆ సమయంలో అతని జీవితంలో ఏం జరిగింది? తిరిగి ముంబైకి ఎందుకు వచ్చాడు? అనే ప్రశ్నలకు సమాధానమే 'ఓజీ-2' కథగా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. అయితే ఇది పూర్తిస్థాయి సీక్వెలా? లేక ఫస్ట్ పార్ట్‌లో చూపించని గత కథను చెప్పే ప్రీక్వెల్ తరహా కథనా? అనే విషయంపై మేకర్స్ క్లారిటీ ఇవ్వలేదు. ప్రేక్షకులకు తెలియని గంభీరుడి జీవితంలోని మరో కీలక అధ్యాయాన్ని చూపించబోతున్నట్టు మాత్రం గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది.

# కడుపారా నవ్వుకోవచ్చు!



నటుడు అల్లరి నరేశ్ మళ్లీ తన కామెడీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన నటించిన తాజా కామెడీ ఎంటర్టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. చంద్రమోహన్ చింతాడ తెరకెక్కించారు. సెప్టెంబర్ 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అల్లరి నరేశ్ ఈ చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ప్రేక్షకులు నా నుంచి 'కితకితలు', 'బెండు అప్పారావు' లాంటి సినిమాలు మిస్ అవుతున్నారు. అలాంటి కథ గురించి చూస్తున్నప్పుడు చంద్రమోహన్ నాకీ కథ చెప్పారు. చాలా నచ్చింది. మీ అందరికీ ఇదొక కొత్త అనుభూతినిస్తుంది. మా నాన్న స్టయిల్లో ఈ సినిమాను చేశాం. ప్రేక్షకులు కచ్చితంగా హ్యాపీగా నవ్వుకుంటారు. 'సుడిగాడు-2' చేయాలనుంది. కానీ, ఇప్పుడు కాపీరైట్ సమస్యలు ఎక్కువయ్యాయి. సినిమా రిలీజ్ ట్రైలర్‌లో ఎవరు అభ్యంతరం చెబుతారో తెలియదు. అందుకే ఆలోచిస్తున్నా. యువ దర్శకుల్లో రితేశ్ రానా, తరుణ్ భాస్కర్ మేకింగ్ స్టయిల్ నాకు బాగా ఇష్టం. మంచి కథలు వస్తే మల్టీస్టారర్ సినిమాలు చేయడానికి ఎప్పుడూ సిద్ధమే" అని అల్లరి నరేశ్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి దర్శకత్వం వైపు వెళ్లే ఆలోచన లేదని, నటనపైనే పూర్తి దృష్టి పెట్టానని స్పష్టం చేశారు. ఇకపై తన కెరీర్లో రెండు కామెడీ చిత్రాలు, ఒక సీరియస్ సినిమా ఉండేలా బ్యాలెన్స్ చేసుకుంటానని తెలిపారు. కాగా, ఆయన తదుపరి చిత్రాలు 'ఆల్కహాల్' విడుదలకు సిద్ధంగా ఉండగా, 'కనకదుర్గ' షూటింగ్ దశలో ఉంది.

# నేపాల్‌కు కొత్త జీవితమిద్దాం

కరోనా లాక్‌డౌన్ కష్ట కాలంలో వలస కార్మికులకు అండగా నిలిచి 'రియల్ హీరో' అనిపించుకున్నాడు సోనూ సూద్. ఇప్పుడు నేపాల్ వరద బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు ముందుకొచ్చారు. నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నిత్యావసరాలు, సహాయక సామగ్రితో నేపాల్ రాజధాని కాఠ్మండూ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. సోషల్ మీడియా వేదికగా కొన్ని విషయాలు పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. "పునరావాస కేంద్రాల్లోని చిన్నారులను చూస్తుంటే మనసు ముక్కలవుతోంది. చాలామంది పిల్లల తల్లిదండ్రులు వరదల్లో కనిపించకుండాపోయారు. మనమెంత నిస్సహాయులమో వాళ్లను చూస్తే అర్థమవుతోంది. నేను ఓ పునరావాస కేంద్రానికి వెళ్లినప్పుడు క్రిస్టినా అనే 8 ఏళ్ల చిన్నారిని కలిశాను. తమ్ముడితో ఉన్న ఆ పాప నావైపు చూసి నవ్వుతూ.. 'అంతా సర్దుకుంటుంది' అని చెప్పింది. నేను కారు ఎక్కే వరకు ఆ చిన్నారి నా వెంటే ఉంది. ఆ పాపను దత్తత తీసుకోవాలనిపించింది. కానీ ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాను" అని సోనూ సూద్ ఆవేదన వ్యక్తం చేశారు. "మనం సురక్షిత ప్రాంతాల్లో ఉన్నందుకు అదృష్టవంతులం. మీరెంత బిజీగా ఉన్నా.. ఇలాంటి కుటుంబాల కోసం కాస్త సమయం కేటాయించండి. మీకు చేతనైనంత విరాళాలు పంపండి. ఇలాంటి విపత్తులు వచ్చినప్పుడు ఆదుకోవడం ప్రభుత్వం, మంత్రుల బాధ్యత మాత్రమే అనుకోవద్దు. ఒక మనిషిగా, భారతీయుడిగా ఇది మనందరి బాధ్యత" అన్నారు. "వాళ్లు తమ ఇళ్లను, కుటుంబాలను, అందమైన బాల్యాన్ని కోల్పోయారు. మనమంతా కలిసి వారికి ఓ కొత్త జీవితాన్ని అందిద్దాం. నేపాల్.. నువ్వు ఒంటరివి కావు" అని సోనూ సూద్ తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు.





# ఇచ్చిన డేట్‌కే జైలర్-2

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం జైలర్. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న సినిమా విడుదల ఖరారైంది. 'జైలర్-2' రిలీజ్ డేట్‌పై ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నప్పటికీ తాజాగా టీమ్ అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 15న దీన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు తెలిపింది. 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుందని గతంలో శివరాజ్ కుమార్ చెప్పడం తెలిసిందే.

# కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ' టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. "కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ" అనే పవర్‌ఫుల్ బిరుదులతో సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

